

2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 11 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 156 | పేజీలు:12 | వెల రూ.5





2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



## పాలనలో మోడీ రికార్డ్

### రాష్ట్రపతి అభినందనలు

**ఢిల్లీ, జూన్ 10:** ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మోడీకి అభినందనలు తెలిపారు. మోడీ నాయకత్వంపై దేశ ప్రజలకు ఉన్న అచంచలమైన నమ్మకానికి ఈ మైలురాయి నిదర్శనమని కొనియాడారు. ఆయన పాలనలో దేశం అన్నిరంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం చేపట్టిన విస్తృతమైన సంక్షేమ కార్యక్రమాలు అట్టడుగు స్థాయి ప్రజలకు కూడా అభివృద్ధి ప్రయోజనాలు సమానంగా అందించేలా చేశాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ...మిగతా 2లో

ఫ్యూచర్ సిటీ పేరుతో...

# అద్భుత నగరం



- నగరాన్ని అడ్డుకునేటోళ్లను ప్రజలే అడ్డంగా తొక్కుతరు
- బంగారం కంటే రంగారెడ్డి జిల్లా భూములకు ధరలెక్కువ
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదా కూడా రాదు
- హైదరాబాద్‌లో వరదలకు గత పాలకులు సమాధానం చెప్పాలె
- ఫ్యూచర్ సిటీ 500 ప్రముఖ కంపెనీలను రప్పిస్తున్నం
- ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ భవనం ప్రారంభం:సీఎం

**హైదరాబాద్, జూన్ 10 ( మనం బ్యూరో ) :** రేపటి భవిష్యత్తుకు పునాదులు వేసి ప్రపంచానికి అద్భుతమైన నగరాన్ని అందించబోతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం మన కోసమే కాదు...మొత్తం ప్రపంచానికని పేర్కొన్నారు. బుధవారం భారత్ ఫ్యూచర్ సిటీలో సీఎం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) భవనంతో పాటు లోగో, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఫ్యూచర్ సిటీ పరిధిలోకి కొన్ని గ్రామాలు తీసుకువస్తున్నట్లు సభా వేదికపై సంతకం చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ రాష్ట్రానికి 60 శాతం ఆదాయం హైదరాబాద్, సికింద్రాబాద్ నుండే వస్తోందన్నారు. బంగారానికంటే రంగారెడ్డి జిల్లా భూములకు విలువ ఎక్కువన్నారు. కేవలం 150 రోజుల్లోనే ఈ కార్యాలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు. వచ్చే ఎనిమిదేళ్లలో న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌తో పోటీ పడేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తామని చెప్పారు. హైటెక్ సిటీ, ఓఆర్ఆర్, జీనోమ్ వ్యాలీని అడ్డుకోవాలని చాలా మంది కుట్రలు చేశారనీ, నగరాన్ని విస్తరించకపోతే 10 లక్షల మంది ఐటీ నిపుణులు రాణించే వారా ? అని ప్రశ్నించారు. భారత్ సిటీని రద్దు చేస్తామని పెద్ద రాక్షసుడు, చిన్న రాక్షసుడు అంటున్నారనీ, బీఆర్ఎస్ నేతలు ఇలాగే ప్రవర్తిస్తే వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా రాదని పేర్కొన్నారు. ప్రపంచానికి ఒక దిక్సూచిలా ఫ్యూచర్ సిటీగా గొప్ప నగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఉంటే కళ్లలో నిప్పులు పోసుకుని కడుపులో విషం నింపుకుని అమెరికాలో కూడా ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటున్నారని మండిపడ్డారు. తొలకరి వర్షం పడితేనే హైదరాబాద్‌లో రోడ్లు ఎక్కడిక్కడ స్తంభించిపోయాయనీ, రూ.100 కోట్లకు ఎకరం అమ్మినమని జబ్బలు చరుచుకుంటున్న వాళ్లు నిన్నటి వరదలకు సమాధానం చెప్పాలని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని కుంటలను చెరపట్టడం వల్లనే చెరువుల్లో ఉండాల్సిన నీళ్లు కాలనీలు, బస్తీలకు వచ్చాయనీ, ప్రభుత్వ భూములు, చెరువులను, కుంటలను ఆక్రమించుకున్న వారి కట్టడాలను నిర్దాక్షిణ్యంగా కూలుస్తున్నామని విమర్శించారు.జ

హైదరాబాద్‌లో కబ్జాకోరుల భరతం పడుతున్నామనీ, జూన్ 10 న సువర్ణ అధ్యాయాన్ని సృష్టించామనీ, గ్రీన్ ఫార్మా, జీసీసీ, ఐటీ కంపెనీలతో పాటు ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిన 500 పెద్ద కంపెనీలకు ఫ్యూచర్ సిటీకి రప్పించబోతున్నామని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీలో ఈరోజు కొన్ని గ్రామాలను కలిపామనీ, భవిష్యత్తులో ఈ నగరం గొప్పగా రాణిస్తుందనడంలో అనుమానం లేదన్నారు. అడ్డుపడిన వాళ్లను అడ్డంగా తొక్కుకుంటూ ఈ ప్రాంతం వారే వెళతారనీ, ఈ నగరాన్ని ఇక్కడి వారే కాపాడుకుంటురని స్పష్టం చేశారు. వీలైనప్పుడల్లా ఫ్యూచర్ సిటీ అథారిటీ కార్యాలయానికి వస్తా, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు వారానికోసారి ఇక్కడకు వస్తారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ‘మీనాక్షి’ అంశంపై కోవర్టు గుర్తింపు?

- రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వెనక కీలక నేత
- నేడు ఏఐసీసీకి సీఎం రేవంత్ నివేదిక



**హైదరాబాద్, జూన్ 10 ( మనం బ్యూరో ) :** ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వెనక రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ నేత గుట్టు రట్టయిందనీ, పూర్తి వివరాలతో ఆ వెన్నుపోటుదారుపై సీఎం రేవంత్ రెడ్డి ఒక నివేదికను ...మిగతా 2లో

## భారతీరాజా మృతిపై సీఎం రేవంత్ సంతాపం

**హైదరాబాద్, జూన్ 10, ( మనం బ్యూరో ) :** ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు భారతీరాజా మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేసిన భారతీ రాజా దర్శకుడుగా, నటుడుగా విశేఖ ఖ్యాతి గడించారని కొనియాడారు. భారతీయ చలన చిత్ర రంగానికి ముఖ్యంగా దక్షిణ భారత సినిమాకు సరికొత్త నడకను, నవ్యతను పరిచయం చేసి లెజెండరీ దర్శకులు భారతీరాజా అని పేర్కొన్నారు. ఎన్నో వైవిధ్యభరితమైన సందేశాత్మక చిత్రాలను వివిధ భాషల్లో తెరకెక్కించి భారతీయ చలనచిత్ర రంగానికి విశిష్ట సేవలందించారనీ, భారతీరాజా మరణం చలనచిత్ర రంగానికి తీరని లోటని భగవంతుడు వారి ఆత్మకు సద్గతి ప్రసాదించాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులు, అభిమానులకు సానుభూతిని తెలిపారు.

## వేసవి నాటికి మేడిగడ్డ పునరుద్ధరణ



- ప్రాజెక్టుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్,జూన్10(మనం న్యూస్) :** మేడిగడ్డ బ్యారేజ్‌తో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను అత్యంత శాస్త్రీయ పద్ధతిలో చేపట్టి వచ్చే వేసవి నాటికి పూర్తిచేసి తిరిగివినియోగంలోకి తీసుకువస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.మెడిగడ్డ బ్యారేజ్ వద్ద జరుగుతున్న సాంకేతిక పరిశోధనలు, హైడ్రాలజికల్ అధ్యయనాలు, జియోటెక్నికల్ పరీక్షలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ సర్వేలు,పునరుద్ధరణ ప్రణాళికల పురోగతిని బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాలు పూర్తవుతాయని, అనంతరం సేకరించిన నివేదికలను కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా ...మిగతా 2లో

## నేడు కాంగ్రెస్ అత్యవసర సమావేశం



**ఢిల్లీ, జూన్ 10:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జూన్ 11న అత్యవసర సమావేశం జరగనుంది. ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఉదయం 11.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్చార్జులు, పీసీసీ అధ్యక్షులు తప్పనిసరిగా హాజరుకావాలని అధిష్ఠానం ఆదేశించింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సర్క్యులర్ జారీ చేశారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.

## ఇక.. నో ఫ్రెండ్లీ పోలీసింగ్

- బాధితులను గౌరవించాలి
- రౌడీలు,గుండాలపై ఉక్కుపాదం మోపాలి
- నేరస్థుల పట్ల సానుభూతి అవసరం లేదు
- గ్రేహౌండ్స్‌ను పునర్వ్యవస్థీకరిస్తం
- అక్కడి సిబ్బందికి ఇతర విభాగాలకు బదిలీ



**హైదరాబాద్,జూన్ 10(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** ఇక నుంచి రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండదని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కీలక వ్యాఖ్యలు చేశారు. అయితే సాధారణ ప్రజలను, బాధితులను గౌరవిస్తామన్నారు. నేర చరిత కలిగిన రౌడీ, గుండాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర డీజీపీ బుధవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మావోయిజం అంతమైందని అందుకే దానికోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి గ్రేహౌండ్స్ విభాగాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రేహౌండ్స్ విభాగాన్ని పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. గ్రేహౌండ్స్‌లో పనిచేస్తున్న సిబ్బందిని కొత్త విభాగాలకు బదిలీ చేస్తూ, వారి సేవలను ఇతర కీలక రంగాల్లో వినియోగించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మావోయిజం పూర్తిగా అంతమైన క్రమంలో గ్రేహౌండ్స్‌లో ఉన్న సుమారు 1700 మంది సిబ్బందిని ప్రస్తుతం ...మిగతా 2లో

## సర్‌లో ‘ఐటీ’ కీలకం




- సర్ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలి
- రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారి సి. సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 10(మనం న్యూస్):** సర్ ప్రక్రియలో ఐటి అంశం అత్యంత కీలకమైనదని, దానిని సిబ్బంది విరివిగా వాడుకోని సర్ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఐటి విరివిగా వాడుకోని ఓటరు నమోదు ప్రక్రియలో పూర్తి పారదర్శకంగా ఎలాంటి తప్పులకు తావివకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. బుధవారం ఎస్ఐఆర్ ప్రక్రియలో ...మిగతా 2లో

## ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలేంటి : హైకోర్టు ఆగ్రహం

- నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం



**హైదరాబాద్,జూన్ 10(మనం,ప్రత్యేక ప్రతినిధి):** హైదరాబాద్ మెట్రో రైలు స్టేషన్‌ల కింద పాదచారుల కోసం కేటాయించిన ఫుట్‌పాత్‌లను వ్యాపార కేంద్రాలకు అడ్డాలుగా మారడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నగరంలో పాదచారుల కోసం ఉద్దేశించిన ఫుట్‌పాత్‌లను నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య అవసరాలకు లీజుకివ్వడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. మెట్రో స్టేషన్ల కింద స్టాళ్ల ఏర్పాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ ...మిగతా 2లో

## అమెరికా-ఇరాన్ మధ్య భీకర దాడులు

- అమెరికా రీపర్ డ్రోన్ కూల్చేశాం..
- క్షేమంగా ఉండాలంటే.. ఇరాన్ వార్నింగ్

**వాషింగ్టన్, జూన్ 10:** పశ్చిమాసియా మరోసారి రణరంగంగా మారింది. హర్మూజ్ సమీపంలో అపాచీ హెలికాప్టర్ కూలిపోయిన ఘటనకు సంబంధించి ఇర్పా అమెరికా ప్రతీకార దాడులకు దిగింది. దీనికి టెహ్రాన్ కూడా గట్టిగా ప్రతిస్పందిస్తోంది. గల్ఫ్ ప్రాంతాల్లో అగ్రరాజ్య స్థావరాలే లక్ష్యంగా భీకర దాడులు చేస్తోంది.




అమెరికా దాడులను దురాక్రమణ చర్యగా ఐఆర్జీసీ అభివర్ణించింది. బహ్రెయిన్లోని అమెరికా నావికా ఫ్లీట్‌తోపాటు, జోర్డాన్‌లోని ఆ దేశానికి చెందిన అల్ అజ్రాక్ వైమానిక స్థావరం లక్ష్యంగా దాడులు చేసినట్లు తెలిపింది. కువైట్, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా ఉత్తర ఇరాక్‌లలో పలు పేలుడు శబ్దాలు వినిపించాయి. తమ భూభాగంపై దాడులు ఇలానే కొనసాగితే.. తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. దీనికి ముందు దక్షిణ ఇరాన్‌లోని జాస్క్, సిరిక్, ఖేష్మ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా యూఎస్ దళాలు దాడులు ...మిగతా 2లో

## ఇరాన్ భారీ మూల్యం చెల్లిస్తుంది

- ఇరాన్‌పై ప్రతీకార దాడులు
- ట్రంప్ వార్నింగ్

**వాషింగ్టన్, జూన్10 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌కు తాము పూర్తిగా ఓడించామని.. సైనిక పరంగా ఆ దేశం సర్వనాశనం అయిందని పేర్కొన్నారు. ప్రస్తుతం టెహ్రాన్ వద్ద క్షిపణి సామర్థ్యం 21 శాతానికి మాత్రమే పరిమితమైందన్నారు. ఒప్పందం కుదుర్చుకోవడానికి సమయం మించిపోతున్నా అక్కడి నేతలు ఇంకా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఇందుకు ఆ దేశం భారీ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు.



ఇరాన్ నేతలవి మాటలే కానీ చేతలు ఏమీ ఉండవని ట్రంప్ ఎద్దేవా చేశారు. వారికి మేలు చేయడానికి తాము త్వరగా యుద్ధం ముగించడానికి చర్యలు తీసుకుంటుంటే ఇరాన్ నేతలు మాత్రం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఒప్పందం విషయంలో ఆలస్యం చేస్తున్నందుకు టెహ్రాన్‌లోని విద్యుత్ కేంద్రాలు, వంతెనలపై తమ సైన్యం కొత్త దాడులు చేపట్టే అవకాశం ఉందన్నారు. ఆ దేశం మరిన్ని క్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇదిలావుండగా టెహ్రాన్-వాషింగ్టన్‌ల మధ్య ఒప్పందాన్ని ఖరారు చేసే ప్రయత్నంలో భాగంగా ఖతార్ ప్రతినిధులు ఇరాన్‌కు వెళ్లినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

హర్మూజ్ సమీపంలో అమెరికా అపాచీ హెలికాప్టర్ కూలిపోయిన ఘటనకు సంబంధించి ఇరాన్‌పై యూఎస్ ప్రతీకార దాడులు మొదలుపెట్టింది. ఇరానే తమ హెలికాప్టర్ కూల్చేసిందని అంతకుముందు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ప్రతీకార దాడులు చేస్తామని హెచ్చరించారు. ట్రంప్ ప్రకటన అనంతరం అమెరికా మిలిటరీ దాడులకు దిగింది. ఇరాన్ అనుచిత దాడి కారణంగానే తాము దాడులు చేపడుతున్నట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. హర్మూజ్ సమీపంలోని ఖేష్మ్ దీవిలో బాంబు దాడుల శబ్దాలు వినిపించినట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. ఒమన్ తీరం వెంబడి హర్మూజ్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున గస్తీ తిరుగుతుండగా.. మిలిటరీ హెలికాప్టర్ ఏహెచ్-64 అపాచీ కూలిపోయింది. అందులోని తమ ఇద్దరు పైలట్లను ఓ డ్రోన్ బోట్ సహాయంతో అమెరికా రక్షించింది. ఇరాన్ డ్రోన్ దాడి కారణంగానే హెలికాప్టర్ కూలిపోయినట్లు అమెరికా దర్యాప్తులో తేలింది.

## పాక్ బాంబుల వర్షం.. నిద్రలోనే 11 మంది చిన్నారుల మృతి

**ఇస్లామాబాద్, జూన్ 10:** అఫ్గానిస్థాన్- పాకిస్థాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు తలెత్తాయి. అర్ధరాత్రి వేళ అఫ్గాన్ సరిహద్దుల్లోని నివాస ప్రాంతాలపై పాక్ బాంబులతో విరుచుకుపడింది. ఈ ఘటనలో 11 మంది చిన్నారులు నిద్రలోనే కన్నుమూశారు.

మంగళవారం అర్ధరాత్రి దాటాక ఖోస్ట్, కునార్, పక్తికా ప్రావిన్స్‌లలోని పౌర నివాసాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లు అఫ్గాన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ ...మిగతా 2లో



## బ్రెజిల్ టీమ్‌పై కేరళ అభిమానం

**తిరువనంతపురం, జూన్ 10:** మరికొద్ది రోజుల్లో ఫుట్బాల్ ప్రపంచకప్ ప్రారంభం కానుంది. టోర్నీ దగ్గరపడుతున్న కొద్దీ కేరళలోని సాకర్ అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపు అవుతోంది. తాజాగా మలప్పురంలో కొందరు బ్రెజిల్ టీమ్ అభిమానులు ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. బ్రెజిల్ ఆటగాళ్ల చిత్రాలతో 400 అడుగుల పొడవు, 12 అడుగుల ఎత్తుతో రహదారి వెంట దీనిని ఏర్పాటు చేశారు. బ్రెజిల్ ఫుట్బాల్ సూపర్‌స్టార్ నెయ్మర్ చిత్రాన్ని ఫ్లెక్సీపై చూసి ఆ జట్టు అభిమానులు మురిసిపోతున్నారు.

## అయోధ్య రామమందిరానికి రూ.500 కోట్ల విరాళాలు

**అయోధ్య, జూన్ 10 :** అయోధ్య రామమందిరాన్ని సందర్శించే భక్తుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతుండటంతో విరాళాలు కూడా భారీగా అందుతున్నాయి. ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగినప్పటి నుంచి సుమారు 15 కోట్లకు పైగా ప్రజలు ఆలయాన్ని సందర్శించినట్లు ట్రస్ట్ వెల్లడించింది. ఫలితంగా రూ.500 కోట్లకు పైగా విరాళాలు అందాయని వివరించింది. వీటిని పారదర్శకంగా సురక్షితంగా భద్రపరుస్తున్నట్లు తెలిపింది. గణాంకాల ప్రకారం ఒక్కో భక్తుడి నుంచి సగటున రూ.33 కంటే ఎక్కువ విరాళం లభిస్తోందని ట్రస్టు వివరించింది. ప్రస్తుతం రోజుకు సగటున రూ.8 నుంచి రూ. 10 లక్షల వరకు విరాళాలు అందుతున్నాయంది. విరాళాల లెక్కింపును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)కు అప్పగించారు.

**విరాళాల దుర్వినియోగంపై విచారణ జరపాలి బీజేపీ ప్రతినిధి డిమాండ్**

రామమందిర విరాళాల నిధులను దుర్వినియోగం చేస్తున్నారన్న ప్రతిపక్షాల ఆరోపణలపై ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలచే నిష్పక్షపాత విచారణ జరిపించాలని భాజపా అధికార ప్రతినిధి డాక్టర్ రజ్నీశ్ సింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి ఆయన లేఖ రాశారు. ప్రజల్లో మందిరంపై ఉన్న నమ్మకాన్ని బలపరిచేందుకు గానూ ఈ విచారణ జరిపించాల్సిందిగా కోరారు. ఒకవేళ అవకతవకలు నిజమైతే నిందితులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. నిధులు దుర్వినియోగం అవుతున్నాయంటూ సమాజ్వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించిన నేపథ్యంలో రామాలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్రమిశ్ర మంగళవారం అయోధ్య వచ్చారు. నాలుగు గంటలపాటు ట్రస్ట్ సభ్యులతో ఆంతరంగికంగా సమావేశమయ్యారు.

### పాక్ బాంబుల వర్షం..
## నిద్రలోనే 11 మంది చిన్నారుల మృతి

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. సెరాపై జిల్లాలోని ఓ ఇంటిపై జరిగిన దాడిలోనే 9 మంది చనిపోయారని, మరో 10 మంది గాయపడ్డారని ఖోస్ట్ ప్రావిన్స్‌కు చెందిన అధికారి తెలిపారు. పక్తికా ప్రావిన్స్‌లోనిబర్మల్ జిల్లాలో జరిగిన మరో దాడిలో ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా చిన్నారులేనని స్థానికులు తెలిపారు. బాధితులు నిద్రిస్తున్న సమయంలో ఈ దాడులు జరగడంతో.. వారు తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ దాడి ఘటనలో మొత్తం 11 మంది చిన్నారులతో సహా ఓ మహిళ, ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయారు. మరో 14 మంది గాయపడగా.. వారిలో అనేకమంది మహిళలు, చిన్నారులే ఉన్నారు. మృతి చెందిన చిన్నారుల ఫొటోలను జబిహుల్లా ఎక్స్లో పంచుకున్నారు. కాగా.. ఈ దాడుల విషయంపై పాక్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

అఫ్గాన్ సరిహద్దుల్లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని ఓ సెక్యూరిటీ పోస్టుపై ఇటీవల దాడి జరిగింది. తాలిబన్ మిలిటెంట్లు ఈ దాడి చేసినట్లు పాక్ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు గాయపడ్డారని పాక్ అంతర్గత వ్యవహారాల శాఖ తెలిపింది. ఈ ఘటన జరిగిన నేపథ్యంలో అఫ్గాన్‌పై వైమానిక దాడులు చేయడం గమనార్హం.

## పాలనలో మోడీ రికార్డ్

(మొదటి పేజీ తరువాయి)

పథకాలు పీఎం-జన్మన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (ఆదివాసీల కోసం ఏర్పాటుచేసిన పథకాలు)లకు తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని ముర్ము వెల్లడించారు.

మోడీ స్ఫూర్తిదాయక ప్రస్థానం భావితరాల్లో భారతదేశపు బలమైన ప్రజాస్వామ్య సంప్రదాయాలపై ఆశను నూతన విశ్వాసాన్ని నింపుతుందని రాష్ట్రపతి కొనియాడారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ దార్శనికతతో ప్రధాని దేశాన్ని మరింత ముందుకుతీసుకువెళ్తారని విశ్వాసం వ్యక్తంచేశారు.

**మోదీ రికార్డు..**

ప్రధానిగా వరుసగా అత్యధిక కాలం దేశాన్ని పాలించిన రికార్డును నేటితో నరేంద్ర మోడీ తన ఖాతాలో వేసుకున్నారు. దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూను అధిగమించి ఈ ఘనతను సొంతం చేసుకున్నారు. మోడీ 2014 మే 26న తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి పదవిలో (వరుసగా మూడోసారి) కొనసాగుతున్నారు. బుధవారం (నేడు)తో ఆయన ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. ఎన్నికైన ప్రధానమంత్రిగా నెహ్రూ 1952 మే 13 నుంచి 1964 మే 27 వరకు వరుసగా 4,398 రోజులు పని చేశారు. తర్వాత వరుసగా అత్యధిక కాలం భారత ప్రధానిగా కొనసాగిన వారి జాబితాలో ఇందిరాగాంధీ మూడో స్థానంలో ఉన్నారు. ఆమె 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు వరుసగా 4,077 రోజులు పదవిలో ఉన్నారు.

## ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలేంటి హైకోర్టు ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపల్ కార్పొరేషన్,హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ అధికారులను ఆదేశించింది. పాదాచారుల కోసం కేటాయించిన స్థలాలను స్టాళ్లకు లీజుకు ఇచ్చే అధికారం ఎవరిచ్చారని అధికారులను నిలదీసింది. ప్రజల రాకపోకలకు అత్యంత కీలకమైన, సున్నితమైన ఈ స్థలాలను వ్యాపార అవసరాలకు వినియోగించడం ఏమాత్రం సమంజసం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ సంస్థలు ప్రజల సౌకర్యార్థం పనిచేయాలి తప్ప, ఉన్న దారిని కూడా



వ్యాపారాలకు కేటాయించి సామాన్యులను ఇబ్బందులకు గురిచేయకూడదని వ్యాఖ్యానించింది. ఈ విషయంలో భద్రతా ప్రమాణాలను, నిబంధనలను ఎలా విస్మరిస్తారని అధికారులను ప్రశ్నించింది.

ఫుట్‌పాత్‌లపై నిర్వహిస్తున్న వ్యాపారాలకు సంబంధించి జీహెచ్ఎంసీ, మెట్రో అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు.. అనే అంశాలపై పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. నివేదిక సమర్పించేందుకు అధికారులకు గడువు ఇస్తూనే, తదుపరి విచారణలో ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగేలా ఆక్రమణలు, లీజులు ఉంటే న్యాయస్థానం ఊరుకోదని ఈ సందర్భంగా హెచ్చరించింది.

# ఇక..నో ఫ్రెండ్లీ పోలీసింగ్

(మొదటి పేజీ తరువాయి)

అత్యవసరంగా సైబర్ క్రైమ్, నార్కోటిక్స్ వంటి విభాగాలకు బదిలీ చేస్తున్నట్లు డీజీపీ సీవీ ఆనందర్ పేర్కొన్నారు. పోలీసు శాఖకు గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా పెద్ద సవాల్‌గా మారిందని డీజీపీ పేర్కొన్నారు. వాటి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. డ్రగ్స్ ముఠాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, నేరస్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, సైబర్ క్రైమ్ ఇప్పుడు పోలీసు శాఖకు ప్రధాన సమస్యగా మారిందని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసు వ్యవస్థ సైతం మారాల్సిన అవసరం ఉందని, ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇక, ప్రజలకు భరోసా ఇచ్చే పోలీసింగ్ కొనసాగుతుంది. కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకునే రౌడీలు, గూండాలకు మాత్రం కఠినమైన పోలీసింగ్ తప్పదనే విషయం గుర్తుంచుకోవాలి అని డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తున్న గంజాయి, డ్రగ్స్ మహమ్మారిపై యుద్ధం ప్రకటిస్తున్నట్లు సీవీ ఆనంద్ తెలిపారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల సరఫరా, విక్రయాలను అడ్డుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, డ్రగ్స్ నెట్‌వర్క్‌లను పూర్తిగా ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. టెక్నాలజీని వాడుకుంటూ అమాయకులను దోచుకుంటున్న సైబర్ కేటుగాళ్ల ఆట కట్టించేందుకు పోలీస్ సిబ్బందికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ ఇస్తున్నట్లుగా తెలిపారు. సైబర్ విభాగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లుగా పేర్కొన్నారు.

స్వల్ప పెట్టుబడులతో అత్యధిక ఆదాయాలు వస్తాయన్న అత్యాశ వదులుకుంటేనే సైబర్ క్రైమ్ కంట్రోల్ అవుతుందని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరాల కట్టడికి పోలీసు శాఖ మరింత సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగుతోందన్నారు. ఒకవైపు సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ మరోవైపు సైబర్ కేటుగాళ్లను గుర్తించి కఠినంగా శిక్షిస్తామన్నారు. ఇందుకు ప్రజలు సైతం సహకరించాలని కోరారు.

తెలంగాణ రాష్ట్రంలో మాదక ద్రవ్యాలపై కఠినంగా వ్యవహరిస్తామని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ప్రస్తుతం నక్సలిజం అంతరించిన మాదకద్రవ్యాల వినియోగంతో యువత పెడదారి పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తప్పక హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం అలవాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తుకు ముఖ్య పాత్రపోషిస్తారని, యువతను నిర్వీర్యం చేసే అసాంఘిక శక్తులపై పోలీసు శాఖ నిరంతరం నిఘా సారిస్తోందన్నారు. యువత సైతం వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సరైన మార్గంలో ప్రయాణించాలని డీజీపీ హితవు పలికారు.

## వేసవి నాటికి మేడిగడ్డ పునరుద్ధరణ

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలకు పంపుతామని మంత్రి తెలిపారు. సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్లను ఖరారు చేసి వర్షాకాలం ముగిసిన వెంటనే నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ తొలి వారంలో పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని, ఒకే పని సీజన్‌లో పనులు పూర్తి చేసి వచ్చే వేసవి నాటికి బ్యారేజీలను తిరిగి అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈనెల చివరి నాటికి అన్ని పరీక్షలు, పరిశోధనలు పూర్తవుతాయని ఆయన వెల్లడించారు.

భవిష్యత్తులో ఈ తరహా నష్టం పునరావృతం కాకుండా ఉండేందుకు 40 నుంచి 80 మీటర్ల లోతు వరకు బోర్‌హోల్స్ తవ్వి భూగర్భ పరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నామని, కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థల ఆమోదం వచ్చిన తర్వాతే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని ఉత్తమ్ కుమార్ స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలతో పాటు ప్రాజెక్టుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని, గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్ది, శాశ్వత భద్రతా ప్రమాణాలతో మేడిగడ్డతో పాటు అన్ని బ్యారేజీలను పునరుద్ధరించి, తెలంగాణ రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా ప్రాజెక్టులను తిరిగి సురక్షితంగా, సమర్థవంతంగా అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

### భారతీయులున్న నౌకపై దాడి..
## ముగ్గురు మిస్సింగ్..

**ఢిల్లీ, జూన్ 10:** హర్మూజ్ జలసంధి ప్రవేశ మార్గంలోని ఒమన్ తీరంలో భారతీయులున్న మరో నౌకపై బుధవారం దాడి జరిగింది. పలావు జెండాతో బయల్దేరిన వాణిజ్య నౌక లక్ష్యంగా జరిగిన ఈ దాడిని భారత విదేశాంగ శాఖ ఖండించింది. నౌకలోని




24 మంది భారతీయుల్లో 21 మందిని సహాయక సిబ్బంది రక్షించారని, మరో ముగ్గురు గల్లంతైనట్లు పేర్కొంది. వీరికోసం గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది. పరిస్థితులను భారత రాయబార కార్యాలయం నిశితంగా పర్యవేక్షిస్తోందని, రెస్క్యూ ఆపరేషన్ ఒమన్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటున్నట్లు వివరించింది.

''ఒమన్ తీరంలో వాణిజ్య నౌకపై దాడిని ఖండిస్తున్నాం. గల్లంతైన ముగ్గురు భారతీయులను రక్షించేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఈ ప్రాంతంలో నౌకా రవాణాపై నిరంతరం దాడులు జరుగుతుండటం ఆందోళన కలిస్తోంది. ఉద్రిక్తతలను తక్షణమే తగ్గించాలని.. ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం తిరిగి నెలకొనేందుకు దౌత్యపరమైన పరిష్కారం కోసం జరుగుతున్న చర్చలకు త్వరగా ముగింపు పలకాలని పిలుపునిస్తున్నాం. వాణిజ్య నౌకాయానం, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకునే చర్యలకు ముగింపు పలకాలి. అంతర్జాతీయ చట్టానికి అనుగుణంగా స్వేచ్ఛాయుత నౌకాయానం, వాణిజ్యం వీలైనంత త్వరగా పునరుద్ధరించాలి'' అని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

**అమెరికా దౌత్యవేత్తకు సమన్లు**

ఒమన్ తీరంలో వాణిజ్య నౌకపై దాడిని ఖండించిన భారత్.. అమెరికా చర్యలపై తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఢిల్లీలోని అమెరికా దౌత్యవేత్తకు సమన్లు జారీ చేసింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అదనపు కార్యదర్శి నాగరాజ్ నాయుడు.. అమెరికా దౌత్యవేత్త జేసన్ మీక్కు సమన్లు జారీ చేశారు.

## పీవోకేలో కూలిన పాకిస్థాన్ హెలికాప్టర్

**కరాచీ, జూన్ 10:** పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో పాక్ సైన్యానికి చెందిన ఓ హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ఘటనలో సైనికులందరూ ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి మిలిటరీ వర్గాలు పేర్కొన్నాయి.



అయితే, ఘటన సమయంలో అందులో ఎంత మంది ఉన్నారనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. సుమారు 21 మంది పాక్ సైనికులు చనిపోయినట్లు వార్తలు వస్తున్నాయి.

ముజఫరాబాద్‌లో స్థానిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అక్కడ పాక్ ఆర్మీ అదనపు బలగాలను మోహరిస్తోంది. ఇందులో భాగంగా పాక్ సైనికులతో ఉన్న హెలికాప్టర్ ముజఫరాబాద్ నుంచి బయలుదేరింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న రెస్క్యూ సిబ్బంది బాధితులను సమీప ఆసుపత్రులకు తరలించారు. అయితే, వీరిలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని పాక్ ఆర్మీ ప్రకటించింది.

పీవోకేలో ఇటీవల జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ)పై నిషేధం విధించడంపై స్థానికంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో నిరసన చేస్తున్న పౌరులపై సైన్యం జరిపిన కాల్పుల్లో 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు పాక్ ప్రభుత్వం వెల్లడించింది. అయితే, వాస్తవంగా ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉన్నట్లు సమాచారం.

## అమెరికా పైలట్లను కాపాడిన డ్రోన్ బోట్ వెనక 'వైభవ్'!

**వాషింగ్టన్, జూన్ 10:** అమెరికా మిలిటరీకి చెందిన అపాచీ హెలికాప్టర్‌ను కూల్చివేసినందుకు ఇరాన్‌పై అగ్రరాజ్యం ప్రతీకార దాడులకు దిగింది. దాంతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయితే ఆ హెలికాప్టర్లోని పైలట్లను డ్రోన్ బోట్ సహాయంతో అమెరికా రక్షించింది. ఇలాంటి కీలక ఆపరేషన్‌లోపాల్గొన్న బోట్ తయారీ వెనక భారతీయ మూలాలున్న టెక్ ఎగ్జిక్యూటివ్ వైభవ్ ఆల్టేకర్



పాత్ర ఉండటం విశేషం. అమెరికా సైన్యం వినియోగిస్తున్న డ్రోన్ బోట్ కార్సెయిర్‌ను సరోనిక్ టెక్నాలజీస్ అభివృద్ధి చేసింది. టెక్సాస్ కేంద్రంగా 2022, సెప్టెంబర్‌లో ఏర్పాటైన ఈ సంస్థకు భారతీయ మూలాలున్న వైభవ్ ఆల్టేకర్ సహ వ్యవస్థాపకులు. అలాగే, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గానూ వ్యవహరిస్తున్నారు. ఆయన లింక్డిన్ ప్రొఫైల్ ప్రకారం.. వైభవ్ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అభ్యసించారు. కంపెనీలో అటానమస్ సిస్టమ్స్, సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్చర్ విభాగాన్ని చూసుకుంటున్నారు. అటానమస్ సిస్టమ్స్, మారిటైమ్ టెక్నాలజీలో నిపుణులు. గతంలో రాయల్ ఆస్ట్రేలియన్ నేవీలోని ఘోస్ట్ షార్క్ డ్రోన్ సబ్మెరైన్ ప్రోగ్రామ్‌లోనూ ఆల్టేకర్ భాగమయ్యారు. అటానమస్ సర్ఫేస్ వెస్సెల్స్ ఉత్పత్తి కోసం సరోనిక్ టెక్నాలజీస్‌కు, యూఎస్ నేవీకి మధ్య 392 మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందం ఉంది. ఈ సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన డినో మావ్రూకాస్.. నేవీ సీల్స్ (నేవీకి చెందిన స్పెషల్ ఆపరేషన్స్ ఫోర్స్)లో 11 ఏళ్లపాటు పనిచేశారు. ఇక ఈ డ్రోన్ బోట్ విషయానికొస్తే.. 24 అడుగుల పొడవు ఉన్న కార్సెయిర్కు డీజిలే ఇంధనం. 35 నాట్స్ వేగంతో ఇది ప్రయాణిస్తుంది. రిమోట్‌గా ఆపరేట్ అయ్యే దీని పరిధి 1,000 నాటికల్ మైళ్ల వరకు ఉంది. 1,000 పౌండ్ల (453 కేజీలు) బరువు మోయగలదు. హర్మూజ్‌లో అపాచీ కూలడంతో అందులోని పైలట్లను కాపాడేందుకు ఈ బోట్ను తొలిసారి ఉపయోగించారు. అమెరికా నేవీకి చెందిన టాస్క్‌ఫోర్స్ 59 ఆధ్వర్యంలో ఇది నడుస్తోంది. ఏఐ సహాయంతో నడిచే డ్రోన్లు, మానవ రహిత వెస్సెల్స్‌ను ఈ టాస్క్ ఫోర్స్ పర్యవేక్షిస్తుంటుంది.

### అమెరికా-ఇరాన్ మధ్య
# భీకర దాడులు

(మొదటి పేజీ తరువాయి)

చేశాయి. ట్రంప్ ఆదేశాల మేరకు ఇరాన్‌పై ఆత్మరక్షణ దాడులు ప్రారంభించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఈ దాడులను ట్రంప్ సమర్థించుకున్నారు. ఓ మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్ కు గట్టి సందేశం ఇచ్చేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 'ప్రతిస్పందనలు చాలా ముఖ్యం అని నేను భావిస్తున్నా. వారు మా హెలికాప్టర్‌ను కూల్చివేశారు. వారు చేసిన దానికి ఇది మా ప్రతిస్పందన. ఇది చాలా బలంగా.. అత్యంత శక్తిమంతంగా ఉండాలని అనుకుంటున్నా' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

వైమానిక ఘర్షణ నేపథ్యంలో.. బుషెహర్ ప్రావిన్స్‌పై ఒక అమెరికా రీపర్ డ్రోన్ కూల్చివేసినట్లు ఐఆర్జీసీ ప్రకటించింది. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా విడుదల చేసింది. అయితే, ఈ ప్రకటనను అమెరికా ఇంకా ధ్రువీకరించలేదు.

దాడుల నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అమెరికాకు గట్టి హెచ్చరికలు చేశారు. యూఎస్ తమ సహనాన్ని పరీక్షిస్తోందన్నారు. దాడులు, బెదిరింపులకు తమ సాయుధ దళాలు కచ్చితంగా స్పందిస్తాయన్నారు. క్షేమంగా ఉండాలనుకుంటే.. వెంటనే ఈ ప్రాంతాన్ని వీడాలని యూఎస్ బలగాలను హెచ్చరించారు.

## 'మీనాక్షి' అంశంపై కోవర్టు గుర్తింపు?

(మొదటి పేజీ తరువాయి)

గురువారం ఢిల్లీలో పార్టీ హైకమాండ్‌కు అందించనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. త్వరలో రాష్ట్ర క్యాబినెట్‌లో మార్పులు చేర్పులు జరుగుతాయని భావిస్తున్న నేపథ్యంలో మీనాక్షి వ్యవహారం వెలుగు చూసింది. క్యాబినెట్ విస్తరణలో తన మంత్రి పదవికి ముప్పుందని గట్టిగా భావిస్తున్న ఆ నేత సీఎం రేవంత్ రెడ్డిని అప్రతిష్టపాలు చేయడానికి మీనాక్షిపై దాఖలైన కేసు వివరాలు మధ్యప్రదేశ్ బీజేపీ నేతలకు చేరవేశారన్న ప్రచారం జరుగుతోంది. తన పదవిని కాపాడుకునేందుకు గాను సదరు నేత ఇటీవల ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేసినా సానుకూల భరోసా లభించకపోవడంతో తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనైన ఆ నేత అందించ్చిన అవకాశంగా మీనాక్షి రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అంశంలో తన దైన పాత్ర పోషించినట్లు తెలిసింది. కాగా, ఏఐసీసీ రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న మీనాక్షి మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురికావడం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడం వెనక సొంత పార్టీ హస్తమే ఉందంటూ మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి కైలాష్ విజయ్ పెద్ద బాంబు పేల్చారు. ఆమెపై తెలంగాణలో ఉన్న కేసుల గురించిన సమాచారాన్ని కాంగ్రెస్ నాయకులే తమకు అందించారంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. సొంత పార్టీకి చెందిన వాళ్లే ఈ రహస్య సమాచారాన్ని తమకు వెనక చేరవేశారనీ, కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో చెప్పడానికి ఈ వ్యవహారం నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్ మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో ఏఐసీసీ మీనాక్షిపై రాష్ట్రంలో కేసులు ఉన్న విషయాన్ని మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి ఎవరు చేరవేశారనే అంశంపై ఆరా తీసినట్లు సమాచారం. మీనాక్షిపై ఎన్నో ఏళ్ల క్రితం నమోదైన సాధారణ కేసుకు సంబంధించిన సమాచారాన్ని మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి ఇచ్చేంత వరకు ఎవరు వెళతారనీ, ఆమెపై కేసు ఉన్న విషయం ఎవరో కొద్ది మందికి తప్ప చాలా మందికి తెలియదనీ, అలాంటప్పుడు ఏకంగా రాజ్యసభ నామినేషన్ దాఖలు చేసిన సమయంలోనే ఎందుకు బయటికి వచ్చిందని ఏఐసీసీలోని కీలక నాయకులు లోతుగా విచారణ జరిపినట్లు సమాచారం.

**ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి**

సీఎం రేవంత్ రెడ్డి బుధవారం రాత్రి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి హాజరు కానున్న సీఎం మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైన అంశంపై కాంగ్రెస్ అధిష్టానంతో చర్చించనున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై సీఎం ఇప్పటికే పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తోనూ మంతనాలు జరిపారు.

## సర్‌లో 'ఐటీ' కీలకం

(మొదటి పేజీ తరువాయి)


భాగంగా ఐటి వినియోగంపై జిల్లా, మండల స్థాయి మాస్టర్ ట్రైనర్స్, ఐటి సపోర్ట్ టీం, డేటా ఆపరేటర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఐటి అంశం అత్యంత కీలకమైనదని, దానిని సిబ్బంది విరివిగా వాడుకొని ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం, సమర్థవంతంగా చేపట్టేందుకు దోహదపడుతుందని, అంతేకాకుండా ఓటరు జాబితా రూపొందించడంలో పారదర్శకత ఉంటుందని తెలిపారు. అలాగే ఓటర్లు ఆన్ లైన్ ద్వారా తమ పేరును ఎన్యుమరేషన్ చేసుకోవడానికి ఎన్నికల సంఘం వెబ్ సైట్ నుసద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భారత ఎన్నికల కమిషన్ ఐటికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చే ఈసీఐఎన్ఈటీ,బీఎల్ఓ యాప్‌లను అందుబాటులోకి తెచ్చిందని, దీంతో ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత సులభతరం చేసేందుకు ఇందులో వివిధ టూల్స్‌ను పొందుపరిచిందని, వీటిని ఉపయోగించడంపై మాస్టర్ ట్రైనర్లు, ఐటి సపోర్ట్ టీమ్ లు క్షేత్రస్థాయిలో డేటా ఆపరేటర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

ఆన్ లైన్ ద్వారా ఓటర్లను ఎన్యుమరేషన్ చేసుకునేందకు సదుపాయం కల్పించినందున దీనిపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను సిఇఒ ఆదేశించారు.అనంతరం రాష్ట్ర శిక్షణ నోడల్ అధికారి బి. చెన్నయ్య, ఎస్ఐఆర్ ప్రక్రియలోని వివిధ దశలను సవివరంగా వివరించారు.

పీఎం-ఐటీ డి. చిరంజీవి, ఈసీఐనెట్, బీఎల్ఓ యాప్‌కు సంబంధించిన సాంకేతిక శిక్షణను అందించారు. ఇందులో ఎన్యూమరేషన్ ఫారమ్‌లను పూరించడం, ఓటర్ల మ్యాపింగ్,సేకరించలేని ఎన్యూమరేషన్ ఫారమ్ల వర్గీకరణ, అలాగే ఇతర అనుబంధ కార్యకలాపాల విధానాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఉప ప్రధాన ఎన్నికల అధికారి, ఎ.ఎస్. చారిలతో పాటు నోడల్ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్డీయే వచ్చాక ప్రజల్లో నమ్మకం పెరిగింది



- సుపరిపాలనే అతి పెద్ద పరీక్ష..
- 12 ఏళ్ల పాలనపై మోడీ ఆసక్తికర పోస్టు
- ప్రధాని నరేంద్ర మోడీ

**ఢిల్లీ, జూన్ 10:** కాంగ్రెస్ హయాంలో దేశంలో అనేక సమస్యలు ఉండేవని.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు తెచ్చామని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందన్న ఆయన.. దేశాభివృద్ధికి స్థిరమైన ప్రభుత్వం ఉండాలని ప్రజలు కోరుకున్నారని చెప్పారు. ప్రధానిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఎక్కువ కాలం ప్రధానిగా ఉండే అవకాశం ఇచ్చిన దేశప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్డీయేలో ఉన్న అన్ని పార్టీలకు ఈ విజయం దక్కుతుందన్న ఆయన.. దేశ రాజకీయాల్లో నేడు చారిత్రకమైన రోజుగా అభివర్ణించారు.

''కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. రూ.వేల కోట్ల కుంభకోణాలు జరిగాయి. అభివృద్ధి రేటు దారుణంగా ఉండేది. మేం వచ్చాక రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఇంటర్నెట్ వాడేవాళ్ల సంఖ్య 25 కోట్ల నుంచి వంద కోట్లకు పెంచాం. భారత్ 2014కు ముందు.. ఇప్పుడెలా ఉందో గమనించాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత పెను మార్పులను ప్రజలు బేరీజు వేసుకోవాలి. కేవలం 12 ఏళ్లలోనే ఇన్ని మార్పులు తీసుకొచ్చాం. మా పథకాలు, కార్యక్రమాలను ప్రజలు కూడా ఆమోదించారు'' అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

**ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది..**

''గతంలో 370 ఆర్టికల్ అంటేనే భయపడేవారు.. మేం రద్దు చేశాం. గతంలో ఉగ్రవాదం పేరు చెబితే భయపడేవారు. మేం వచ్చాక దాడులు చేశాం. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. దేశంలో వస్తోన్న పెనుమార్పులను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. పలు దేశాలు సమస్యల పరిష్కారం కోసం మన వైపు చూస్తున్నాయి'' అని ప్రధాని నరేంద్ర మోడి అన్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ చరిత్ర సృష్టించారు. భారత్‌లో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన నేతగా ఆయన నిలిచారు. ఈసందర్భంగా తన 12 ఏళ్ల పాలనపై మోడీ ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టారు. 'ప్రజా సేవ అనేది సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష. వినయం, అంకితభావం, కర్తవ్య దీక్షతో అవిశ్రాంతంగా పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందగలడు' అని ప్రధాని నరేంద్ర మోడీ రాసుకొచ్చారు.

## బాధితులకు అండగా తెలంగాణ సర్కార్

**మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజహరుద్దీన్**

**మదీనా బస్సు ప్రమాద బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కులను పంపిణీ**



**హైదరాబాద్,జూన్ 10(మనం న్యూస్):** సౌదీ అరేబియా లోజరిగిన మదీనా బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా చెక్కులను బుధవారం మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజహరుద్దీన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విషాద ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వ్యక్తిని కోల్పోయిన బాధను అ కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక సహాయం భర్తీ చేయలేదని,ప్రమాదం జరిగిన వెంటనే ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకున్నారని మంత్రి తెలిపారు.

బాధితుల కుటుంబ సభ్యులు సౌదీ అరేబియాకు వెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని, భారత కాన్సులేట్ ,సౌదీ అధికారులతో సమన్వయం చేసి అంత్యక్రియలతో సహా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు.మీడియాతో భావోద్వేగంగా మాట్లాడిన మంత్రి మొహమ్మద్ అజహరుద్దీన్, ఈ విషాదం సహాయక చర్యల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ తీవ్రంగా కలచివేసిందన్నారు. బాధిత కుటుంబాలకు అండగా నిలబడటంలో తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. మదీనా బస్సు ప్రమాదంలో మరణించిన ప్రతి కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం మానవతా దృక్పథంతో రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా సహాయాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా, మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శి,టీజీఎంఆర్ఈఐఎస్ కార్యదర్శి బి. షఫీయుల్లా, ఇతర అధికారులతో పాటు మృతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జిప్సంతో చౌడు నేలల పునరుద్ధరణ

**90 శాతం సబ్సిడీపై రైతులకు సరఫరా**

**సమస్యాత్మక నేలలకు జిప్సం ఉత్తమ పరిష్కారం**

**వేరుశనగ, వరి పంటల్లో అధిక దిగుబడులకు దోహదం**

**అందుబాటులో రూ.534 తో టన్ను జిప్సం**

**వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి**



**హైదరాబాద్,జూన్10(మనం న్యూస్):** భూసారాన్ని మెరుగుపరచడం, ఉప్పు ప్రభావిత (చౌడు) నేలలను సాగుకు అనుకూలంగా మార్చడం, వేరుశనగ, వరి వంటి పంటల్లో అధిక దిగుబడులు సాధించడం కోసం రైతులు జిప్సం వినియోగాన్ని పెంచాలని వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి సూచించారు. రాష్ట్రంలో సాగునీటి విస్తరణ, అసమతుల్య ఎరువుల వాడకం, సరైన నీటి నిర్వహణ లేకపోవడం వంటి కారణాల వల్ల అనేక ప్రాంతాల్లో నేలల ఉప్పుదనం (చౌడు),క్షారత్వం పెరుగుతున్నదని వెల్లడించారు.సాధారణంగా పీహెచ్ 8.2 కంటే ఎక్కువగా ఉన్న నేలలను క్షార నేలలుగా పరిగణిస్తారని, ఇటువంటి నేలల్లో మొక్కలు నీరు, పోషకాలను సమర్థవంతంగా గ్రహించలేక దిగుబడులు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. సమస్యాత్మక (చౌడు) నేలల పునరుద్ధరణకు జిప్సం వాడకం జిప్సం (కాల్షియం సల్ఫేట్)లో సుమారు 23-24 శాతం కాల్షియం, 18 శాతం గంధకం ఉండి ఇవి పంటలకు అత్యవసర ద్వితీయ పోషకాలుగా పనిచేస్తాయని వివరించారు. జిప్సం నేలలోని సోడియం అయాన్‌లను కాల్షియంతో మార్పిడి చేసి నేల గట్టిపడకుండా గుల్లగా మారుస్తుందని, దీని వల్ల నీరు భూమిలో లోతుగా ఇంకి వేర్ల పెరుగుదల మెరుగుపడుతుందని తెలిపారు. అలాగే నేలలోని ఉప్పుదనం తగ్గి పంటల పెరుగుదలకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు.

**జిప్సం ప్రాధాన్యత:**

వేరుశనగ పంటలో జిప్సం వినియోగం అత్యంత ప్రయోజనకరమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారని,రైతులు వేరుశనగ పంటలో ఎకరాకు 200 కిలోల జిప్సంను తొలి పూత దశలో లేదా విత్తిన 45 రోజుల సమయంలో కలుపు తీసేటప్పుడు మొక్కల మొదళ్ల వద్దవేయాలని సూచించారు.

జిప్సం వేసిన అనంతరం మట్టిని మొక్కల వద్దకు ఎగదోయడం ద్వారా ఊడలు, కాయలు కాల్షియంను నేరుగా గ్రహించి దిగుబడి, నాణ్యత పెరుగుతాయని తెలిపారు. అధిక సోడియం, అధిక పీహెచ్ ఉన్న చౌడు నేలల్లో వరి సాగుకు ముందు జిప్సం వినియోగం ఎంతో ఉపయోగకరమని,గట్టి నేలలు, పగుళ్లు ఏర్పడే నల్లరేగడి నేలలు, నీరు నిల్వ ఉండే భూముల్లో జిప్సం వాడటం ద్వారా నేల నిర్మాణం మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. వరిసాగు చేసే రైతులు భూమి సిద్ధం సమయంలోనే జిప్సంను ప్రాథమిక మోతాదుగా వినియోగించవచ్చని పేర్కొన్నారు.జిప్సం వాడకం వల్ల వరి పంటలో అధిక దిగుబడులు రావడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. అలాగే నేలలో గాలి ప్రసరణ మెరుగై, నీరు నిల్వ సమస్య తగ్గుతుందని గోపి వివరించారు.

**ప్రధాన ప్రయోజనాలు:**

చౌడు నేలల్లో సోడియం ప్రభావం తగ్గి, నేల గట్టిపడకుండా గుల్లగా మారుతుందని,నీటి ఇంకుడు సామర్థ్యం పెరిగి, నేలలో గాలి ప్రసరణ మెరుగుపడుతుంది, తద్వారా పంటకు కావల్సిన కాల్షియం, గంధకం లభ్యత పెరుగుతుంది, నూనెగింజల పంటల్లో నూనె శాతం పెరుగుతుంది సూక్ష్మజీవుల కార్యకలాపాలు మెరుగుపడి,వరి పంటలో నీరు నిల్వ సమస్య తగ్గి, భూగర్భ జలాల నిల్వకు దోహదపడుతుందన్నారు.అధిక సోడియం ఉన్న నేలల్లో జిప్సం వినియోగం ద్వారా నేల నిర్మాణం మెరుగుపడి సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. నేల పరీక్షల ఆధారంగా తగిన మోతాదులో మాత్రమే జిప్సం వినియోగించాలని రైతులకు సూచించారు.

**సబ్సిడీతో జిప్సం:**

రాష్ట్రంలో ఆర్కేవీవై సాయిల్ హెల్త్ అండ్ ఫెర్టిలిటీ కార్యక్రమం కింద చౌడు నేలల పునరుద్ధరణ కోసం రైతులకు జిప్సం 90 శాతం సబ్సిడీపై అందజేయబడుతోందని,ఒక టన్ను జిప్సం పూర్తి ధర రూ. 5,340 కాగా, ఇందులో 90 శాతం సబ్సిడీని ప్రభుత్వం భరిస్తోందని, రైతు వాటాగా కేవలం రూ. 534 ప్రతి టన్నుకు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11,500 మెట్రిక్ టన్నుల జిప్సం పంపిణీకి ప్రణాళిక రూపొందించగా, ఇప్పటివరకు 4,500 మెట్రిక్ టన్నుల జిప్సంను రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు.ఈ పథకం ద్వారా చౌడు నేలలను పునరుద్ధరించి భూసారాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

రైతులు తమభూములకు మట్టి పరీక్షలు చేయించుకొని, అవసరమైన మేరకు జిప్సంను వినియోగించి ప్రభుత్వ సబ్సిడీ సదుపాయాన్ని పొందాలని ఆయన సూచించారు. రైతులు మరిన్ని వివరాలకు తమ సమీప వ్యవసాయ విస్తరణ అధికారి, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ శాఖ కార్యాలయాలు లేదా రైతు వేదికలను సంప్రదించవచ్చని వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపిపేర్కొన్నారు.

## బీసీల వినతులపై విచారణ



**హైదరాబాద్,జూన్ 10(మనం న్యూస్):** రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన బుధవారం కమిషన్ కార్యాలయంలో బీసీల వినతులపై కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి,కమిషన్ మెంబర్ సెక్రెటరీ బి. బాలమాయ దేవిలతో విచారణ నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషన్ వివిధ అంశాలపై చర్చించింది. ముఖ్యంగా బీసీ 'ఏ' గ్రూప్‌లో అనాథలను గుర్తించడానికి ప్రస్తుతం ఉన్న 10 సంవత్సరాల వయస్సు నిబంధనను 49 సంవత్సరాలకు పెంచాలని వచ్చిన వినతిపై ఈ నెల 24న విచారణ జరపాలని కమిషన్ నిర్ణయించింది. బీసీ జాబితాలోని 'డి' గ్రూప్‌లో సాతాని(చాత్తాద శ్రీవైష్ణవ) కులం వారు సాతాని పదాన్ని తొలగించాలని కోరిన విషయంలో కూడా విచారణ నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. అలాగే కామారెడ్డి, మెదక్,సంగారెడ్డి జిల్లాలలో ఉన్న లొద్ద కులం వారిని బీసీలుగా గుర్తించాలని వచ్చిన వినతులపై సుదీర్ఘంగా చర్చించిన కమిషన్ వారి సామాజిక, విద్య, ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలలో రిజర్వేషన్ల ఉల్లంఘన ఫిర్యాదులపై విచారిస్తున్న కమిషన్ ఆయా సంస్థలను సందర్శించిన విషయం తెలిసిందే. ఈ విషయంలో ఆయా సంస్థల నుండి మరింత సమాచారాన్ని కోరాలని కమిషన్ నిర్ణయించింది. 2022 సంవత్సరంలో ఎంబీసీ కులాలకు చెందిన వారి పిల్లలకు మహాత్మా జ్యోతిబాపులే విద్యాసంస్థల ప్రవేశాలలో ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఇకముందు కూడా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కమిషన్ కోరనుంది.

కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చబడని 40 బీసీ కులాలకు చెందిన వారికి కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలలో ప్రవేశాలు,ఉద్యోగ అవసరాల నిమిత్తం ఇడబ్ల్యూఎస్ సర్టిఫికేట్ల జారీకి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కమిషన్ కోరింది.

**ఐటీ ఏరియాలో**

## ఈగల్ ఎటాక్

**డ్రగ్స్ డాన్ నీతూబాయ్ కోసం వేట**



**హైదరాబాద్,జూన్ 10(మనం,ప్రత్యేక ప్రతినిధి):** హైదరాబాద్ ఐటీ ఏరియాలో ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఈగల్ ఫోర్స్ వస్తుందన్న సమాచారం అందుకున్న డ్రగ్స్ డాన్ నీతూబాయ్ పారిపోయింది. హైదరాబాద్ నగరంలోని దూల్‌పేట కేంద్రంగా నీతూబాయ్ పెద్దఎత్తున గంజాయి విక్రయిస్తోంది. గంజాయి కొనుగోలు కోసం ఐటీ ఉద్యోగులు ఆమె ఇంటి దగ్గర క్యూ కట్టారు. గంటల వ్యవధిలో 50 మంది ఐటీ ఉద్యోగుల్ని ఈగల్ ఫోర్స్ పట్టుకుంది. నీతూభాయ్ దూల్‌పేట నుంచి ఐటీ కోర్ ఏరియాలో గంజాయి కేంద్రాన్ని నిర్వహిస్తోంది. ముఖ్యంగా ఓ కిరాణం షాపు మాటున గంజాయి విక్రయిస్తోందని సమాచారం అందుకున్న ఈగల్ ఫోర్స్ బుధవారం భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఇదిలావుండగా గతంలోనే నీతుభాయ్‌ని పోలీసులు అరెస్టు చేసి పీడీ యాక్ట్ పెట్టారు. అయినా జైలు నుంచి వచ్చి మళ్లీ గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్న పక్కా సమాచారం అందుకున్న ఈగల్ ఫోర్స్ దాడులు నిర్వహించింది.

## రెండో భార్యపై అనుమానం

# తుపాకీతో కాల్చి చంపిన భర్త

**హైదరాబాద్,జూన్ 10(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** మల్కాజిగిరిలో కాల్పుల కలకలం రేగింది. మూడు నెలల క్రితం భార్యను హత్య చేసేందుకు స్కెచ్ పోలీసులకు చిక్కిన ఓ భర్త.. చివరకు తన పథకాన్ని అమలు చేశాడు. మరో వ్యక్తి సాయంతో తన రెండో భార్యను బుధవారం తెల్లవారు జామున తుపాకీతో కాల్చి హతమార్చాడు. వివరాల్లోకి వెళితే..మల్కాజిగిరిలోని మారుతీనగర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి అరుణకుమార్‌కు మొదటి భార్యతో ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఆమె ఆరోగ్యం బాగోలేకపోవడంతో.. విడాకులిచ్చి ఆమె సోదరిని మరో వివాహం చేసుకున్నాడు. అయితే ఆమెకు ఇతరులతో సంబంధాలు ఉన్నాయని అరుణ్ అనుమానాలు పెంచుకోసాగాడు. ఈ కారణంగా దంపతుల మధ్య తరచూ వివాదాలు చోటుచేసుకోవడంతో.. ఆమె దూరంగా ఉండే ప్రయత్నం చేసింది. దీంతో రెండవ భార్యను అంతం చేయాలనే ఉద్దేశంతో అరుణ్ ముందుగానే హత్య ప్రణాళిక రూపొందించాడు. ఈ ఏడాది మార్చిలోనే బిహార్ నుంచి అక్రమంగా దేశవాళీ తుపాకీ, బుల్లెట్లు తెప్పించుకుని భార్యను చంపేందుకు సిద్ధమయ్యాడు. అంతేకాదు, తుపాకీ పేల్చడంపై ప్రాక్టీస్ కూడా చేశాడు. అయితే పక్కా సమాచారంతో చార్మినార్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని ఆయుధాన్ని స్వాధీనం చేసుకుని జైలు తరలించారు.



**బెయిల్‌పై వచ్చి :**

ఆయుధ చట్టం కేసుతో కటకటాల పాలైన అరుణ్.. బెయిల్ మీద బయటకు వచ్చి తన రెండవ భార్యను చంపేందుకు పథకం వేశాడు. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారు జామున మాట్లాడుకుందామని భార్యను బయటకు పిలిచిన అరుణ్, మరో వ్యక్తితో కలిసి ఆమెపై కాల్పులు జరిపాడు. మూడు రౌండ్లతో కాల్పులు జరపడంతో.. ఆమె అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందింది. ఈ ఘటనలో నిందితులు పరారయ్యారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టామని పోలీసులు తెలిపారు. పాతబస్తీలోని తన స్నేహితుల ద్వారా అరుణ్ తుపాకీ కొనుగోలు చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

# గ్లోబల్ మెడికల్ హబ్‌గా హైదరాబాద్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణలో సుప్రసిద్ధ హస్పిటల్స్‌గా పేరుగాంచిన నిమ్స్, టిమ్స్, గాంధీ, ఉస్మానియా దవాఖానాలు విదేశీ రోగులకు రోగులకు వరంగా మారాయి. లక్షల్లో ఖర్చు చేసిన నయం కానీ, రోగాలకు తెలంగాణలోని ప్రభుత్వ ఆసుపత్రులు కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందిస్తూ... మానవతను చాటుతున్నాయి. అయితే, కోవిడ్ కంటే ముందునుంచి తెలంగాణలో ఎన్నో అసుపత్రులు ఏళ్ల తరబడి సేవలందిస్తొన్నప్పటికి.. కోవిడ్ తర్వాతనే తెలంగాణ, రాజధాని నగరంలో ఇక్కడి ప్రముఖ ప్రభుత్వ అసుపత్రులు అందించిన, చేస్తున్న సేవలను యావత్ ప్రపంచం గుర్తించింది. వేనోళ్ల కిర్తించింది కూడా. అప్పటి నుంచి హైదరాబాద్ మహనగరం గ్లోబల్ మెడికల్ హబ్‌గా మారింది.

అత్యంత తక్కువ ఖర్చుతో వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ఒక ఉన్నత స్థాయి కమిటీని వేసింది. ఢిల్లీ, ముంబైల తర్వాత విదేశీయులకు హైదరాబాద్ మెడికల్ టూరిజం హబ్‌గా మారడంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రైవేటులో రూ.7 లక్షలుండే మోకాళ్ల మార్పిడి, బైపాస్ సర్జరీలు నిమ్స్‌లో రూ.2 లక్షలకే లభిస్తున్నాయి. మౌలిక వసతులు మెరుగుపరచి టిమ్స్‌లో ప్రత్యేక ఇంటర్నేషనల్ బ్లాకులు, ఇతర ఆసుపత్రుల్లో ప్రత్యేక పడకలను విదేశీయుల కోసం కేటాయించనున్నారు. ఇప్పటి వరకు కార్పొరేట్ ఆసుపత్రులకే పరిమితమైన ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం సేవలను.. ఇకపై ప్రభుత్వ ఆసుపత్రులైన నిమ్స్, టీమ్స్, గాంధీ, ఉస్మానియాతో పాటు అత్యంత మెరుగైన పలు రకాల వైద్యసేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఇటీవల 1000 పడకల గదులతో నిర్మితమైన టిమ్స్ అసుపత్రిలోనూ ఈ సేవలను ప్రారంభించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. యూరప్, ఇతర పాశ్చాత్య దేశాలతో పోల్చితే అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో కూడిన వైద్య చికిత్సలు దేశంలో తక్కువ ధరకే లభిస్తుండటంతో.. దేశ రాజధాని ఢిల్లీ, ముంబైల తర్వాత విదేశీ రోగులు హైదరాబాద్ను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ వైద్య రంగంలోనూ విదేశీయులకు కార్పొరేట్ స్థాయి సేవలను అందించేందుకు వీలుగా ప్రభుత్వం సరికొత్త కార్యాచరణను శ్రీకారం చుట్టింది. వైద్య సేవల్లో తమకు సాటిలేరు? ఏ ఇతర ప్రభుత్వ, ప్రైవేటు అసుపత్రులు అందించిన సేవలు మానవ సేవే మాధవ సేవ అన్న స్ఫూర్తికి సాటిరావని తెలంగాణ అసుపత్రులు మరోసారి నిరుపిం(చాయి)చనున్నాయి.



**సర్కారు దవాఖానాల్లో విదేశీయులకు వైద్యం**

**ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం హబ్‌గా రాజధాని**

**విదేశీ రోగుల కోసం ప్రత్యేక బ్లాకులు, పడకలు**

**తక్కువ ఖర్చుతో అందుబాటులోకి వైద్య సేవలు**

అయితే, భారత్‌తో స్నేహంగా ఉన్న దేశాలతో పాటు ప్రస్తుతం ఈస్ట్ ఆఫ్రికా, మధ్య ఆసియా దేశాల నుంచి వస్తున్న పలువురు రోగులు నిమ్స్ ఆసుపత్రిలో తక్కువ ఫీజుతోనే అత్యాధునిక వైద్య సేవలు పొందుతున్నారు. అయితే, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యున్నత స్థాయి వైద్య నిపుణులు ఉన్నప్పటికీ.. మౌలిక వసతుల కొరత, పరిశుభ్రత లోపించడం, సిబ్బందిలో నిబద్ధత లేకపోవడం వంటి కారణాల వల్ల విదేశీయులకు వీటిని పూర్తి స్థాయిలో సిఫార్సు చేయలేని పరిస్థితి నెలకొంది. దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేటు ఆసుపత్రులు ప్రత్యేక డెస్కులను ఏర్పాటు చేసుకుని విదేశీ రోగులను ఆకర్షిస్తున్నాయి. ఈ లోపాలను అధిగమించి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అంతర్జాతీయ వైద్య పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధ్యయనం చేసి సిఫార్సులు సమర్పించేందుకు ప్రభుత్వం తాజాగా హై లేవెల్ కమిటీని ఏర్పాటు చేసింది. కార్పొరేట్ ఆసుపత్రులతో పోల్చితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య ఖర్చులు 3వ వంతు మాత్రమే ఉండటం విదేశీ రోగులకు పెద్ద వరంగా మారనుంది. అలాగే బైపాస్ సర్జరీకి ప్రైవేటులో రూ.7 నుండి 8 లక్షలు ఖర్చవుతుండగా.. నిమ్స్‌లో కేవలం రెండున్నర లక్షల రూపాయలకే అత్యంత నాణ్యమైన సేవలు అందుతున్నాయి. ఇంతటి భారీ ధరల వ్యత్యాసం ఉండటం వల్ల మౌలిక వసతులు మెరుగుపడితే విదేశీ రోగుల తాకిడి సైతం గణనీయంగా పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ ప్రణాళికలో భాగంగా త్వరలోనే ప్రారంభం కానున్న టిమ్స్ ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం బ్లాక్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ బ్లాక్‌ను విదేశీ రోగులకు అందించాల్సిన ప్రత్యేక వైద్య సేవలు, విదేశీ కరెన్సీకి అనుగుణంగా ధరల విధానం, ఆకర్షణీయమైన హెల్త్ ప్యాకేజీలపై కొత్తగా ఏర్పాటైన కమిటీ సమగ్ర అధ్యయనం చేయనుంది. దీంతో పాటు నిమ్స్, గాంధీ, ఉస్మానియా వంటి జనరల్ ఆసుపత్రులలో సైతం నిర్దిష్ట సంఖ్యలో ప్రత్యేక పడకలను, విలాసవంతమైన విదేశీ ప్రత్యేక వార్డులను కేటాయించనున్నారు. ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల ఆదాయం పెరగడమే కాకుండా.. పేద, మధ్య తరగతి, సంపన్న వర్గాల ప్రజలకు అందించే ఉచిత వైద్యానికి మరింతగా నిధులు సమకూరే అవకాశం ఉందని తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు బావిస్తున్నట్లు విస్వాసనీయ వర్గాల ద్వారా అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

## 'పోలీస్ అక్క'కు డీజీపీ ప్రశంసలు

**హైదరాబాద్,జూన్ 10(మనం,ప్రత్యేక ప్రతినిధి):** నిర్మల్ జిల్లాలో వినూత్నంగా అమలు చేస్తున్న 'పోలీస్ అక్క' కార్యక్రమాన్ని డీజీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక స్కాచ్ అవార్డు లభించడం పట్ల నిర్మల్ జిల్లా పోలీసు సిబ్బందిని డీజీపీ అభినందించారు. నిర్మల్ జిల్లా పర్యటించిన డీజీపీ సి.వి. ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ మహిళా పోలీసు సిబ్బందికి మరింత బాధ్యతలు అప్పగిస్తూ, లా అండ్ ఆర్డర్ విధుల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. అనంతరం నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల మాట్లాడుతూ జిల్లాలోని నేరాల పరిస్థితి, పోలీసు పనితీరు, అమలు చేస్తున్న ప్రత్యేక కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీజీపీకి వివరించారు. 2025-26 సంవత్సరంలో నమోదైన గుర్తించదగిన నేరాల వివరాలను సమీక్షిస్తూ, గత ఏడాదితో పోల్చితే నేరాల సంఖ్యలో సుమారు 4.7 శాతం తగ్గుదల నమోదైనట్లు తెలిపారు. 2025 సంవత్సరంలో 1,155 కేసులు నమోదు కాగా, 2026 జనవరి నుంచి ఏప్రిల్ వరకు 896 కేసులు నమోదయ్యాయని వివరించారు. బైసా ప్రాంతంలో మత ఘర్షణలు పూర్తిగా తగ్గినట్లుగా ఎస్పీ వెల్లడించారు.మహిళలపై జరిగే నేరాల విషయంలో కూడా స్వల్ప తగ్గుదల నమోదైందని, గత ఏడాదితో పోల్చితే సుమారు 2.2 శాతం మేర తగ్గినట్లు తెలిపారు. అయితే పోక్సో చట్టం కింద నమోదవుతున్న కేసుల్లో పెరుగుదల కనిపిస్తున్నదని, 32 కేసులు నమోదై సుమారు 10 శాతం పెరిగినట్లు వెల్లడించారు.

## 'పెద్ది' మూవీ టికెట్ ధరల పెంపుపై అభ్యంతరం

**హోంశాఖ ముఖ్య కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ పిటిషన్**

**హైదరాబాద్,జూన్ 10(మనం,ప్రత్యేక ప్రతినిధి):** హీరో రాంచరణ్ నటించిన 'పెద్ది' సినిమా టికెట్ ధరల పెంపునకు హోంశాఖ జారీ చేసిన మెమోపై హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తూ ఈ నెల 2న హోంశాఖ మెమో జారీ చేసిందని దాఖలైన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం విచారించింది. హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయెల్‌పై దాఖలైన పిటిషన్‌పై వాదనలు విన్న ధర్మాసనం.. హోంశాఖ ఇచ్చిన సదరు మెమో అక్రమమని స్పష్టం చేసింది. సినిమా టికెట్ల ధరల పెంపుదల విషయంలో గతంలో ఉన్న జీవో 121 నిబంధనలను ఖచ్చితంగా పాటించాల్సిందేనని ఆదేశించింది. కేసులో తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేసింది.



## తొలకరి తొలి సంతకం..

తొలి జల్లు కురిసింది
నేలమ్మ దాహం తీర్చేందుకు
చల్లగాలి పిలిచింది
చిలిపి మనసు నవ్వింది..

ఎండిన మన్ను తడిసి
బుసబుసమని పొంగింది
పరమాన్నమే వండి
జీవులకు ప్రసాదమే పెట్టింది..

మట్టి వాసనతో పులకించి
మల్లెలన్నీ సిగ్గు విడిచే
చిరు మొక్కే అవతరించి
నింగికేమో కబుర్లు చెపుతోంది

గాడి మానులో ఎద్దు
గంగిరెద్దులా లంఘించే
నాగలి హారం మెడలో దాల్చి
నేలమ్మపై చిందులే వేసింది..

రైతన్న ముఖం విచ్చుకుంది
శ్రమ రెక్కలు కట్టుకొని
సిరి ధాన్యపు సిరుల కోసం
మట్టి ముద్దను ముద్దాడింది..
వేడెక్కిన భూమి
నింగి కార్చిన గంగలో
పవిత్ర స్నానం చేస్తూ
కల్మషాన్ని కడిగి వేసింది..

ఏరువాక కదులుతూ
నీటి కుండలు నిండుతూ
జీవులకు కండలు పెంచుతూ
పునర్జీవం తెచ్చింది..

పచ్చని గడ్డి మొలిచి
పశువులన్నీ బలిసి
పాలామృతాన్ని పంచుతూ
జాతికి వన్నె నింపింది

తొలకరి ఒక చిరునామాగా
తొలిచూపుల కావ్యంగా
మట్టి మనసులకు సంతోషంగా
అది సంతకమే నేలపై చేసింది..

**- కొప్పుల ప్రసాద్**
9885066235

# ప్రజాస్వామ్యమా!! ప్రతీకార చర్యలా??

మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ఉదంతం భారతదేశ ఎన్నికల రాజకీయాల్లో, ప్రజాస్వామ్య పారదర్శకతకు మరియు రాజకీయ ప్రతీకార చర్యలకు మధ్య సాగుతున్న సుదీర్ఘ సంఘర్షణను మరోసారి తెరపైకి తెచ్చింది. మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ అభ్యర్థిగా బరిలోకి దిగిన తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ కేవలం ఒక సాంకేతిక పరిపాలనా పరమైన నిర్ణయంగా మిగిలి పోలేదు. ఇది దేశవ్యాప్తంగా చట్టాల దుర్వినియోగం, ఎన్నికల సంఘం నిష్పాక్షికత, మరియు రాజకీయ వ్యూహాలపై తీవ్రస్థాయి నైతిక, న్యాయపరమైన చర్చకు దారితీసింది. సాధారణంగా పరోక్ష పద్ధతిలో, కేవలం శాసనసభ్యుల ఓట్ల బలాబలాల ఆధారంగా ఏకగ్రీవంగానో లేదా నిశ్శబ్దంగానో ముగిసిపోయే రాజ్యసభ ఎన్నికల ప్రక్రియ, ఈ అసాధారణ పరిణామంతో జాతీయ రాజకీయ యవనికపై ఒక ప్రధాన సంచలనంగా మారింది.

ఈ వివాదానికి మూలబిందువును పరిశీలిస్తే, అది హైదరాబాద్‌లోని నాంపల్లి చట్టసభల ప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానంలో నమోదైన ఒక పరువునష్టం కేసుకు ముడి పడి ఉంది. 2025 ఆగస్టు 20వ తేదీన ఎ. శ్రీలత అనే మహిళ దాఖలు చేసిన ప్రైవేట్ ఫిర్యాదు ఆధారంగా, భారతీయ న్యాయ సంహిత లోని పలు నిబంధనల ప్రకారం మీనాక్షి నటరాజన్‌ను నాలుగో నిందితురాలిగా చేర్చారు. ఒక మాజీ కార్పొరేటర్ వ్యవహారానికి సంబంధించిన ఈ వివాదంలో పరువునష్టం, వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించడం మరియు నేరపూరిత కుట్ర వంటి అంశాలు ప్రస్తావించ బడ్డాయి. అయితే, ఈ కేసు ఇంకా ప్రాథమిక విచారణ దశలోనే ఉంది. న్యాయస్థానం ద్వారా ఎలాంటి శిక్షా ఖరారు కాలేదు, కనీసం నేరాభియోగాలు కూడా పూర్తిగా మోపబడలేదు. అయినప్పటికీ, రాజ్యసభ నామినేషన్ల పరిశీలన సమయంలో ఈ పెండింగ్ కేసు సమాచారాన్ని అఫిడవిట్‌లో సమగ్రంగా పొందు పరచలేదనే టెక్నికల్ కారణాన్ని చూపుతూ రిటర్నింగ్ అధికారి ఆమె నామినేషన్‌ను తిరస్కరించడం గమనార్హం.

ఈ పరిణామం ప్రజాప్రతినిధుల చట్టం 1951 లోని సెక్షన్ 33ఎ, మరియు ఎన్నికల సంఘం నిబంధనల పరిధిలోకి వస్తుంది. ఈ నిబంధనల ప్రకారం అభ్యర్థులు తాము దాఖలు చేసే ఫారమ్-26 అఫిడవిట్‌లో తమపై ఉన్న అన్ని రకాల క్రిమినల్ కేసులు, పెండింగ్ విచారణలు, ఆస్తులు, అప్పులు మరియు విద్యా అర్హతలను నూటికి నూరు శాతం పారదర్శకంగా వెల్లడించాలి. గతంలో సుప్రీంకోర్టు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2002), పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2003) కేసుల్లో ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుల ప్రకారం, అభ్యర్థుల నేర చరిత్రను తెలుసుకునే హక్కు ఓటర్లకు ఉంది. ఈ పారదర్శకత ప్రజాస్వామ్యానికి పునాది అని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

అయితే, ఇక్కడ ప్రధానమైన న్యాయపరమైన ప్రశ్న ఏమిటంటే, ఒక సాధారణ పరువునష్టం కేసును, అది కూడా కేవలం ఫిర్యాదు దశలో ఉన్నదానిని, ఉద్దేశ పూర్వకంగా దాచిపెట్టారనే నెపంతో ఒక సీనియర్ నాయకురాలి పోటీ చేసే హక్కును పూర్తిగా నిరాకరించవచ్చా అనేది న్యాయ నిపుణులను సైతం ఆలోచింపజేస్తోంది.

ఈ మొత్తం వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీనిని అధికార పక్షం నడిపిన ముందస్తు ప్రణాళికాబద్ధమైన రాజకీయ కుట్రగా అభివర్ణిస్తున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్



కుమార్ గౌడ్ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. మీనాక్షి నటరాజన్ వంటి సుదీర్ఘ రాజకీయ అనుభవం, నిష్కళంక చరిత్ర కలిగిన నాయకురాలిని చట్టసభల్లోకి అడుగు పెట్టకుండా అడ్డుకోవడమే దీని వెనుక ఉన్న అసలు లక్ష్యమని వారు ఆరోపించారు. సాధారణంగా నామినేషన్ పత్రాలలో ఏవైనా చిన్నపాటి సాంకేతిక లోపాలు లేదా వివరణల కొరత ఉంటే, అభ్యర్థికి వాటిని సవరించుకోవడానికి లేదా వివరణ ఇచ్చుకోవడానికి రిటర్నింగ్ అధికారి సహేతుకమైన సమయం ఇవ్వడం ఎన్నికల సంప్రదాయం. కానీ ఈ కేసులో అలాంటి ఎటువంటి అవకాశం ఇవ్వకుండా, ఏకపక్షంగా నామినేషన్‌ను తిరస్కరించడం వెనుక ఉన్నతాధికారుల నుండి వచ్చిన రాజకీయ ఒత్తిళ్లే కారణమని ప్రతిపక్షం బలంగా వాదిస్తోంది. గతంలో ఎన్నికల అక్రమాలను ప్రశ్నించిన వారు, ఇప్పుడు వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని సీట్లను దొంగిలిస్తున్నారని ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు ఈ వివాదం యొక్క తీవ్రతను సూచిస్తున్నాయి.

మరోవైపు, భారతీయ జనతా పార్టీ మరియు దాని మిత్రపక్షాలు ఈ ఆరోపణలను పూర్తిగా తిప్పి కొడుతున్నాయి. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, ఎన్నికల నిబంధనలు ఏ ఒక్క పార్టీకో లేదా వ్యక్తులకో ప్రత్యేకంగా వర్తించవని వారు స్పష్టం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత అత్యంత ప్రాముఖ్యమైనదని, అఫిడవిట్‌లో సమాచారాన్ని దాచడం అనేది చట్టపరమైన నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందని అధికార పక్షం వాదిస్తోంది. కాంగ్రెస్ పార్టీ తన అంతర్గత వైఫల్యాలను, అభ్యర్థుల ఎంపికలో జరిగిన పొరపాట్లను కప్పిపుచ్చు కోవడానికి మరియు రాబోయే ఓటమి భయంతోనే స్వతంత్ర రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘంపై బురద చల్లుతోందని వారు ప్రతివిమర్శ చేస్తున్నారు. రిటర్నింగ్ అధికారి తీసుకున్న నిర్ణయం పూర్తిగా చట్టబద్ధమైనదని, ఇందులో ఎలాంటి రాజకీయ జోక్యం లేదని వారు సమర్థిస్తున్నారు.

ఈ ఉదంతం భారతదేశంలో ప్రజాప్రతినిధుల నేరమయ రాజకీయాల పై సాగుతున్న చర్చను మళ్లీ తెరపైకి తెచ్చింది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) యొక్క వివిధ నివేదికలు మరియు గణాంకాల ప్రకారం, ప్రస్తుతం దేశంలోని పార్లమెంట్, వివిధ రాష్ట్రాల అసెంబ్లీలలో ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులలో దాదాపు 40 శాతానికి పైగా నాయకులపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో హత్యలు, కిడ్నాప్‌లు, అవినీతి వంటి తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న వారు కూడా చట్టసభల్లో కొనసాగుతున్నారు. ఇంతటి తీవ్రమైన నేపథ్యం ఉన్నవారు ఎన్నికల్లో యథేచ్ఛగా పోటీ చేస్తున్న తరుణంలో, కేవలం ప్రాథమిక దశలో ఉన్న ఒక పరువునష్టం కేసును సాకుగా చూపి నామినేషన్ తిరస్కరించడం నైతికంగా ఎంతవరకు సమంజసమనే ప్రశ్న ఉదయిస్తోంది. మనం గమనించాల్సిన మరో ముఖ్యమైన కోణం ఏమిటంటే, రాజకీయ ప్రేరేపిత ఫిర్యాదుల ద్వారా ప్రత్యర్థులను ఎన్నికల రేసు నుండి ముందే తప్పించే ఒక ప్రమాదకరమైన ధోరణి దేశంలో పెరుగుతోంది. ఒక ప్రముఖ నాయకుడు లేదా నాయకురాలు ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నప్పుడు, వారిపై పాత వివాదాలను తవ్వి తీయడం, లేదా కొత్తగా ప్రైవేట్ ఫిర్యాదులను నమోదు చేయించడం ద్వారా వారి నామినేషన్లను ప్రమాదంలో పడేసే వ్యూహాలు ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయి. ఇది ప్రజాస్వామ్యయుతమైన ఆరోగ్యకరమైన పోటీని దెబ్బతీస్తుంది.

మీనాక్షి నటరాజన్ రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే, ఆమె కాంగ్రెస్ పార్టీలో అత్యంత నమ్మకమైన, చదువుకున్న మరియు సంస్థాగత పటిమ కలిగిన నాయకురాలిగా గుర్తింపు పొందారు. రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితురాలిగా, యువజన కాంగ్రెస్ మరియు ఎన్ఎస్‌యూఐ బలోపేతంలో ఆమె కీలక పాత్ర పోషించారు. 2009లో మధ్యప్రదేశ్‌లోని మందసౌర్ నుండి లోకసభ సభ్యురాలిగా ఎన్నికై పార్లమెంట్లో తన వాణిని బలంగా వినిపించారు. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడానికి, వివిధ వర్గాల నాయకులను సమన్వయం చేయడంలో ఆమె వ్యూహాత్మక పాత్ర పోషించారు.

ఈ వివాదం కేవలం ఒక అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు మాత్రమే పరిమితం కాలేదు. ఇది భారత రాజ్యాంగం కల్పించిన రాజకీయ హక్కులు, ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, మరియు చట్టాల అమలులో నిష్పాక్షికత వంటి అత్యున్నత విలువలపై జరుగుతున్న పెద్ద పోరాటం. ఒకవైపు చట్టం యొక్క కఠినమైన అమలు అవసరమని వాదించే న్యాయ నిపుణులు ఉన్నప్పటికీ, ఆ చట్టం అధికార పీఠంలో ఉన్నవారి చేతిలో ఆయుధంగా మారకూడదనే ప్రజాస్వామ్యవాదుల ఆందోళనలో కూడా అంతే నిజం ఉంది. ఈ నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉన్నత న్యాయస్థానాలు ఈ వ్యవహారాన్ని ఎలా పరిశీలిస్తాయి, రిటర్నింగ్ అధికారి నిర్ణయంలోని చట్టబద్ధతను ఎలా విశ్లేషిస్తాయి అనే అంశంపైనే ఈ వివాదానికి సంబంధించిన తుది ముగింపు ఆధారపడి ఉంటుంది. అప్పటివరకు, ఈ ఉదంతం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక వివాదాస్పద మరియు విశ్లేషణాత్మక అధ్యాయంగా నిలిచిపోతుంది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# పిల్లల్లో విలువలు నింపుదాం!



నేటి ఆధునిక యుగంలో పిల్లలకు నాణ్యమైన విద్య, సాంకేతిక పరిజ్ఞానం, భౌతిక సౌకర్యాలు అందించడంపై తల్లిదండ్రులు ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. పిల్లల వ్యక్తిత్వ వికాసానికి, కుటుంబ బంధాల బలోపేతానికి, సామాజిక విలువల పెంపొందింపునకు అత్యంత అవసరమైనది ఇంటి వాతావరణం, పెద్దల మాటలు, వారి ప్రవర్తనే అనే విషయాన్ని మరచిపోకూడదు. పిల్లలు చెప్పింది మాత్రమే కాదు. చూసింది కూడా అనుకరిస్తారు. తెలంగాణలో సామెత గుర్తొస్తుంది. 'ఆవు చేన్ల మేస్తే దూడ గట్టుకు మేస్తుందా!'. అందుకే ఇంట్లో వినిపించే ప్రతి మాట, కనిపించే ప్రతి చర్య వారి భవిష్యత్తు జీవితానికి పునాది. పిల్లల జీవితంలో తల్లిదండ్రులే తొలి గురువులు. పిల్లలతో మాట్లాడే విధానం వారి ఆలోచనా విధానాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, వికాసాన్ని ప్రభావితం చేస్తుంది. కోపంతో, అవమానకరంగా మాట్లాడడం వల్ల పిల్లల్లో భయం, నిరాశ, ఆత్మ న్యూనతాభావం పెరిగే అవకాశం ఉంటుంది. అదే ప్రేమతో, ఓర్పుతో, ప్రోత్సాహకరంగా మాట్లాడితే వారు ఆరోగ్యంగా ఎదుగుతారు.

పిల్లలు తప్పులు చేసినప్పుడు వాటిని సరిదిద్దే మార్గం చూపాలి. వారి చిన్న విజయాలను కూడా అభినందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఒక మంచి మాట పిల్లల మనసులో ఆశను నింపగలదు. ఒక కఠినమైన మాట వారిని లోలోపల గాయపరచగలదు. అందుకే తల్లిదండ్రుల మాటల్లో ప్రేమ, మమకారం, బాధ్యత ప్రతిఫలించాలి.

సాంకేతికత పెరిగిన కొద్దీ కుటుంబ సభ్యుల మధ్య సంభాషణలు తగ్గిపోతున్నాయి. ఒకే ఇంట్లో ఉంటూ కూడా ఒక్కొక్కరు ఒక్కో ప్రపంచంలో జీవిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో కుటుంబ బంధాలను కాపాడు కోవడం అత్యంత అవసరం.

తాతలు, అమ్మమ్మలు, బంధువులు, సోదర సోదరీమణులతో అనుబంధాలు పెంచుకోవడం ద్వారా పిల్లలు గౌరవం, ఆప్యాయత, పరస్పర సహకారం వంటి విలువలను నేర్చు కుంటారు. కుటుంబ సభ్యులు కలిసి భోజనం చేయడం,



పండుగలను సంబరంగా జరుపుకోవడం, ఒకరి సమస్యలను మరొకరు పంచుకోవడం వంటి అలవాట్లు కుటుంబ ఐక్యతను పెంచుతాయి.

బలమైన కుటుంబ బంధాలు ఉన్న చోట పిల్లలు భావోద్వేగంగా దృఢంగా ఉంటారు. ఒత్తిళ్లు, సమస్యలు ఎదురైనప్పుడు కూడా కుటుంబం తమకు అండగా ఉందనే నమ్మకం వారిలో ధైర్యాన్ని నింపుతుంది.

పిల్లలు భవిష్యత్తు పౌరులు మాత్రమే కాదు. నేటి సమాజ నిర్మాణంలోనూ కీలక భాగస్వాములు. చిన్ననాటి నుంచే వారిలో పెద్దలను గౌరవించడం, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించాలి. సమాజం పట్ల బాధ్యత కలిగిన పిల్లలే రేపటి బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారు.

నేటి పిల్లల ప్రపంచం ఎక్కువగా మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, డిజిటల్ పరికరాల చుట్టూనే తిరుగుతోంది. సాంకేతికత అవసరమే అయినప్పటికీ, దాని వినియోగంపై తల్లిదండ్రులు పర్యవేక్షణ అవసరం.

డిజిటల్ ప్రపంచం ఎంత విస్తరించినా, తల్లిదండ్రుల ప్రేమను, కుటుంబ అనుబంధాలను, మానవీయ విలువలను ఏ సాంకేతికత భర్తీ చేయలేదనే విషయాన్ని గుర్తుంచు కోవాలి. పిల్లలకు సమయం ఇవ్వడం కూడా వారికి ఇచ్చే గొప్ప బహుమతుల్లో ఇదే ప్రధానమైంది.

పిల్లలకు ఆస్తులు, సౌకర్యాలు అందించడం కంటే మంచి సంస్కారం, కుటుంబ అనుబంధాలు, సామాజిక విలువలు అందించడం ఎంతో గొప్ప బాధ్యత. ప్రేమతో కూడిన మాటలు, ఆదర్శవంతమైన ప్రవర్తన, ఆప్యాయమైన కుటుంబ వాతావరణం పిల్లల వ్యక్తిత్వ నిర్మాణానికి బలమైన పునాదులు వేస్తాయి. నేడు మనం పిల్లల మనసుల్లో నాటే మంచి ఆలోచనలు, సంస్కారం, విలువలే రేపటి సమాజాన్ని తీర్చిదిద్దే శక్తిగా మారతాయి. పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలంటే వారి చెవుల్లో మంచి మాటలు, వారి కళ్ల ముందు మంచి ఆదర్శాలు, వారి హృదయాల్లో మానవీయ విలువలు నింపుదాం. అదే కుటుంబానికి, సమాజానికి, దేశానికి మనం అందించే నిజమైన సేవ.

**- మేకిరి దామోదర్**
9573666650

# తెలంగాణపై నిశ్శబ్ద రాజకీయం



ఇటీవలి కాలంలో తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న రాజకీయ, సామాజిక పరిణామాలు మేధావుల్లోనూ, సామాన్య ప్రజానీకంలోనూ తీవ్రమైన చర్చకు, ఆందోళనకు దారి తీస్తున్నాయి. దశాబ్దాల పోరాటాల ఫలితంగా, అనేక బలిదానాల పునాదులపై సాధించుకున్న తెలంగాణ, గత 12 ఏళ్లుగా తనదైన అస్తిత్వాన్ని, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకుంటూ వస్తోంది. అయితే, ఇటీవల చోటుచేసుకుంటున్న కొన్ని వరుస సంఘటనలు గమనిస్తే, తెలంగాణ స్వయంప్రతిపత్తిపై, ఇక్కడి రాజకీయ స్థిరత్వంపై పొరుగు రాష్ట్రాల శక్తులు లేదా కేంద్ర పెద్దల నీడలు మళ్లీ కమ్ముకుంటున్నాయా అనే అనుమానాలు కలగడం సహజం.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు స్థానిక అధికారిక ప్రోటోకాల్‌ను లేదా స్థానిక రాజకీయ ప్రాధాన్యతలను పక్కన పెట్టి, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యనేతలైన చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఇండ్లను సందర్శించడం, వారితో ప్రత్యేకంగా భేటీ కావడం రాజకీయ వర్గాల్లో పలు అనుమానాలకు తావిచ్చింది. కేంద్రంలో ఉన్న పెద్దలు ఒక ప్రాంతానికి వచ్చినప్పుడు అక్కడి భౌగోళిక, రాజకీయ సున్నితత్వాలను గౌరవించాల్సి ఉంటుంది. అలా కాకుండా, అభివృద్ధి ఎజెండాతో కూడిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల వంటి అధికారిక వేదికలను సైతం రాజకీయ సంభాషణలకు వాడుకోవడం విస్మయానికి గురిచేస్తుంది. ముఖ్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని ఉద్దేశించి, 'మాతో జతకలవండి' అంటూ బహిరంగంగా వ్యాఖ్యానించడం వెనుక ఉన్న రాజకీయం ఏమిటనేది ఆలోచించదగ్గ విషయం. సొంత పార్టీ క్యాడర్‌ను ఉత్సాహపరిచేలా కాకుండా, కేవలం పొదుపు సూత్రాలు పాటించాలంటూ బీజేపీ సభలో ప్రధాని మాట్లాడటం చూస్తుంటే, స్థానిక ప్రయోజనాల కంటే కూడా ఇతర రాష్ట్రాల రాజకీయ సమీకరణలకే కేంద్రం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందా అనే భావన కలుగుతుంది.

ఈ రాజకీయ పరిణామాల తదుపరి అంకం మరింత ఆందోళనకరంగా మారింది. తెలంగాణలో విద్యావంతుడిగా, విశ్లేషకుడిగా పేరుపొందిన ప్రొఫెసర్ నాగేశ్వర్ గారిపై ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగుదేశం పార్టీ ఒత్తిడి మేరకు కేసులు నమోదు చేయడం, ఆయన్ను అరెస్టు చేయడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్య విలువలకే గొడ్డలిపెట్టు. ఒక విశ్లేషకుడు తన అభిప్రాయాలను వ్యక్తపరిచినప్పుడు, వాటిని తప్పుపట్టే హక్కు ఎవరికైనా ఉంటుంది. కానీ అధికార బలాన్ని ఉపయోగించి, పొరుగు రాష్ట్ర పోలీసుల ద్వారా కేసుల పేరుతో వేధించడం ఖండించదగ్గ విషయం.

మరోవైపు, హైదరాబాద్ నడిబొడ్డున ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం వెనుక ఉన్న సామాజిక, రాజకీయ కోణాలను కూడా నిశితంగా పరిశీలించాల్సి ఉంది. ప్రత్యేక తెలంగాణ అస్తిత్వం బలపడుతున్న తరుణంలో ఇలాంటి చర్యల ద్వారా పాత జ్ఞాపకాలను, పాత రాజకీయ ఆధిపత్యాన్ని మళ్లీ ఇక్కడి ప్రజలపై రుద్దే ప్రయత్నంగా భావించాల్సి వస్తుంది. దీనికి తోడు, జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున హైదరాబాద్‌లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సభ పెట్టాలని యోచించడం, దానికి ఇక్కడి యంత్రాంగం అనుమతి ఇవ్వకపోతే ఏకంగా హైకోర్టుకు వెళ్లడం వెనుక ఉన్న ఉద్దేశాలను కూడా శంకించాల్సి వస్తోంది. తెలంగాణ ఆవిర్భావం అనేది ఈ గడ్డపై ఉన్న ప్రతి ఒక్కరి భావోద్వేగాలతో ముడిపడి ఉన్న అంశం. ఆనాడు ఉద్యమానికి వ్యతిరేకంగా నిలిచిన పార్టీల అనుబంధ నేతలు, నేడు అదే ఆవిర్భావ దినోత్సవాన్ని హైదరాబాద్ వేదికగా తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూడటం విడ్డూరం. అనుమతుల నిరాకరణను సాకుగా చూపిస్తూ తెలంగాణ లీడర్లపై, ఇక్కడి పాలనా వ్యవస్థలపై విమర్శలు గుప్పించడం వెనుక వ్యూహాత్మక ప్రాంతీయ ఘర్షణలను రేకెత్తించే ప్రయత్నంగా కనిపిస్తున్నది. ఈ వరుస పరిణామాలన్నింటినీ ఒకదానితో ఒకటి ముడిపెట్టి చూస్తే, హైదరాబాద్ కేంద్రంగా మరోసారి కొన్ని శక్తులు కుట్రలకు తెరలేపుతున్నాయా అనే సందేహం కలగడం అతిశయోక్తి కాదు.

ఈ నేపథ్యంలో తెలంగాణ సమాజం, ఇక్కడి రాజకీయ నాయకత్వం పార్టీలకు తీతంగా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. రాజకీయ వైరుధ్యాలు ఏవైనా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో, ఇక్కడి అస్తిత్వాన్ని కాపాడుకునే విషయంలో అందరూ ఏకతాటిపైకి రావాలి. పొరుగు రాష్ట్రాల రాజకీయ శక్తులు ఇక్కడి శాంతియుత వాతావరణాన్ని తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోకుండా అడ్డుకోవాలి. ప్రజాస్వామ్యంలో విమర్శలు, సభలు నిర్వహించుకునే హక్కు అందరికీ ఉంటుంది, కానీ అవి ప్రాంతీయ విద్వేషాలను రేకెత్తించేలా, ఒక ప్రాంతపు ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉండకూడదు. ఇప్పటికైనా కేంద్ర పెద్దలు, పొరుగు రాష్ట్రాల నేతలు తెలంగాణ అంతర్గత విషయాల్లో, ఇక్కడి మేధావుల స్వేచ్ఛపై అనవసర జోక్యాన్ని మానుకోవాలి. తెలంగాణ ప్రజలు ఎంతో విజ్ఞులని, తమపై జరుగుతున్న ఇలాంటి నిశ్శబ్ద కుట్రలను, వ్యూహాలను గమనిస్తూనే ఉంటారని, సరైన సమయంలో తమ చైతన్యాన్ని ప్రదర్శిస్తారని ఈ పరిణామాలు నిరూపిస్తున్నాయి. భవిష్యత్తులో కూడా హైదరాబాద్ను రాజకీయ క్రీడా ప్రాంగణంగా మార్చే ప్రయత్నాలకు స్వస్తి పలికి, ఇక్కడి ప్రశాంతతను కాపాడటమే అందరి బాధ్యత కావాలి.

**- జుర్రు నారాయణ యాదవ్**
9494019270

# గ్రామీణ జీవితానికి కొత్త భాషను నేర్పిన దర్శకుడు భారతీరాజా



భారతీయ చలనచిత్ర రంగానికి, ముఖ్యంగా తమిళ, తెలుగు చిత్ర పరిశ్రమలకు ఎనలేని సేవలు అందించిన దిగ్గజ దర్శకుడు, నటుడు భారతీరాజా. గ్రామీణ నేపథ్యం, మట్టి వాసన, ప్రకృతి అందాలు, సామాన్య మనుషుల భావోద్వేగాలను వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించిన దర్శకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. భారతీరాజా గత కొంతకాలంగా వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ 2026 జూన్ 10 బుధవారం ఉదయం తన 84వ ఏట కన్నుమూశారు. గత ఏడాది ఆయన కుమారుడు మనోజ్ కుమార్ హఠాన్మరణం చెందడం ఆయనను మానసికంగా ఎంతో కుంగదీసింది.

దక్షిణ భారతీయ సినిమా చరిత్ర చూస్తే, కొందరి పేర్లు కేవలం దర్శకులుగా కనిపించవు. ఒక శకాన్నే మార్చేసిన సృష్టికర్తలుగా కనిపిస్తారు. ఆ జాబితాలో ఎప్పుడూ ముందు వరుసలో ఉంటారు డైరెక్టర్ భారతీరాజా. ఆయనే సినిమాను స్టూడియో గోడల నుంచి పల్లెటూరి మట్టి వాసన వీచే పొలాల వైపు నడిపించిన విప్లవకారుడు. కన్నడ దర్శకుడు పుట్టన్న కనగళ్ వద్ద అసిస్టెంట్‌గా కెరీర్ ప్రారంభించారు. 1977లో తమిళంలో వచ్చిన '16 వయతినిలే' చిత్రంతో దర్శకుడిగా మారారు. ఈ సినిమా అప్పట్లో ఒక సంచలనం. అదే చిత్రాన్ని తెలుగులో శ్రీదేవి, చంద్రమోహన్‌లతో 'పదహారేళ్ళ వయసు'గా రీమేక్ చేసి ఇక్కడా భారీ విజయాన్ని అందుకున్నారు. ఆయన దర్శకత్వం వహించిన 'సీతాకోకచిలుక', 'కొత్త జీవితాలు', 'ఆరాధన', 'జమదగ్ని' వంటి సినిమాలు తెలుగు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. సినిమా రంగానికి ఆయన చేసిన కృషికి గానూ భారత ప్రభుత్వం, చిత్ర పరిశ్రమల నుండి ఎన్నో అత్యున్నత పురస్కారాలు లభించాయి. భారత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డు తో పాటు కెరీర్‌లో మొత్తం 6 జాతీయ చలనచిత్ర అవార్డులు అందుకున్నారు. 'సీతాకోకచిలుక' సినిమాకు ఉత్తమ తెలుగు చిత్రంగా జాతీయ అవార్డుతో పాటు, ఆయనకు ఉత్తమ దర్శకుడిగా నంది అవార్డు లభించింది. కేవలం దర్శకుడిగానే కాకుండా, పలు చిత్రాలలో వైవిధ్యమైన పాత్రల్లో నటించి నటుడిగానూ మెప్పించారు.

భారతీరాజా భారతీయ సినీ ప్రపంచంలో గ్రామీణ జీవితానికి కొత్త భాషను పల్లె భాషను నేర్పిన దర్శకుడు. పల్లె అందం, అక్కడి మనుషుల స్వచ్ఛమైన ప్రేమ, వారి అనుబంధాలు - ఆనందాలు, బాధలు - భావోద్వేగాలను ఎంతో సహజంగా వెండితెరపై ఆవిష్కరించారు. ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమా మట్టివాసనతో నిండిన ఓ జీవన రాగంలా అనిపిస్తుంది. ప్రేమను కవిత్వంగా, బంధాలను హృద్యంగా, ప్రకృతిని పాత్రగా మలిచిన ఆయన చిత్రాలు ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి. అందుకే భారతీరాజా కేవలం ఒక దర్శకుడు కాదు. భావోద్వేగాలకు



దృశ్యరూపమిచ్చిన ఓ గొప్ప కథకుడు. నేడు ఆయన భౌతికంగా దూరమయ్యారు. 1941 జులై 17న తేని జిల్లా అల్లి నగరం గ్రామంలో జన్మించిన భారతీరాజా అసలు పేరు చిన్నసామి పెరియమాయ తేవర్. చిన్నప్పటినుంచే కళలపై ఆసక్తి ఉన్నప్పటికీ, సినిమా రంగంలోకి రావడం సులభం కాలేదు. కన్నడ దర్శకుడు పుట్టణ్ణ కనగల్, పి.పుల్లయ్య వంటి దిగ్గజాల వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసి సినిమాలో మెలకువలు నేర్చుకున్నారు. అలా ఆయన ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. 1977లో వచ్చిన '16 వయతినిలే' (తెలుగులో 'పదహారేళ్ల వయసు' పేరుతో రీమేక్ అయ్యింది) సినిమాతో భారతీరాజా దర్శకుడిగా పరిచయమయ్యారు. అప్పటివరకు కేవలం స్టూడియో సెట్టింగులకే పరిమితమైన తమిళ సినిమాను నిజమైన పల్లెటూరి లొకేషన్లలోకి తీసుకెళ్లి సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు. ఎలాంటి మేకప్ లేకుండా హీరోలను చూపించడం, ఎలాంటి అదనపు సొగసుల జోలికి వెళ్లకుండా సహజంగా ఉన్న అమ్మాయిలను హీరోయిన్లుగా పరిచయం చేయడంతో అప్పటి సినీ సంప్రదాయాలను తిరగరాశారు.

కేవలం గ్రామీణ చిత్రాలకే పరిమితం కాకుండా, 'సిగప్పు రోజాక్కల్' (తెలుగులో ఎర్ర గులాబీలు) వంటి సైకో థ్రిల్లర్ చిత్రాలతో తన బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు. తెలుగులో ఆయన దర్శకత్వం వహించిన 'సీతాకోకచిలుక' (1981) చిత్రం అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. కుల వివక్షకు వ్యతిరేకంగా ఆయన తీసిన 'వేదం పుదిదు' సినిమా సమాజంలో పెద్ద చర్చకు దారితీసింది. రాధిక, రాధ, రేవతి, కార్తీక్, విజయశాంతి వంటి ఎందరో నటీనటులను ఆయనే వెండితెరకు పరిచయం చేశారు. భారతీరాజా తన సినిమాల్లో ఎక్కువగా పల్లెటూరి కథలనే చూపించేవారు. మట్టివాసనను వెండితెర పైకి తెచ్చిన దర్శకుడిగా ఆయనకు పేరుంది. హీరోయిన్లను మేకప్ లేకుండా స్వచ్ఛంగా చూపించేవారు. దీని వెనుక కారణాన్ని ఆయన ఓ సందర్భంలో తనదైన చతురతను జోడించి చెప్పారు. ''నేను ఒకమ్మాయితో ప్రేమలో పడ్డా. ఆమెను వెతుక్కుంటూ వెళ్తుంటా. ఆశ్చర్యంగా ప్రతిసారీ ఆమె నాకు పల్లెల్లోనే కనిపిస్తోంది. ఆమె చాలా అందంగా ఉంటుంది. ఆమె ఎవరో కాదు 'ప్రకృతికాంత'. ఆమె అందానికి ముగ్ధుడినయ్యా. అందుకే కెమెరా పట్టుకుని ఆ అందాన్ని వెతుక్కుంటా'' అంటూ పల్లెలపై తన ప్రేమను వ్యక్తపర్చారు.

భారతీరాజా ప్రతిభకు ఎన్నో అవార్డులు దాసోహమన్నాయి. ఆయన తన కెరీర్‌లో దాదాపు 40 చిత్రాలకు దర్శకత్వం వహించి, 'ఇయక్కునార్ ఇమయం (దర్శక శిఖరం)' అనే బిరుదును పొందారు. వివిధ విభాగాల్లో మొత్తంగా 6 జాతీయ చలనచిత్ర అవార్డులను అందుకున్నారు. ఇందులో తెలుగు చిత్రం 'సీతాకోకచిలుక'కు ఉత్తమ ప్రాంతీయ చిత్ర అవార్డు కూడా ఉంది. సినీ రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ 2004లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించింది. వీటితో పాటు 4 ఫిలింఫేర్ అవార్డులు, 6 తమిళనాడు రాష్ట్ర అవార్డులు, నంది అవార్డులను ఆయన సొంతం చేసుకున్నారు. ఆయన కేవలం దర్శకత్వానికే పరిమితం కాకుండా నటుడిగానూ అలరించారు. 'ఆయుధ ఎళుతు', 'పాండియనాడు', 'తిరుచిత్రంబలమ్' (తిరు), గతేడాది వచ్చిన విజయ్ సేతుపతి 'మహారాజా' చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి మెప్పించారు. మోహన్‌లాల్ 'తుడరుమ్'లో చివరిసారి తెరపై కనిపించారు. అలాగే ఆయన నటించిన 'పులవర్' చిత్రం ఇంకా విడుదల కావాల్సిఉంది. ఇదే నటుడిగా ఆయనకు చివరి సినిమా.

**- ఇస్కా రాజేష్ బాబు**
96520 39780

# అధికారులు సమన్వయంతో పని చేయాలి

- క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలి
- మండలాల వారీగా పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించాలి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్, జూన్ 10(మనం బ్యూరో):** రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టు పరిశ్రమ, ఉద్యానవన, మత్స్య, పశుసంవర్ధక, వ్యవసాయ శాఖల పనితీరు, ప్రభుత్వ పథకాల అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలు, రైతులకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలు, వాటి ప్రగతి వివరాలను కలెక్టర్కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ రైతుల సమస్యలను తెలుసుకోవడానికి అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి రైతుకు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలాల వారీగా సాగు భూముల విస్తీర్ణం, సాగవుతున్న పంటలు, ఆయిల్ పామ్, వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, పూలు, పండ్ల తోటల వివరాలు, భూముల స్వరూపం, వర్షపాతం పరిస్థితులు, రైతు వేదికల ద్వారా అందుతున్న సేవలు, రైతులకు అనుకూల, ప్రతికూల అంశాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సాగు విధానాలపై అవగాహన పెంపొందించేందుకు త్వరలో వ్యవసాయ విస్తరణ అధికారులకు (ఏఈఓలు) ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మిని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు పంటల మార్పిడి విధానం, ప్రత్యామ్నాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు, డివిజన్ మరియు మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు 'కొత్త దిశ'ను నిర్దేశించిన తెలంగాణ ప్రభుత్వం

- అనేక మహిళా సంక్షేమ పథకాలతో దేశానికి ఆదర్శంగా రాష్ట్రం
- మహిళలు లబ్ధిదారులు కాదు బస్సు యజమానులు అయ్యారు
- ఉమ్మడి మెదక్ మహిళా సమాఖ్య లకు 61 బస్సులు కేటాయింపు
- మంత్రి పొన్నం ప్రభాకర్




**సిద్దిపేట జూన్10; మనం ప్రతినిధిః** మహిళలు లబ్ధిదారులగానే పరిమితం కాకుండా యజమానులుగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మారారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో మహిళలు ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములై, ఆస్తులు యజమానులుగా, ఆదాయ సృష్టికర్తలుగా మారుతున్నారన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే కార్యక్రమాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి పొన్నం తెలిపారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా, వారిని ఆర్టీసీ బస్సుల యజమానులుగా తీర్చిదిద్దిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని మంత్రి పేర్కొన్నారు. మహిళా శక్తి పథకం కింద మండల మహిళా సమాఖ్యలు తమ సొంత నిధులు రూ.199.08 కోట్ల పెట్టుబడితో 553 టీజీ ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసి సంస్థకు అద్దెకు ఇవ్వడం మహిళల ఆర్థిక స్వావలంబనకు, సమిష్టి శక్తికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఒకప్పుడు రుణాల కోసం ఎదురుచూసిన స్వయం సహాయక సంఘాల మహిళలు నేడు ఆస్తుల యజమానులుగా, పెట్టుబడిదారులుగా ఎదగడం తెలంగాణ ప్రభుత్వ మహిళా సాధికారత విధానాలకు నిదర్శనమని మంత్రి వివరించారు. ఒక్కో బస్సుకు నెలకు రూ.69,468 అద్దె లభిస్తుండగా, మొత్తం 553 బస్సుల ద్వారా ప్రతి నెల రూ.3.84 కోట్ల ఆదాయం మహిళా సమాఖ్యలకు అందుతోందన్నారు. ఇప్పటివరకు రూ.20.34 కోట్ల అద్దె ఆదాయం మహిళా సంఘాలకు చేరడం ఈ పథకం విజయాన్ని స్పష్టంగా చాటుతోందని చెప్పారు.మహిళలు కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములు, ఆస్తుల యజమానులు, ఆదాయ సృష్టికర్తలుగా మారుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కూడా ఈ పథకం ఎంతో దోహదపడుతోందన్నారు. మహాలక్ష్మి పథకం విజయవంతమైన అమలులో ఈ బస్సులు కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఇప్పటివరకు 315 కోట్లకు పైగా మహిళా ప్రయాణికులు లబ్ధి పొందారని చెప్పారు. ఈ పథకం ద్వారా మహిళలు సుమారు రూ.10,950 కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకోగలిగారని పేర్కొన్నారు.మహిళలు ఆదా చేసుకున్న ఈ మొత్తాన్ని కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, ఆరోగ్యం, స్వయం ఉపాధి మరియు చిన్న వ్యాపారాల కోసం వినియోగిస్తున్నారని మంత్రి వివరించారు. మహిళల చేతిలో మిగిలే ప్రతి రూపాయి కుటుంబ అభివృద్ధికి, సమాజ పురోగతికి దోహదపడుతుందని అన్నారు.

## ఉమ్మడి మెదక్ జిల్లాకు 61 బస్సులు

ఉమ్మడి మెదక్ జిల్లాలోని మహిళా సమాఖ్యలకు మొత్తం 61 బస్సులు కేటాయించడం జరిగిందని మంత్రి తెలిపారు. ఇందులో మెదక్ జిల్లాకు 20, సిద్దిపేట జిల్లాకు 23, సంగారెడ్డి జిల్లాకు 25 బస్సులు కేటాయించామని చెప్పారు. ఆయా జిల్లాల్లో బస్సుల కొరత తగ్గి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందడంతో పాటు మహిళా సంఘాలు స్థిరమైన ఆదాయ వనరును పొందనున్నాయని మంత్రి పేర్కొన్నారు. మహిళలను లబ్ధిదారుల నుంచి యజమానులుగా, భాగస్వాములుగా తీర్చిదిద్దడం తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. మహిళా శక్తి పథకం ఆ దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే విప్లవాత్మక కార్యక్రమం అని మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు.

# జిల్లాలో డయేరియా, పోలియో, నులిపురుగుల నిర్మూలనే లక్ష్యంగా ప్రత్యేక కార్యచరణ



- జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

**జగిత్యాల జూన్ 10(మనం న్యూస్)** జగిత్యాల జిల్లాలో ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు వైద్య ఆరోగ్యశాఖ చేపట్టిన డయేరియా నియంత్రణ,పల్స్ పోలియో మరియు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాలపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ జి సుజాత పాల్గొని మూడు కీలక ఆరోగ్య కార్య క్రమాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లల్లో డయేరియా పూర్తిగా అరికట్టేందుకు జూన్ 16 నుండి జులై 31 వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జూన్ 1 నుండి 15 వరకు సన్నాహక ఏర్పాట్లు పూర్తి చేసి, ఆపై ప్రధాన కార్యక్రమాన్ని చేపట్టా లని, ప్రతి ఇంట్లో ఐదేళ్లలోపు పిల్లల సంఖ్యకు అనుగుణంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు జింక్ మాత్రలను అందుబాటులో ఉంచాలని సూచించారు. తల్లులకు అవసరమైన కౌన్సిలిం గ్ ఇవ్వడం తో పాటు, మురికివాడలు పారిశుద్ధం సురక్షిత త్రాగు నీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా ,లైన్ డిపార్ట్మెంట్ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అదే విధంగా పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా జూన్ 28న బూత్ స్థాయిలో పోలియో చుక్కల మందు పంపిణీ చేసి, జూన్ 29, 30 తేదీలలో వైద్య సిబ్బంది, వాలంటీర్ల ద్వారా ఇంటింటికి తిరిగి పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు వెల్లడించారు. 2014 నుండి దేశంలో పోలియో రహిత స్థితిని కొనసాగిస్తున్న నేపథ్యంలో, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరాను అందించాలని కలెక్టర్ సూచించారు. బస్టాండ్లో బూతులను ఏర్పాటు చేసి ప్రయాణంలో ఉన్న పిల్లలను కూడా గుర్తించి పోలియో చుక్కలు వేయాలని స్పష్టం చేశారు. ఇక ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల లోపు వారందరికీ జులై 13 న అల్బెండజోల్ మాత్రలను అందజేయడం ద్వారా రక్తహీనతను అరికట్టేందుకు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో నోడల్ ఉపాధ్యాయుల పర్యవేక్షణ లో విద్యార్థులకు మాత్రలు వేయాలని, గ్రామీణ స్థాయిలో అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ ఈ ఆరోగ్య కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బి.రాజ గౌడ్,జిల్లా ఆసుపత్రి సూపర్డెంట్ ,డిప్యూటీ డీఎం డీఎంహో శ్రీనివాస్ ,ప్రోగ్రాం ఆఫీసర్లు ,జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నరేంద్ర , డ్విస్, డిడబ్ల్యుఓ ,డిపిఓ ,డిపిఆర్ఓ ,డిఇఓ ,మున్సిపల్ కమిషనర్లు ,ఎస్సీ ట్రాన్స్కో ,జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# శాతవాహన వ్యాపార వాణిజ్య నిర్వహణ కళాశాల నూతన ప్రిన్సిపల్ నియామకం



**కరీంనగర్ రూరల్ జూన్ 10(మనం న్యూస్):** శాతవాహన విశ్వవిద్యాలయంలోని వ్యాపార, వాణిజ్య నిర్వహణ కళాశాల (కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్) కళాశాల నూతన ప్రిన్సిపల్ గా డాక్టర్ శ్రీరంగప్రసాద్ ను నియమిస్తూ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ ఆదేశాలు జారీ చేయగా రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ నియామక పత్రాలు అందజేయగా విసి సమక్షంలో అందుకున్నారు. డాక్టర్ రంగప్రసాద్ ప్రస్తుతము బిజినెస్ మేనేజ్మెంట్ విభాగాధిపతిగా ఐక్యూఏసి డైరెక్టర్గా పనిచేస్తున్నారు.

ఇంతకుముందు ఆయన శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారిగా పనిచేశారు. అనేక కార్యశాల సదస్సులు బిజినెస్ మేనేజ్మెంట్ విభాగంలో నిర్వహించి పలు జాతీయ అంతర్జాతీయ సదస్సులలో పత్ర సమర్పణ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులు ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు.

# మోదీజీ...వర్ధిల్లు నూరేళ్ల

- నెహ్రూ రికార్డును బద్దలు కొట్టిన మోదీ
- భారత్ లో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగుతున్న మోదీ
- 2047 వరకు మోదీయే ప్రధానిగా కొనసాగుతారు
- ప్రపంచంలోనే భారత్ ను విశ్వగురు స్థానంలో నిలబెట్టడం ఖాయం
- మీనాక్షి నటరాజన్ వ్యవహారం ఎన్నికల కమిషన్ పరిధిలోనిది
- కరీంనగర్ మీడియాతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్ జూన్ 10(మనం బ్యూరో):** ప్రదాన మంత్రి నరేంద్రమోదీ రాబోయే 2047 సంవత్సరం వరకు భారత ప్రధానమంత్రిగా కొనసాగుతారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రపంచంలోనే భారత్ ను విశ్వగురు స్థానంలో నిలబెట్టే వరకు మోదీ విశ్రమించబోరని చెప్పారు. భారత ప్రధానిగా 4398 రోజులు పూర్తి చేసుకుని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ రికార్డును మోదీ బద్దలు కొట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం ఉదయం కరీంనగర్ లోని శ్రీమహాశక్తి ఆలయంలో స్థానిక బీజేపీ నేతలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోదీ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, అభివృద్ధిలో భారత్ ను ప్రపంచంలోనే నెంబర్ వన్ దేశంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా క్రుషి చేస్తున్న మోదీకి భగవంతుడి ఆశీస్సులు అందించాలని కోరుతూ బండి సంజయ్ ఈ పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక బీజేపీ కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ''దేశ ప్రధానిగా 4,398 రోజులు ప్రధానిగా పూర్తి చేసుకుని జవహర్ లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టి అత్యధిక కాలం ప్రధానిగా చేసిన మహానుభావుడు నరేంద్రమోదీ. ఈ నేపథ్యంలో నాతోపాటు ఎంతో మంది దేశవ్యాప్తంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నెహ్రూ పాలనలో అవినీతి, అరాచకాలు, అస్తవ్యస్త, బంధుప్రీతి పాలన కొనసాగింది. కానీ మోదీ పాలనలో అందుకు భిన్నంగా అవినీతి, బంధుప్రీతికి తావు లేకుండా నిజాయితీ, నిబద్దతతో పాలనను కొనసాగిస్తున్నారని కొనియాడారు. మోదీ 12 ఏళ్ల పాలనలో దేశంలోని 25 కోట్ల మందిని పేదరికం నుండి బయట పడేశారు. రోడ్లు, రైల్వే, ఎయిర్, టెలికమ్యూనికేషన్ రంగాల్లో అనూహ్యమైన ప్రగతి సాధించారు. పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాలను కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. అవినీతికి తావులేకుండా సమాజంలోని అట్టడుగునున్న చిట్ట చివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత మోదీకే దక్కుతుంది. అలాంటి గొప్ప వ్యక్తి నిండు నూరేళ్లు వర్ధిల్లాలి. 2047 వరకు దేశ ప్రధానిగా కొనసాగాలి. మోదీకి అమ్మవారు ఆయురారోగ్యాలతోపాటు శక్తిని కూడా ప్రసాదించాలని కోరుతున్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ పత్రాలను తిరస్కరించిన వ్యవహారం ఎన్నికల కమిషన్ పరిధిలోనిది. ఈ అంశాన్ని ఎన్నికల కమిషన్ చూసుకుంటుందన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబుపై అమర్యాదగా మాట్లాడితే సహించం



**పెద్దపల్లి జూన్ 10 (మనం ప్రతినిధి):** రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుపై వ్యక్తిగతంగా, అమర్యాదకరంగా మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు సహించబోరని టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ కోఆర్డినేటర్ కమ్మగోని చౌదరి గౌడ్ హెచ్చరించారు. బుధవారం పెద్దపల్లిలో చౌదరి గౌడ్ మాట్లాడుతూ ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిన పుట్ట మధు తన రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలు, అభివృద్ధిపై మాట్లాడలేక వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. శ్రీధర్ బాబు గురించి మాట్లాడే అర్హత పుట్ట మధుకు లేదన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న నాయకుడిపై బురదజల్లడం ఆయన రాజకీయ బలహీనతకు నిదర్శనమని, ప్రజల మద్దతు కోల్పోయిన నాయకులు ఇప్పుడు ఆరోపణలతోనే వార్తల్లో నిలవాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో ప్రజలు పలుమార్లు తిరస్కరించినప్పటికీ అదే అహంకార ధోరణితో వ్యవహరించడం పుట్ట మధు రాజకీయ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇకపై శ్రీధర్ బాబుపై వ్యక్తిగత దూషణలు చేస్తే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఊరుకోబోమని, ప్రజల మధ్యనే గట్టి రాజకీయ సమాధానం ఇస్తామని హెచ్చరించారు. పుట్ట మధు హద్దులు దాటి వ్యవహరిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని చౌదరి గౌడ్ స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోలులో అక్రమాలు నిరూపిస్తే రాజీనామా చేస్తా..

- ధర్మపురిలో ఇసుక తవ్వకాలు స్థానిక అవసరాలకే..
- జగిత్యాల జిల్లాలో ధాన్యం కొనుగోలులో కొత్త రికార్డు..
- రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..



**జగిత్యాల జూన్ 10(మనం న్యూస్)**జగిత్యాల జిల్లాలో యాసంగి సీజన్లో కొనుగోలు చేసిన ధాన్యంలో ఏలాంటి అక్రమాలు లేవని ధాన్యం కొనుగోలులో అక్రమాలు జరిగినట్లు నిరూపిస్తే తాను మంత్రి పదవికి రాజీనామా చేస్తానని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్కార్యాలయంలోఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ గత యాసంగి సీజన్ లో జగిత్యాల జిల్లాలో 80వేల మంది రైతుల వద్ద 4.60లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మంత్రి అడ్లూరి తెలిపారు. ఈఏడాది యాసంగి సీజన్లో జిల్లాలో 5.12 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేయగా ఇప్పటి వరకు 5.08లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. జిల్లాలో మొత్తం 436 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ప్రస్తుతం 417 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు పూర్తి అయ్యాయని మంత్రి వివరించారు. మరో 19కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి వివరించారు. జగిత్యాల జిల్లాలో ఇప్పటి వరకురూ.1,215కోట్లు విలువైన ధాన్యం కొనుగోలు చేయగా ఇప్పటి వరకు 79,736 మంది రైతుల ఖాతాల్లో రూ. 1,075కోట్లు జమ చేసినట్లు మంత్రి తెలిపారు. రాత్రి, పగలు తేడా లేకుండ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేశామని మంత్రి అడ్లూరి తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో 24గంటల పాటు అందుబాటులో ఉంటు రైతులకు సహకరించిన అధికారులను ఈసందర్భంగా మంత్రి అడ్లూరి అభినందనలు తెలిపారు. వడ్ల కొనుగోలులో ఏలాంటి అక్రమాలు లేవు.. జగిత్యాల జిల్లాలో వడ్ల కొనుగోలులో ఏలాంటి అక్రమాలు లేవని మంత్రి అడ్లూరి అన్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డితో పాటు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వడ్ల కొనుగోలులో జగిత్యాల జిల్లాలో రూ. 107కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారని, వారు ఆరోపించినట్లు అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే తాను మంత్రి పదవికి రాజీనామా చేస్తానని మంత్రి అడ్లూరి అన్నారు. ప్రభుత్వంపై బుదర జల్లె కార్యక్రమంలో భాగంగా ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి అడ్లూరి ఆరోపించారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల కొనుగోలు చేస్తే అవినీతి జరుగలేదు కాని జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లితేనే వడ్ల కొనుగోలులో అవినీతి జరిగిందా అని మంత్రి అడ్లూరి ప్రశ్నించారు. ధర్మపురి నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణపై ప్రతిపక్షలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయనిమంత్రి అడ్లూరి అన్నారు. ధర్మపురి మండలంలో స్థానిక అవసరాలకు మాత్రమే గోదావరి నుంచి ఇసుక తీసుకుంటున్నారని ఎక్కడ ఇసుక అక్రమ రవాణ జరుగలేదని మంత్రి అడ్లూరి అన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు ప్రభుత్వ నిర్మాణాలను ఇసుక తరలించారని మంత్రి తెలిపారు. ఇసుక రవాణలో ఏలాంటి అక్రమాలు లేవని మంత్రి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంఅధికారంలో ఉన్న సమయంలో వరి వేస్తే ఉరి అన్న నాయకులు ఇప్పుడు వరి పండించిన రైతులకు ప్రజా ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తే ప్రతిపక్షాలు తప్పులు ప్రచారాలు చేస్తున్నాయని మంత్రి అడ్లూరి అన్నారు. వరి కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం సైతం సహకరించడం లేదని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రానున్న రోజుల్లో సైతం రైతులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండ ధాన్యం కొనుగోలు చేస్తామని మంత్రి అడ్లూరి వివరించారు.

# ప్రజలకు వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించాలి

- ముందస్తుగా లోతట్టు ప్రాంతాలను గుర్తించాలి
- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల, జూన్ 9 (మనం ప్రతినిధి):** వర్షాకాలం నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. వర్షాకాలంలో నీటి నిల్వల కారణంగా దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు ముందస్తుగా ఆయిల్ బాల్స్, ఫాగింగ్, యాంటీ లార్వ స్ప్రేలు నిర్వహించాలని సూచించారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడి ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అవసరమైన పరిస్థితుల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. పునరావాస కేంద్రాలుగా ఫంక్షన్ హాల్స్, పాఠశాల భవనాలు తదితర సౌకర్యవంతమైన ప్రదేశాలను గుర్తించి అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో నదులు, కాలువలు, చెరువులు, కుంటల సమీప ప్రాంతాల్లో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా ఉండేందుకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# దేశ చరిత్రలో మహిళలకు తెలంగాణ ప్రభుత్వం కొత్త దిశ నిర్దేశించింది

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




**కరీంనగర్ జూన్ 10(మనం బ్యూరో).** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా, వారిని ఆర్టీసీ బస్సుల యజమానులుగా తీర్చిదిద్దిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని మంత్రి పేర్కొన్నారు. మహిళా శక్తి పథకం కింద మండల మహిళా సమాఖ్యలు తమ సొంత నిధులైన రూ.199.08 కోట్ల పెట్టుబడితో 553 టీజీ ఎస్ ఆర్ టి సి బస్సులను కొనుగోలు చేసి సంస్థకు అద్దెకు ఇవ్వడం మహిళల ఆర్థిక స్వావలంబనకు, సమిష్టి శక్తికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఒకప్పుడు రుణాల కోసం ఎదురుచూసిన స్వయం సహాయక సంఘాల మహిళలు నేడు ఆస్తుల యజమానులుగా, పెట్టుబడిదారులుగా ఎదగడం తెలంగాణ ప్రభుత్వ మహిళా సాధికారత విధానాలకు నిదర్శనమని మంత్రి తెలిపారు. ఒక్కో బస్సుకు నెలకు రూ.69,468 అద్దె లభిస్తుండగా, మొత్తం 553 బస్సుల ద్వారా ప్రతి నెల రూ.3.84 కోట్ల ఆదాయం మహిళా సమాఖ్యలకు అందుతోందన్నారు. ఇప్పటివరకు రూ.20.34 కోట్ల అద్దె ఆదాయం మహిళా సంఘాలకు చేరడం ఈ పథకం విజయాన్ని స్పష్టంగా చాటుతోందని చెప్పారు. అదేవిధంగా మహాలక్ష్మి పథకం విజయవంతమైన అమలులో ఈ బస్సులు కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఇప్పటివరకు 315 కోట్లకు పైగా మహిళా ప్రయాణికులు లబ్ధి పొందారని చెప్పారు. ఈ పథకం ద్వారా మహిళలు సుమారు రూ.10,950 కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకోగలిగారని పేర్కొన్నారు. ఇందులో కరీంనగర్ జిల్లాకు 16, రాజన్న సిరిసిల్ల జిల్లాకు 12, పెద్దపల్లి జిల్లాకు 15, జగిత్యాల జిల్లాకు 18 బస్సులు కేటాయించామని చెప్పారు. దీంతో ఆయా జిల్లాల్లో బస్సుల కొరత తగ్గి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందడంతో పాటు మహిళా సంఘాలు స్థిరమైన ఆదాయ వనరును పొందనున్నాయని మంత్రి పేర్కొన్నారు. మహిళలను లబ్ధిదారుల నుంచి యజమానులుగా, భాగస్వాములుగా తీర్చిదిద్దడం తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం. మహిళా శక్తి పథకం ఆ దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే విప్లవాత్మక కార్యక్రమం అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

# వచ్చే సంవత్సరం నాటికి మేడిగడ్డ సాగునీరు



**మేడిగడ్డ పునరుద్ధరణ పనులను పరిశీలించిన మంత్రి**

**ఏలాంటి రాజకీయ దురద్దేశం లేకుండా ప్రాజెక్టు పనులు**

**అన్నారాం సుందిళ్ల, గ్యారేజీల మరమ్మట్టు పనులు చేపట్టడం జరిగింది**

**ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సంస్థ ఆఫ్రిన్ తో సంప్రదింపులు**

**ఐఐటి ముంబై తో రీడిజైన్,జులై నాటికి పరిక్షలు పూర్తి**

**కర్నల్ పరిషత్ మెహర చైర్మన్ ఆధ్వర్యంలో కార్యాచరణ**

**మహాదేవపూర్ జూన్ 10 (మనం న్యూస్):** వచ్చేసంవత్సరం2027నాటికిమేడిగడ్డ ప్రాజెక్ట్ మరమ్మత్తుపనులను పూర్తిచేసి,రాష్ట్రప్రజలకుసాగునీరు అందించుటకు ప్రభుత్వం అన్ని విధాలచర్యలు తీసుకుంటుందనిఅన్నారు రాష్ట్ర ఇరిగేషన్ శాఖమంత్రి ఉత్తంకుమార్ రెడ్డి.బుధవారం రోజు మేడిగడ్డవద్ద జరుగుతున్న పునరుద్ధారణ పనులను పరిశీలించిన మంత్రి అనంతరం మాట్లాడుతూ, ప్రాజెక్ట్ రూపమైన నిర్మాణం వల్ల కుంగడం జరిగిందని, దీనికి అంచనాలు తయారు చేసి సాంకేతిక అత్యంత పకడ్బందీ పరీక్షలు నిర్వహించి ప్రాజెక్ట్ వినియోగం లోకి తెచ్చుటకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రాజెక్ట్ మరమ్మతు విషయంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టంగా తెలిపారు. అలాగే అన్నారాం సుందిళ్ల ప్రాజెక్టు పనులను కూడా చేపట్టినట్లు తెలిపారు. పునరుద్దారులకు సంబంధించి డిసైడ్ అండ్ డిజైన్ కన్సల్టెంట్ గా ప్రపంచ ప్రాముఖ్యత సంస్థ ఆయన ఆఫిన్ అనే కంపెనీని సంప్రదించి అలాగే ఐఐటి బాంబే నిపుణులతో సంయుక్తంగా చేపట్టుటకు పనులు చేస్తున్నామని, అలాగే ఎన్ డి ఈ పరీక్షలు నిర్వహిస్తూ ఉపయోగవంతంగా ముందుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు మంత్రి.ఈ నెల చివరి వరకు లేదా జూలై మొదటి వారంలో అన్ని పరీక్షలు పూర్తి చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టడం జరిగిందని, వచ్చిన పరీక్షల నివేదిక ఆధారంగా బ్యారేజ్ పునరుద్ధరణ రీ డిజైనింగ్ చేయాలని సంకల్పించినట్లు మంత్రి తెలపడం జరిగింది. అలాగే డిజైనింగ్ అంతా సిద్ధంగా ఉన్న తదుపరి సిడబ్ల్యుసి మరియు ఎన్ డి ఏ అనుమతి తీసుకొని, వర్షాకాలం పూర్తి కాగానే నవంబర్ డిసెంబర్ మాసాల్లో పనులను ప్రారంభించి పనులు పూర్తి చేసే ప్రయత్నం జరుగుతుందని అలాగే వచ్చే సంవత్సరం ఎండాకాలం వరకు పనులు పూర్తి చేసే లక్ష్యంగా, నిర్దేశించినట్లు తెలిపారు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి.కర్నల్ పరిషత్ మెహరచైర్మన్ఆధ్వర్యంలోకార్యాచరణ.మేడిగడ్డ పునరుద్ధారణ రీ డిజైనింగ్, ఎన్ డి ఏ, సి డబ్ల్యుసి,నిర్వహించబడే కార్యక్రమాలను భారత సైన్యంలోని అత్యంత నైపుణ్యత అనుభవం కలిగిన కర్నల్ పరిషత్ మెహర, చైర్మన్ ఆధ్వర్యంలో ముందుకు పోతున్నట్లు తెలిపారు మంత్రి, అలాగే కమిటీలు అనుభవతులైన చాలామంది దేశ విదేశాల నుండి నిపుణులను చేర్చి పరీక్షలు నిర్వహించడంజరుగుతుందని, పరీక్షల పురోగతి మరియు తనిఖీ చేయుటకు నేడు సందర్శించినట్లు తెలిపారు మంత్రి. అలాగే పునరుద్ధరణ పనులు ప్రారంభించడానికి ముందు ప్రతి బ్యారేజ్ యొక్క ఫిజికల్ కండిషన్ పరిశీలించి సమస్యలు ఉంటే తక్షణ చర్యలు మరమ్మత్తు పనులు వేగవంతం చేసి కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు మంత్రి. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ,ఎస్పి సిరి శెట్టి సంకీర్త్, శ్రీ శ్రీనివాస్ గుప్తా ,ఆర్డిఓ రవీందర్ ,ఇరిగేషన్ ఎస్సి దస్తగీర్, ఈ ఈ రమేష్ ,కన్సల్టెంట్ ఈ ఈ యాదగిరి, గ్రంథాలయ చైర్మన్ రాజబాబు, తహసిల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో సురేందర్.తో పాటు పలు అధికారులు ఉన్నారు.

# ప్రతి పాఠశాల ప్రొఫైల్ తయారు చేయండి



- **ప్రభుత్వ పాఠశాలలను అత్యద్భుతంగా తీర్చిదిద్దాలి**
- **ప్రతి అంశంపైపూర్తి అవగాహన ఉండాలి**
- **జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్, జూన్ 10(మనం బ్యూరో):** ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులకు ఆకర్షణీయంగా, అత్యుత్తమ విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టర్ తన చాంబర్లో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్ష సమావేశంలో పాఠశాలల అభివృద్ధి పనులు, మధ్యాహ్న భోజన పథకం, బడిబాట కార్యక్రమం, వర్షాకాలం నేపథ్యంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, పాఠశాలల పునఃప్రారంభ ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల నిర్వహణ, పర్యవేక్షణలో మండల విద్యాశాఖ అధికారుల (ఎంఈఓలు) పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలకు సంబంధించిన మౌలిక వసతులు, విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం, విద్యా ప్రమాణాలు బోధన బోధనేతర సిబ్బందికి సంబంధించిన తదితర అంశాలు..అభివృద్ధి పనులు, అవసరాలు వంటి అన్ని అంశాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యా సంస్థలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఎంఈఓలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రాబోయే వర్షాకాలంలో పాఠశాలల్లో నీటి నిల్వలు, పైకప్పుల లీకేజీలు, విద్యుత్ భద్రత, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో అత్యవసర మరమ్మతులు అవసరమైతే వెంటనే పూర్తి చేయాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రతి అధికారి తన పరిధిలోని పాఠశాలలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, విద్యార్థులకు ఉత్తమ విద్య అందేలా కృషి చేసి ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతమైన విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సిపిఓ ఆఫీసు గణాంక అధికారి కిషన్ రావు, మండల విద్యాశాఖ అధికారులు, కోఆర్డినేటర్లు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలు అంటే విద్యార్థులు సంబరపడి ముందుకు వచ్చేలా చేయాలి

**ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులకు ఆహ్లాదకర కేంద్రాలుగా తీర్చిదిద్దాలి**

**పునః ప్రారంభం నాడు విద్యార్థులకు స్వాగతం పలకాలి**

**బడి మానేసిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**బడి వయస్సు పిల్లలు బడిలోనే ఉండాలి**

**విద్యార్థుల విద్యా సామర్థ్యాల ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో జిల్లా కలెక్టర్ సమీక్ష**

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ పాటిల్**



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 10 (మనం బ్యూరో):** జిల్లాలో పాఠశాలల పునఃప్రారంభానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి విద్యార్థులకు ఆహ్లాదకరమైన, సానుకూల విద్యా వాతావరణాన్ని కల్పించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో బుధవారం సాయంత్రం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., ఈ నెల 15వ. తేదీన నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు హాజరయ్యేలా అన్ని ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల ప్రారంభం నుండి రాబోయే 15 రోజులపాటు విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బడి బయట పిల్లలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులు, పాఠశాల ఆవరణ, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు తదితర మౌలిక వసతులు సక్రమంగా ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలును నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తె పారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి ఆహార నాణ్యతను పరిశీలించాలన్నారు. జిల్లాలో మధ్యలో చదువు మానేసిన విద్యార్థులను గుర్తించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామస్థాయి సర్వేలు నిర్వహించి బడిబయట ఉన్న ప్రతి బాలబాలికను బడిలోకి తీసుకురావాలన్నారు. ఈ విషయంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్థాయి సర్పంచులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేయడం అత్యంత ముఖ్యమన్నారు. తరగతి వారీగా విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి, నేర్చుకునే లోపాలు ఉన్న వారికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. ప్రాథమిక స్థాయి నుంచే చదవడం, రాయడం, గణిత నైపుణ్యాల పెంపుపై దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు విద్యార్థుల హాజరు శాతం మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి విద్యా పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాల ఫలితాలు విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. కొత్త విద్యా సంవత్సరాన్ని విజయవంతంగా ప్రారంభించి జిల్లాను విద్యారంగంలో ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ, నోడల్ అధికారి కురుమయ్య, సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, వెంకటయ్య, నూరుద్దీన్, టెక్స్ట్ బుక్ మేనేజర్ నరసింహులు, విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, వివిధ గురుకులాలకు చెందిన ఆర్ సి ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆర్‌జెడిని కలిసిన ప్రముఖులు

**హనుమకొండ, జూన్ 10 (మనంన్యూస్):** వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆర్జెడిగా బదిలీపై వచ్చినటువంటి పి.మదన్మోహన్‌ని కలిసి డైరీ బహుకరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ చీస్ పాట్రన్ శ్రీ లక్కిరెడ్డి సంజీవరెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ లునావత్ నరేంద్రనాయక్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు బాసిరి రాజి బాపు , వరంగల్ జిల్లా అధ్యక్షులు వడ్డే కిషన్, భూపాల్ పల్లి జిల్లా అధ్యక్షులు మధుసూదన్, జనగామ జిల్లా అధ్యక్షులు, హనుమకొండ జిల్లా గౌరవ అధ్యక్షులు గుండు సదనందం మాడిశెట్టి మాడిశెట్టి శ్రీనివాస్ హనుమకొండ ప్రధాన కార్యదర్శి గూగులోత్ శ్రీనివాస నాయక్ వరంగల్ ఉపాధ్యక్షులు అనుముల రవి , కలిసి అభినందించారు.

# మంత్రుల పర్యటన విజయవంతం చేయాలి

**ములుగు,జూన్ 10మనం ప్రతినిధి :** గోవిందరావుపేట మండల కేంద్రంలోని సోమలగడ్డ క్రాస్ రోడ్ ఎదుట ఉన్న పి.ఎస్.ఆర్. గార్డెన్స్ యందు ములుగు జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కిసాన్ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి పారుదల, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖా మంత్రి శ్రీమతి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్ తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు భారీ సంఖ్యలో హాజరయి మంత్రులకు ఘన స్వాగతం పలకాలని ఆయన పేర్కొన్నారు

# ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న బిజెపి

- **డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్**

**ములుగు,జూన్ 10మనం ప్రతినిధిః** పార్లమెంటులో ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతును బిజెపి అడ్డుకుంటుందని డిసిసి అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ను సాంకేతిక కారణాల సాకుతో తిరస్కరించడం కేవలం ఒక వ్యక్తికి జరిగిన అన్యాయం కాదు, ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి, రాజ్యాంగ విలువలకు పూర్తిగా విరుద్ధంవిపక్షాల గొంతు నొక్కడమే ధ్యేయంగా పెట్టుకున్న బీజేపీ, వ్యవస్థలను తన చేతుల్లోకి తీసుకుని నడుపుతోంది. ఈ నామినేషన్ తిరస్కరణ వెనుక బీజేపీ రాజకీయ కుట్ర స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల బరిలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కోలేక, ఇలాంటి తెరవెనుక కుతంత్రాలతో కాంగ్రెస్ నాయకులను అడ్డుకోవాలని చూడడం బీజేపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కట్టుబడి ఉంటుంది. ఇలాంటి బెదిరింపులకు, కుట్రలకు మా కాంగ్రెస్ పార్టీ భయపడదు. మీనాక్షి నటరాజన్ నిఖ్సాన కాంగ్రెస్ వాది, తెలంగాణ వ్యవహారాల ఇన్చార్జ్ ఆమె అందించిన సేవలు, పార్టీ పట్ల ఆమెకున్న నిబద్ధత అమోఘం ఆమె గొంతును చట్టసభల్లో వినపడకుండా చేయాలని చూస్తే, దేశవ్యాప్తంగా లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఆమెకు అండగా నిలబడతారు. వ్యవస్థలను అడ్డుపెట్టుకుని బీజేపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ప్రజల పక్షాన నిలబడి పోరాడే కాంగ్రెస్ పార్టీ సంకల్పాన్ని ఎవరూ బలహీనపరచలేరు. రాజ్యాంగ సంస్థలను అధికార బీజేపీ పార్టీ తన స్వార్థానికి వాడుకోవడం ప్రజాస్వామ్యానికి చేటు. ఈ అప్రజాస్వామిక చర్యను దేశంలోని మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాల్సిన అవసరం ఉంది. న్యాయం, ధర్మం ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటాయి. బీజేపీ చేస్తున్న ఈ కుట్రలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు, తగిన సమయంలో వారు ఖచ్చితంగా బుద్ధి చెప్తారు. మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య వ్యతిరేక బీజేపీ విధి, విధానాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# బెటాలియన్ ఆర్మీ అధికారికి సన్మానం



**హనుమకొండ, జూన్ 10 మనం న్యూస్:** స్థానిక లాల్ బహదూర్ కళాశాల ఎన్సిసి 10వ తెలంగాణ బెటాలియన్ ఆర్మీ వింగ్ ఆధ్వర్యంలజూలో ' బెటాలియన్ హవల్దార్ మేయర్ బి.సందీప్ ఆర్మీ అధికారికి 'వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించామని ఇన్చార్జి ప్రిన్సిపల్ ఎస్వీ రమణారెడ్డి తెలిపారు. పదవ ఎన్సిసి బెటాలియన్ లో రెండు సంవత్సరాలుగా విధులు నిర్వహించి సమర్థుడుగా పేరు తెచ్చుకొని తిరిగి ఆర్మీ హెడ్ ఆఫీసుకు రిపోర్ట్ చేయడానికి వెళ్తున్న సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో బెటాలియన్ హవ్లార్ మేజర్ సందీప్ బెటగెరికర్ ఘనంగా సన్మానించి వారి సేవలను గుర్తు చేశారు ఎన్సిసి క్యాడేట్స్ కా టోరమైన శిక్షణ ఇచ్చి వారి అభివృద్ధికి ఎంతో దోహదపడాలని ఆర్మీ విభాగానికి, రిపబ్లిక్ డేకు, జాతీయ క్యాంపులకు ఎంతోమందిని తయారు చేయడంలో కృషి చేశాడని ఇన్చార్జి ప్రిన్సిపల్ ఎస్వి రమణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, హవల్దార్ గణేష్, మహెక్ మరియు క్యాడేట్స్ పాల్గొన్నారు. సీనియర్ సైనిక అధికారుల్ని సన్మానం చేయడం ఎంతో గర్వంగా ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు

# నాగర్కర్నూల్ జిల్లాకు రూ.9,768 కోట్ల వార్షిక రుణ ప్రణాళిక విడుదల

- **జిల్లాలో వ్యవసాయం, ఉపాధి, గృహ నిర్మాణం, విద్యాభివృద్ధికి పెద్దపీట**
- **నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 10 (మనం బ్యూరో):** నాగర్ కర్నూల్ జిల్లాలో ఆర్థికాభివృద్ధి వేగవంతం కావాలంటే బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని, వ్యవసాయం, పారిశ్రామిక రంగం, మహిళా సంఘాలు, ప్రాధాన్యతా రంగాలకు విస్తృత స్థాయిలో రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ బ్యాంకర్లను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించడమే కాకుండా వాటిని అధిగమించే దిశగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.బుధవారం నాగర్కర్నూల్ కలెక్టరేట్లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్సీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ బ్యాంకుల పనితీరు, రుణాల మంజూరు పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రాధాన్యతా రంగాలకు అందించిన రుణాలపై కలెక్టర్ సమీక్ష చేపట్టారు.నాగర్కర్నూల్ జిల్లా సమగ్ర ఆర్థికాభివృద్ధికి దిశానిర్దేశం చేసే 2026-27 ఆర్థిక సంవత్సర వార్షిక రుణ ప్రణాళిక (ఋఙ్ఛిజా ఇట్ఛిఛీజ్ఠీ ౖజ్చూ)ను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆవిష్కరించారు. జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయం (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో రూపొందించిన ఈ సమగ్ర క్రెడిట్ ప్లాన్ ద్వారా వ్యవసాయం, సూక్ష్మ-చిన్న-మధ్యతరహా పరిశ్రమలు (ఎం ఎస్ ఎం ఈ), గృహ నిర్మాణం, విద్య, పునరుత్పాదక ఇంధనం, సామాజిక మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన రుణ సౌకర్యాలను విస్తృతంగా అందించనున్నారు.జిల్లాలో సమతుల్య ఆర్థికాభివృద్ధిని సాధించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, ఉపాధి అవకాశాలను విస్తరించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం, యువతలో స్వయం ఉపాధిని ప్రోత్సహించడం వంటి ప్రధాన లక్ష్యాలతో ఈ ప్రణాళికను రూపొందించినట్లు బ్యాంకు అధికారులు వెల్లడించారు.రూ.9,768 కోట్ల భారీ రుణ లక్ష్యం, 2026-27 ఆర్థిక సంవత్సరానికి జిల్లా మొత్తం రుణ ప్రణాళికను రూ.9,768 కోట్లతో రూపొందించారు. మొత్తం 2,77,772 ఖాతాలకు వివిధ రంగాల్లో రుణాలు అందించాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ మొత్తం ప్రణాళికలో ప్రాధాన్య రంగాలకు 88.42 శాతం వాటాను కేటాయించగా, ప్రాధాన్యేతర రంగాలకు 11.58 శాతం కేటాయించారు. జిల్లాలోని ఉత్పాదక రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం అవుతాయని అధికారులు భావిస్తున్నారు.వ్యవసాయ రంగానికే అత్యధిక వాటా, జిల్లాలో సామాజిక మౌలిక వసతుల అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించారు. విద్య, ఆరోగ్యం, గ్రామీణ సేవా కేంద్రాలు, ఇతర సామాజిక అవసరాలకు సంబంధించిన ప్రాజెక్టులకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయి.

పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించేందుకు పునరుత్పాదక ఇంధన రంగానికి రూ.5.11 కోట్లు కేటాయించారు. సౌరశక్తి, ఇతర గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు ఈ రుణాలు ఉపయోగపడనున్నాయి. ప్రాధాన్యేతర రంగానికి రూ.1,131 కోట్లు,

ప్రాధాన్యేతర రంగానికి మొత్తం రూ.1,131 కోట్ల రుణ లక్ష్యాన్ని నిర్ణయించారు. వ్యక్తిగత రుణాలు, వాణిజ్య అవసరాలు, సేవారంగం, ఇతర ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించిన రుణాలు ఈ విభాగంలో అందించనున్నారు. జిల్లాలో వినియోగ వ్యయం పెరగడంతో పాటు వాణిజ్య కార్యకలాపాలు కూడా విస్తరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.జిల్లా ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు విరివిగా రుణాలు అందించాలి, ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ..... వ్యవసాయ రంగం జిల్లా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటిదన్నారు. రైతులు వ్యవసాయ అవసరాలకు సకాలంలో రుణాలు పొందేలా బ్యాంకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రైతులకు పంట రుణాలు, వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకం, మత్స్య పరిశ్రమ తదితర రంగాలకు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని కోరారు. నాగర్కర్నూల్ జిల్లాలో అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ రంగంలో మెరుగైన సేవలు అందించే అధికారుల చర్యలు తీసుకోవాలన్నారు.మహిళా సాధికారతకు స్వయం సహాయక సంఘాలు ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. మహిళా సంఘాలకు బ్యాంకు రుణాల మంజూరులో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. సంఘాల ఆర్థిక స్వావలంబనకు అవసరమైన సహకారం అందించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రాధాన్యతా రంగాలకు రుణాల పంపిణీని మరింత పెంచాలని బ్యాంకర్లకు సూచించారు. చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), స్వయం ఉపాధి యూనిట్లు, సేవా రంగాలకు అవసరమైన ఆర్థిక వనరులు అందించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.

పారిశ్రామిక రంగ అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కింద అర్హులైన యువత, పారిశ్రామికవేత్తలకు త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు దరఖాస్తులను వేగంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం బ్యాంకులు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా బ్యాంకింగ్ సేవలను విస్తరించడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల విజయవంతమైన అమలుకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. నాగర్ కర్నూల్ జిల్లాలో బ్యాంకింగ్ రంగంలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించామన్నారు. జిల్లాలోని లింగాల, బల్మూర్ ,అమ్రాబాద్ పదర మండలాల్లోని నిరక్షరాస్యత కలిగిన ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ రంగం సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

# భూక్యా ఉమామురళిని కలిసిన చందులాల్



**మహబూబాబాద్, జూన్ 10(మనంన్యూస్):** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉమా మురళి నాయక్‌ని ఏపూరు గ్రామ ఉపసర్పంచ్ వాంకుడోట్ కమల చందులాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏపూరు గ్రామంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గ్రామంలోని వి.ఓ. (విలేజ్ ఆర్గనైజేషన్) భవనం నిర్మాణం, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాకు సంబంధించిన అంశాలపై జిల్లా అధ్యక్షురాలితో సుదీర్ఘంగా చర్చించారు. గ్రామ ప్రజలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉపసర్పంచ్ కమల చందులాల్ కోరగా, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తానని ఉమా మురళి నాయక్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు మరియు ప్రజలకు ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందేలా అందరూ కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా వారు అభిప్రాయపడ్డారు.

# తుమ్మిడిహట్టి ప్రాజెక్టును అడ్డుకున్నది మీరే కదా?

## నాటి కాంగ్రెస్ ప్రభుత్వమే అడ్డుకుంది?

## కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ ధ్వజం

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఇవాళ ప్రగళ్భాలు పలుకుతున్న తెలంగాణ హస్తం నేతలు? చరిత్ర నిజాలు తెలుసుకోవాలని బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టును అడ్డుకున్నది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఇదే విషయమై తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ఆనాడు మహారాష్ట్రలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం.. అక్కడున్నది పృథ్వీరాజ్ చౌహాన్ సీఎం, ఇక్కడ కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారన్నారు. నాడు వారు (పృథ్వీరాజ్ చౌహాన్) స్వయంగా లేఖ రాశారు. పృథ్వీరాజ్ చౌహాన్ అక్టోబర్ 15 2013లో లేఖ రాశారన్నారు. ఈ ప్రాజెక్టు మీరు ఆలోచన చేసి నిర్మిస్తున్నరు.



దీంట్లో 152 మీట్లర్ల ఫుల్ రిజర్వాయర్ లెవల్లో నిర్మిస్తే దాదాపు మా చంద్రాపూర్లో 22 గ్రామాలు మునుగుతాయి. గడిచౌరిలో 8 గ్రామాలు, దాదాపు 2 వేల హెక్టార్ల భూమి మునిగిపోతుంది. ఎట్టి పరిస్థితుల్లో మేం అనుమతి ఇవ్వం అని చెబుతూ.. మీరు తుమ్మిడిహట్టి దగ్గర 152 మీటర్ల ఎత్తు మీరు టెండర్లు పిలుస్తున్నరు.. కాంట్రాక్టర్లులిస్తున్నరు. అనుమతులు లేకున్నా మీరు పనులు చేస్తున్నారు. కాబట్టి మీరు ఈ పనులన్ని ఆపండి. మీరు ఎట్టి పరిస్థితుల్లో ఈ 152 మీటర్ల ఎత్తున నిర్మించడానికి అనుమతి ఇవ్వం అని చెప్పింది మహారాష్ట్రలో ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం అని వినోద్ కుమార్ అన్నారు. 152 మీటర్ల ఎత్తులో మీరు బ్యారేజ్ కడితే మా గ్రామాలు మునిగిపోతాయని, అస్సలు ఒప్పుకునే ప్రసక్తే లేదని పృథ్వీ రాజ్ చౌహాన్ లేఖ లేఖలో పేర్కొన్నారు. ఇది ఒక పనికిమాలిన చర్య అని, డబ్బులు వృథా చేస్తున్నారని, ఈ నిర్మాణం ఆపకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తూ పృథ్వీ రాజ్ చౌహాన్ రాశారని వినోద్ కుమార్ వెల్లడించారు.

# సుస్థిర మైనింగ్‌లో సింగరేణి మరో రికార్డు





## రూ.40 కోట్ల ఎస్క్రో డిపాజిట్‌ను సింగరేణికి కేంద్రంవడ్డీతో సహా చెల్లింపు

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మరో అరుదైన రికార్డు సాధించింది. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర మైనింగ్ విధానాలతో ఓ వైపు లాభాలు, మరోవైపు ఉద్యోగుల భద్రత, ప్రామాణాలు లక్ష్యంగా తీసుకున్న చోరవకు ఈ గుర్తింపు లభించడం విశేషం. ఇక, మూసివేసిన డోర్లీ-2 భూగర్భ గనిని ఆదర్శవంతంగా పునరుద్ధరించి, పర్యావరణ ప్రమాణాలను పూర్తిస్థాయిలో పాటించినందుకు కేంద్రం.. ఆ సంస్థకు రూ.40 కోట్ల ఎస్క్రో డిపాజిట్ సొమ్మును వడ్డీతో సహా తిరిగి చెల్లించింది.అయితే, పర్యావరణ ప్రమాణాల అమలుపై సింగరేణిని ప్రశంసిస్తూ.. కేంద్ర కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ నుంచి సదరు నిధులను విడుదల చేసింది. గని మూసివేతలో పర్యావరణ నిబంధనలను పూర్తిగా అమలు చేసిన సింగరేణి.. బొగ్గు తవ్వకాలు పూర్తైన తర్వాత ఆ భూములను మళ్లీ పచ్చని అడవులుగా మార్చడంపై ప్రత్యేక దృష్టి సారించింది. డోర్లీ గని ప్రాంతంలో దాదాపు 162 హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో దట్టమైన అడవులను పునరుద్ధరించింది. తవ్వకాలు ప్రారంభించే ముందు సేకరించిన దాదాపు 19.76 లక్షల క్యూబిక్ మీటర్ల సారవంతమైన మట్టిని భద్రపరిచి, తిరిగి మొక్కల పెంపకానికి వినియోగించింది. గనుల్లో డ్రిల్లింగ్ సమయంలో దుమ్ము, ధూళి చేరకుండా డస్ట్ కంట్రోలర్లు, తడి డ్రిల్లింగ్ పద్ధతులు అనుసరించేలా చర్యలు చేపట్టింది. రవాణా మార్గాల్లో వాటర్ స్ప్రింక్లర్ల ద్వారా నిరంతరం నీటిని చల్లుతూ కాలుష్యాన్ని అదుపులో ఉంచేందుకు యత్నించింది.

ఇలా సింగరేణి.. పర్యావరణ పరిరక్షణలో అత్యుత్తమ ప్రమాణాలు పాటించినందుకు గానూ కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ డోర్లీ-2 ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ పరిరక్షణ డిపాజిట్‌ను విడుదల చేసింది. గతంలోనూ ఆర్కే -8 గనికి రూ.4 కోట్ల డిపాజిట్ కూడా తిరిగి పొందిన ఈ సంస్థ.. త్వరలో డోర్లీ-1 గనికి సంబంధించి మరో రూ.60 కోట్లకు పైగా నిధులను పొందే అవకాశముందని తెలుస్తోంది.

# మీకు హిట్లర్ ఆదర్శమా?

## రేపు.. నీకు అదే గతి పడ్తది?

## ప్రజలు అన్ని గమనిస్తుండ్రు?..

## సీఎం రేవంత్‌పై జీవన్ రెడ్డిధ్వజం



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఏమైనా కేసీఆర్‌ను ఆడిపోసుకోవడం ముఖ్యమంత్రికి తగదని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి అన్నారు. కేసీఆర్‌ను ఆడిపోసుకుంటేనే నీవు ఇక్కడిదాకా వచ్చినవ్? అని సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయన తనదైన శైలిలో మండిపడ్డా అయ్యారు. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి ఓ ఈవెంట్ సందర్భంగా తనను తాను హిట్లర్‌తో పోల్చుకుంటూ చేసిన కామెంట్స్‌పై దేశ వ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. హిట్లర్ గతి ఏమైందో చివరికి అందరం గమనించారని, అధికారం కోల్పోయాక.. రేపు.. రేవంత్ రెడ్డికి కూడా అదే గతి పడ్తదని అన్నారు. ప్రజాస్వామ్యంలో హిట్లర్‌గా ఉండాలని కోరుకునేటోడు ఎవరుండరన్నారు.

హిట్లర్ కావాలని ఎవరు కోరుకోరన్నారు. ఒక కాంగ్రెస్ నాయకుడిగా ఏం కావాలని కోరుకోవాలి.. ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలి. రాజీవ్ గాంధీని ఆదర్శంగా తీసుకోవాలి.. పండిట్ జవహర్ లాల్ నెహ్రూను ఆదర్శంగా తీసుకోవాలి. ఎవడన్నా హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుంటాడా?..అని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. ది మోస్ట్ నొటోరియస్ క్రిమినల్ ఎవడంటే హిట్లర్.. అలాంటి వాడిని ఇవాళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరల్డ్ మోస్ట్ నొటోరియస్ క్రిమినల్‌తో పోల్చుకుంటుడని ధ్వజమెత్తారు. దీన్ని బట్టే ఆయన ఎలాంటి పాలన కొనసాగిస్తుండో అర్థం చేసుకోవచ్చన్నారు.

# నూతన కార్మిక చట్టాల రాష్ట్ర నిబంధనల పై సంప్రదింపు సమావేశాలు

**హైదరాబాద్, జూన్ 10(మనం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు నూతన కార్మిక చట్టాలకు సంబంధించిన రాష్ట్ర నిబంధనల ఖరారు ప్రక్రియలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం నాలుగు అధికారుల కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు యజమానుల సంఘాలు, ఉద్యోగులు, కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులతో సంప్రదింపు సమావేశాలను నిర్వహించనున్నాయి. ఈసమావేశాలు నేటి నుంచి ఈనెల 16 వరకు హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్ద ఉన్న టీ. అంజయ్య భవన్‌లోని కార్మిక కమిషనర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు కమిషనర్ తెలిపారు.ప్రతిపాదిత నిబంధనలపై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయదలచిన యజమానుల సంఘాలు, కార్మిక సంఘాలు, ఉద్యోగుల ప్రతినిధులు, ఇతర వాణిజ్య సంఘాలు కార్మికశాఖ నిర్వహించే సమావేశాలకు హాజరై తమ సూచనలు అందించాలని కమిషనర్ కోరారు.ఈ సంప్రదింపుల ద్వారా కార్మికులు, యజమానులు,ఇతర భాగస్వాముల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర నిబంధనలను మరింత సమగ్రంగా రూపొందించనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. తెలిపారు.

# సావరిన్ గోల్డ్ బాండ్లు పెట్టుబడిదారులకు కాసుల వర్షం




**హైదరాబాద్, మనం ప్రతినిధి :** సావరిన్ గోల్డ్ బాండ్ల (ఎస్‌జీబీ) పెట్టుబడిదారులకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తీపి కబురు అందించింది. 2019-20 సిరీస్- 7వ యూనిట్ బాండ్ల ముందస్తు విత్ డ్రా (ప్రీమెచ్యూర్ రిడంప్షన్) ధరను యూనిట్‌కు రూ. 15,275గా ఖరారు చేసింది. ప్రస్తుతం పసిడి ధరలు రికార్డు స్థాయిలో కొనసాగుతుండటంతో, ఇన్వెస్టర్లకు ఊహించని రీతిలో భారీ లాభాలు దక్కనున్నాయి. 2019 డిసెంబర్ 10న జారీ చేసిన ఈ బాండ్లకు ఐదేళ్ల కాలపరిమితి పూర్తయిన నేపథ్యంలో, నిబంధనల ప్రకారం ముందస్తుగా నగదుగా మార్చుకునే వెసులుబాటును ఆర్బీఐ కల్పించింది. ఈ బాండ్లు జారీ చేసిన సమయంలో ఆన్లైన్ ద్వారా కొనుగోలు చేసిన వారికి గ్రాము రూ. 3,745కే లభించాయి. ప్రస్తుత రిడంప్షన్ ధర ప్రకారం చూస్తే, ప్రతి గ్రాముపై సుమారు రూ. 11,530 మేర లాభం చేకూరుతోంది.

ఇది దాదాపు 308 శాతం రాబడికి సమానం. ఉదాహరణకు, అప్పట్లో ఒక లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టిన వారి పెట్టుబడి విలువ ప్రస్తుతం సుమారు రూ. 4.08 లక్షలకు చేరుకుంది. దీనికి అదనంగా ఏటా లభించే 2.5 శాతం వడ్డీ ప్రయోజనం కూడా పెట్టుబడుదారులకు దక్కుతుంది.

ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) వెల్లడించిన గత మూడు పనిదినాల (జూన్ 5, 8, 9) ముగింపు ధరల సగటు ఆధారంగా ఆర్‌బీఐ ఈ రిడంప్షన్ ధరను నిర్ణయించింది. 999 స్వచ్ఛత కలిగిన బంగారం సగటు ధరను ఇందుకు ప్రామాణికంగా తీసుకున్నారు. భౌతిక బంగారంతో పోలిస్తే ఎటువంటి నిల్వ సమస్యలు, భద్రతాపరమైన ఆందోళనలు లేని సావరీన్ గోల్డ్ బాండ్లను ప్రభుత్వం తరఫున ఆర్‌బీఐ జారీ చేస్తుంది. ఈ బాండ్ల మొత్తం కాలపరిమితి 8 ఏళ్లు కాగా, ఐదేళ్ల తర్వాత విత్డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. బాండ్‌లను మెచ్యూరిటీ వరకు (8 ఏళ్లు) కొనసాగిస్తే మూలధన లాభాలపై పన్ను మినహాయింపు లభిస్తుంది. ముందస్తుగా విత్ డ్రా చేసుకోవాలనుకునే వారు సంబంధిత బ్యాంకులు, పోస్టాఫీసులు లేదా డిపాజిటరీల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆర్బీఐ సూచించింది.




# డేటా సెంటర్లో అగ్నిప్రమాదం..

- భారత్‌లో గూగుల్

## క్లౌడ్ సేవలకు అంతరాయం

**ఢిల్లీ, జూన్ 10:** భారత్లో గూగుల్ క్లౌడ్ సేవలకు అంతరాయం కలిగింది. ఢిల్లీలో ఈ సంస్థకు చెందిన థర్డ్ పార్టీ డేటా సెంటర్‌లో అగ్నిప్రమాదం జరగడంతో నెట్‌వర్కింగ్ పరికరాలు షట్డౌన్ అయ్యాయి. ఫలితంగా పలు ప్రాంతాల్లో క్లౌడ్ సేవలకు ఆటంకం ఏర్పడింది. ఈమేరకు క్లౌడ్ కంప్యూటింగ్ యూనిట్ వెల్లడించింది. అయితే ఈ ప్రమాదం ఎప్పుడు జరిగిందో మాత్రం చెప్పలేదు. ప్రాణ, ఆస్తి నష్టం గురించిన వివరాలు తెలియాల్సి ఉంది.ఇలాంటి అంతరాయాల వల్ల కంపెనీల కార్యకలాపాలు నెమ్మదిస్తుంటాయి. ఢిల్లీ, చెన్నై, ముంబయితో పాటు పలు ప్రాంతాల్లో నెట్‌వర్క్‌ట్రాఫిక్ ప్రభావితమైంది. పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని సంస్థ వెల్లడించింది. క్లౌడ్ ప్రొవైడర్‌లలో అమెజాన్ వెబ్ సర్వీసెస్, మైక్రోసాఫ్ట్ అజూర్తో గూగుల్ క్లౌడ్‌కు గట్టి పోటీ నెలకొంది.

# సమిష్టి కృషితోనే డ్రగ్స్ కట్టడి




## ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉండాలి

## గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక పోలీసింగ్

## రోడ్డు భద్రతా కమిటీలతో ప్రమాదాలకు చెక్: డీజీపీ

**హైదరాబాద్, జూన్ 10(మనం,ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రంలో మాదక ద్రవ్యాల కట్టడికి సమిష్టి కృషి అవసరమని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో బుధవారం పర్యటించిన డీజీపీ ప్రజా భద్రత, రోడ్డు భద్రత అవగాహన, మాదకద్రవ్యాల నియంత్రణ, సాంకేతిక ఆధారిత పోలీసింగ్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా పోలీస్ అతిథి గృహంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటిన అనంతరం చిల్డ్రన్స్ పార్క్, ట్రాఫిక్ ట్రైనింగ్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు.అలాగే గాంజా, డ్రగ్స్ లాంటి మాదకద్రవ్యాలకి బానిస పడిన వారికి కౌన్సిలింగ్ ఇస్తున్న అడిక్షన్ సెంటర్‌ని డీజీపీ సందర్శించారు. సేఫ్ ఆదిలాబాద్ లక్ష్యంగా సమీకృత సీసీటీవీల ఏర్పాటు ఆదిలాబాద్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీకృత సీసీటీవీ మానిటరింగ్ వ్యవస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ నాందేడ్, నిర్మల్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర సరిహద్దుకు అనుసంధానంగా ఉన్న ఆదిలాబాద్ జిల్లా వ్యూహాత్మకంగా ఎంతో కీలకమన్నారు. ఈ ప్రాంతాల మధ్య వాహనాలు, ప్రజల రాకపోకలు అధికంగా ఉండటంతో ట్రాఫిక్ పర్యవేక్షణ, ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణ, ప్రజా భద్రత బలోపేతంలో సీసీటీవీ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. హైదరాబాద్, సైబరాబాద్ నగరాల మాదిరిగా ఆదిలాబాద్ జిల్లాను కూడా సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దాలని సూచించారు.

**గ్రామీణ ప్రాంతాలలో :**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రాలతో పాటు చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను విస్తరించాలని అధికారులకు డీజీపీ సూచించారు. ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఇటీవల 300 కొత్త సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో ఆదిలాబాద్ పట్టణంలో మొత్తం కెమెరాల సంఖ్య 600కు చేరిందని తెలిపారు. అలాగే జిల్లా గ్రామాల్లో 1,200కు పైగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటన్నింటినీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయడం ద్వారా ఘటనలపై తక్షణ స్పందన సాధ్యమవుతుందని వివరించారు.

**పోలీసు అధికారులతో సమీక్ష :**

ఆదిలాబాద్ జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలు, గంజాయి ఇతర మాదకద్రవ్యాల నియంత్రణ, పెట్రోలింగ్ వ్యవస్థ, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై డీజీపీ సమీక్ష నిర్వహించారు. నేర నియంత్రణలో ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయాలని అధికారులకు డీజీపీ ఆదేశించారు.పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, యువతకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు యాంటీ నార్కోటిక్స్ అండ్ సేఫ్టీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రతి పోలీసు అధికారి ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రతిరోజూ నిర్దిష్ట సమయాన్ని ప్రజల సమస్యల పరిష్కారానికి కేటాయించాలని ఆదేశించారు. పోలీసు-ప్రజల సంబంధాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

**రోడ్డు భద్రతా కమిటీలు :**

గుడిహత్నూర్ మండలంలోని తోష గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. గ్రామసభలో గ్రామ పెద్దలు, సర్పంచ్, వార్డు సభ్యులు, యువతతో కలిసి మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేయాలి రోడ్డు భద్రత అనేది అందరి బాధ్యతని డీజీపీ పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని అర్హులైన వ్యక్తులకు పోలీసు, రవాణా శాఖల సహకారంతో లైసెన్సులు పొందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన రంగవల్లి పోటీలు, వాలీబాల్ టోర్నమెంట్ల విజేతలకు బహుమతులు అందజేశారు.

**సవాల్‌గా మారిన ప్రమాదాలు :**

రాష్ట్రంలో ప్రస్తుతం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, రోడ్డు ప్రమాదాలు కొత్త సవాళ్లుగా మారాయని డీజీపీ పేర్కొన్నారు.గత ఏడాది తెలంగాణ రాష్ట్రంలో 7,800 మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని, హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా అనేక మరణాలను నివారించవచ్చని తెలిపారు. వేగం ఉత్సాహాన్ని ఇవ్వొచ్చు, కానీ అదుపు కోల్పోతే ప్రాణాలను తీస్తుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఎవరూ నిర్లక్ష్యం చేయకూడదు అని హెచ్చరించారు. ఆదిలాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాద మరణాలు గణనీయంగా తగ్గాయని డీజీపీ కి జిల్లా ఎస్పీ వివరించారు. గత సంవత్సరం జనవరి నుంచి మే వరకు 72 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించగా, ఈ జనవరి - మే చివరి నాటికి సంఖ్య 48కు తగ్గిందన్నారు.అవగాహన కార్యక్రమాలు, పోలీసు, రవాణా శాఖలు, జిల్లా యంత్రాంగం సమిష్టి కృషి వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. 24 మంది ప్రాణాలు కాపాడటం అంటే 24 కుటుంబాలను విషాదం నుంచి రక్షించినట్టేనని తెలిపారు. కార్యక్రమంలో సీఐడీ, ఏసీబీ డీజీ చారు సిన్హా, ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా, మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు తీపి కబురు..

## ఏడాది పొడవునా ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తులు..

## ఇకపై విద్యార్థుల ఖాతాల్లోకే నేరుగా నగదు

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** సంక్షేమ విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ల కోసం ఏడాది పొడవునా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం కొత్త నిబంధనలు తెచ్చింది. ఈ నిబంధనలు 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలు కానున్నాయి. ఇకపై ఫీజుల డబ్బును డీబీటీ ద్వారా నేరుగా విద్యార్థుల ఖాతాల్లోనే వేస్తారు. అకౌంట్‌లలో జమ అయిన వారం రోజుల్లో కాలేజీలకు చెల్లించకపోతే ఆ డబ్బును రికవరీ చేస్తారు. దరఖాస్తు చేసుకున్న తేదీల ఆధారంగా నాలుగు విడతల్లో నిధులు విడుదల చేసేలా షెడ్యూల్ ఖరారైంది. తెలంగాణ రాష్ట్రంలోని సంక్షేమ శాఖల పరిధిలోని విద్యార్థులకు బోధన ఫీజులు, ఉపకార వేతనాల మంజూరు ప్రక్రియలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. అర్హులైన ఎస్టీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, దివ్యాంగ విద్యార్థులు ఫీజుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఇకపై ఎలాంటి కాలపరిమితి ఉండదు. విద్యార్థులు ఏడాది పొడవునా ఎప్పుడైనా దరఖాస్తులు చేసుకునేందుకు వీలుగా ఈ-పాస్ పోర్టల్‌ను నిరంతరం తెరిచి ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, దరఖాస్తు చేయడంలో ఆలస్యం జరిగితే ఫీజుల విడుదల కూడా ఆలస్యమవుతుందని ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి ముందే మంజూరు విధానాన్ని అమలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు గతంలో ఉన్న జీవో నంబర్ 7ను రద్దు చేస్తూ.. కొత్త నిబంధనలతో నోడల్ విభాగమైన ఎస్సీ సంక్షేమ శాఖ సరికొత్త మార్గదర్శకాలతో కూడిన జీవోను జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలు రానున్న 2026-27 విద్యాసంవత్సరం నుంచే అధికారికంగా అమలులోకి రానున్నాయి. నూతన నిబంధనల ప్రకారం.. ఇకపై బోధన ఫీజుల మొత్తాన్ని విద్యాసంస్థలకు కాకుండా, ప్రత్యక్ష నగదు బదిలీ విధానం ద్వారా నేరుగా విద్యార్థుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోనే ఒకే విడతగా జమ చేస్తారు. ఎస్సీ విద్యార్థుల స్కాలర్‌షిప్ మంజూరులో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న బదిలీ విధానాలనే ఇకపై రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తిస్థాయిలో అమలు చేయనుంది. ప్రభుత్వం విద్యార్థుల ఖాతాల్లో ఫీజు మొత్తాన్ని విడుదల చేసిన వారం రోజుల్లో ఆ నిధులను విద్యార్థులు సంబంధిత కాలేజీలకు తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ నిర్ణీత గడువులోగా కాలేజీలకు ఫీజు చెల్లించకుంటే సదరు విద్యార్థి నుంచి చట్టపరమైన నిబంధనల కింద ఆ మొత్తాన్ని రికవరీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది.

ఫీజుల చెల్లింపుల ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ ప్రభుత్వం స్పష్టమైన టైం-షెడ్యూల్‌ను ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి జులై 31 వరకు అందిన దరఖాస్తులను పరిశీలించి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వ వాటాను ఆగస్టు 15 నాటికి విడుదల చేస్తారు. కేంద్ర ప్రభుత్వ వాటా నిధులు అందిన వెంటనే ఆ మొత్తాన్ని కూడా లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తారు. అలాగే బీసీ, మైనార్టీ, ఈబీసీ, దివ్యాంగ విద్యార్థులకు కూడా ఆగస్టు 15నే ఫీజులు చెల్లిస్తారు. ఆగస్టు 1 నుంచి నవంబరు 30 వరకు దరఖాస్తు చేసిన వారికి డిసెంబరు 30 నాటికి, డిసెంబరు 1 నుంచి జనవరి 31 వరకు దరఖాస్తు చేసుకున్న వారికి ఫిబ్రవరి 28 నాటికి నిధులు అందుతాయి. ఇక చివరి విడతగా ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు దరఖాస్తు అందిన 75 రోజుల్లోగా నిధులు విడుదల చేస్తారు.

ఈ కొత్త విధానంలో విద్యార్థులకు ఉపశమనం కలిగించేలా ఆటోమేటిక్ రెన్యువల్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. 2026-27 విద్యాసంవత్సరం నుంచి కొత్తగా ప్రవేశాలు పొందే విద్యార్థులు తదుపరి సంవత్సరాల్లో మళ్లీ రెన్యువల్ చేసుకోవాల్సిన అవసరం లేదు, వారి వివరాలు ఆటోమేటిక్‌గా అప్‌డేట్ అవుతాయి. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం గరిష్టంగా రూ.2.5 లక్షల లోపు ఉండాలి. ఈ-పాస్ పోర్టల్లో విద్యార్థుల సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత కోసం విద్యాసంస్థలు ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను అమలు చేయనున్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అక్రమంగా ఫీజులు పొందితే రికవరీ చర్యలు ఉంటాయన్నారు. అలాగే, ఏటా థర్డ్ పార్టీ సంస్థలతో 10 శాతం విద్యాసంస్థల్లో విద్యార్థుల అర్హతలపై సోషల్ ఆడిట్, మదింపు నిర్వహిస్తారు.

# జనహృదయనేత మంత్రి జూపల్లి

- అన్నమాట నిలబెట్టుకున్న మంత్రి
- నాలుగు ఎకరాల సొంత భూమిని మినీ స్టేడియానికి విరాళం
- రూ.1.50 కోట్ల విలువైన సొంత స్థలం కేటాయింపు
- స్వయంగా మంత్రి తహసీల్దార్ కార్యాలయంలో డిజిటల్ సంతకం చేసిన ఘనత
- భూమి బదిలీ ప్రక్రియ పూర్తి



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 10 (మనం బ్యూరో):** రాజకీయాల్లో ఎప్పుడూ ఆదర్శంగా ఉంటూ... ప్రజా సంక్షేమాన్ని, నిజాయితీని, విలువలను తమ సిద్ధాంతాలుగా మార్చుకున్న పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నిస్వార్థ నిర్ణయం తీసుకున్నారు. గతంలో తాను స్థానిక క్రీడాకారులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ సుమారు రూ.1.50 కోట్ల విలువైన తన 4 ఎకరాల సొంత భూమిని మినీ స్టేడియం నిర్మాణానికి విరాళంగా అందజేశారు. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వీపనగండ్ల మండల కేంద్రంలో ఉన్న తన సొంత భూమిని క్రీడా మైదానానికి బదలాయిస్తూ బుధవారం కోడేరు మండల తహసీల్దార్ (ఖ) కార్యాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా డిజిటల్ సంతకం చేశారు. గతంలో వీపనగండ్ల మండల పర్యటనకు వచ్చిన సందర్భంలో, స్థానిక యువత, క్రీడాకారుల అభ్యర్థన మేరకు మినీ స్టేడియం ఏర్పాటు కోసం తన సొంత భూమిని ఇస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ మేరకు వీపనగండ్ల మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 532/ఆ పరిధిలో తన పేరు మీద ఉన్న 4 ఎకరాల పట్టా భూమిని ప్రభుత్వానికి బదిలీ చేశారు. కోడేరు తహసీల్దార్ కార్యాలయంలో వీపనగండ్ల ఎంఆర్ఓ డిజిటల్ లాగిన్ ద్వారా ఈ భూమిని మినీ స్టేడియానికి కేటాయిస్తూ అధికారిక ప్రక్రియను పూర్తి చేశారు. ఈ చారిత్రాత్మక భూ బదలాయింపు ప్రక్రియకు సాక్షులుగా వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మునిగొండ గోపి, నాగర్కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ అధికారికంగా డిజిటల్ సంతకాలు చేశారు. రూ.కోట్లలో విలువ చేసే భూమిని క్రీడల అభ్యున్నతి కోసం, నిరుపేద గ్రామీణ యువత భవిష్యత్తు కోసం దానం చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావును మంచి మనసున్న నాయకుడని పలువురు ప్రశంసించారు. మంత్రికి ప్రజలు, క్రీడాకారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణా పనులను వేగవంతం చేయాలి

- పూర్తయిన ఇండ్ల నిర్మాణాలను ప్రారంభించాలి
- గృహ ప్రవేశాల ఇందిరమ్మ ఇండ్లను నిరంతర పర్యవేక్షణ చేయాలి
- కొల్లాపూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై సమీక్ష సమావేశం
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**ఉమ్మడి మహబూబ్ నగర్, జూన్ 10 (మనం బ్యూరో):** ఇందిరమ్మ ఇల్లు అనేది కేవలం ఒక ప్రభుత్వ పథకం మాత్రమే కాదని, అది ఒక నిరుపేద కుటుంబం జీవితాన్ని మార్చే ముహూర్తరమైన ఒక అద్భుత కార్యక్రమమని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెంట్లవెల్లి, కొల్లాపూర్, కొడేరు మండల కేంద్రాల్లో ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతిపై బుధవారం మంత్రి క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు, హౌసింగ్ డీఈలు, గెజిటెడ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కొల్లాపూర్ నియోజకవర్గంలో మొదటి విడత కింద మంజూరైన 3,500 ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇంకా అనుమతులు మంజూరై.. నిర్మాణాలు ప్రారంభించక పోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. రాబోయే 15 రోజుల్లోపు ప్రక్రియను అంతా పూర్తి చేసి, సాంకేతికంగా అనుమతి పొందిన ప్రతి ఇంటి నిర్మాణం పనులు ప్రారంభం కావాల్సిందేనని అధికారులకు స్పష్టం చేశారు. ఒకవేళ గడువులోగా ప్రారంభం కాని ఇండ్లు ఉంటే, వాటిని అవసరమున్న ఇతర గ్రామాలకు కేటాయించే పరిస్థితి వస్తుందని ఆయన సుతిమెత్తగా హెచ్చరించారు. గ్రామాల్లో మంజూరైన ప్రతి ఇంటి నిర్మాణం మొదలయ్యేలా ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. సాంకేతిక (ఎల్ 3) కారణాల వల్ల పేమెంట్లు నిలిచిపోయిన 57 మంది లబ్ధిదారుల సమస్యను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. గృహ నిర్మాణ శాఖ మంత్రితో నిరంతరం చర్చిస్తున్నందున త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. పొరపాటున ఎల్-3 జాబితాలో చేరిన అర్హులైన నిరుపేదలకు న్యాయం చేసేందుకే ప్రభుత్వం గెజిటెడ్ ఆఫీసర్ వెరిఫికేషన్ విధానాన్ని తీసుకువచ్చిందని స్పష్టం చేశారు. అధికారులు గ్రామానికి వెళ్లిన రోజే పెండింగ్ వెరిఫికేషన్లు పూర్తి చేసి, ఎంపీడీవోలతో సమన్వయం చేసుకొని అర్హులను ఎల్-1 జాబితాలోకి మార్చాలని ఆదేశించారు. 'మళ్లీ వస్తాం.. తర్వాత చూస్తాం' అనే ధోరణి వీడాలన్నారు. అర్హులైన ఒక్క నిరుపేద కూడా సాంకేతిక కారణాలతో ఇంటికి దూరం కాకూడదని కరాఖండిగా మంత్రి చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇళ్లు నిర్మించుకోలేని అత్యంత నిరుపేద లబ్ధిదారుల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. సొంతంగా ఇల్లు కట్టించుకోలేని వారికి ప్రత్యేక ఏజెన్సీ ద్వారా సుమారు రూ.5 లక్షల వ్యయంతో ఇళ్ల నిర్మాణం చేపట్టే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రతినిధులు వీడియో ప్రజెంటేషన్ ద్వారా నిర్మాణ ప్రమాణాలు, పనుల దశలను వివరించగా, ఇటువంటి లబ్ధిదారులను గ్రామ స్థాయిలో గుర్తించి, ప్రత్యేక ప్రొఫార్మాలో వివరాలను సేకరించి నిర్ణీత గడువులోపు సమర్పించాలని ఎంపీడీవోలను, పంచాయతీ కార్యదర్శులను మంత్రి ఆదేశించారు. నియోజకవర్గానికి రెండో విడత కింద మంజూరైన 2,000 ఇందిరమ్మ ఇండ్లలో గుడిసెల్లో నివసించే కుటుంబాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. గతంలో మంజూరై అసంపూర్తిగా ఉన్న ఇండ్ల వివరాలను సేకరించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఎంపీడీవోలు గ్రామాల వారీగా ప్రతిరోజూ పురోగతిని సమీక్షించాలన్నారు. హౌసింగ్ డీఈలు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తూ సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నుంచి ఇంటి నిర్మాణం పూర్తై, గృహ ప్రవేశం వరకు తమ కర్తవ్య నిర్వహణగా భావించి అధికారులు పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి వెంట సంబంధిత శాఖ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న నీటి బొట్టు ఒడిసి పట్టు

- ఆదాయ వనరులపై దృష్టి పెట్టు
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్




**ఉమ్మడి మహబూబ్ నగర్, జూన్ 10 (మనం బ్యూరో):** నాగర్కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తిమ్మాజీపేట మండలం బావాజీపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో గ్రామాభివృద్ధి, వ్యవసాయ రంగ పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....., ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు సంప్రదాయ వరి సాగుపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా జొన్న, రాగి వంటి చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్ల తోటలు అదేవిదంగా ఇతర లాభదాయక పంటలను సాగు చేయడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చని కలెక్టర్ సూచించారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు ఏర్పడవచ్చు అని భారత వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో నీటి వనరులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో తక్కువ నీటితో అధిక దిగుబడులు ఇచ్చే పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ రైతులను కోరారు. చిరుధాన్యాల వినియోగం దేశవ్యాప్తంగా పెరుగుతున్నందున వాటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. రైతులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల సాగు చేపడితే ఆర్థికంగా మరింత లాభపడగలరని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడంతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు అందించే సూచనలు, సలహాలను పాటించాలని సూచించారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పశుపోషణ, ఉద్యానవనం, చేపల పెంపకం వంటి రంగాలపై కూడా రైతులు దృష్టి పెట్టాలని కలెక్టర్ తెలిపారు. రైతుల ఆదాయ వృద్ధికి అవసరమైన అన్ని విధాల సహకారాన్ని జిల్లా యంత్రాంగం అందిస్తుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో కొనసాగనున్న ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు అర్హులైన ఓటర్లు ఉండేలా, అనర్హులైన ఓటర్లను తొలగించే కార్యక్రమం చేపడుతుందని గ్రామంలోని ప్రతి ఒక్కరు సర్ కార్యక్రమంపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. అనంతరం గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి పనులు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రహదారులు తదితర అంశాలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. గ్రామాభివృద్ధికి ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మండల స్థాయి అధికారులు సమయపాలన పాటించకుండా ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి, మండల అధికారులు, గ్రామపంచాయతీ సభ్యులు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నేరాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లే అధిక ప్రాణ నష్టం

- నిర్లక్ష్య డ్రైవింగ్ వల్లే అధిక రహదారి ప్రమాదాలు
- సురక్షిత ప్రయాణం కోసం ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలి
- సిద్దిపేట అరైవ్ అలైవ్ కార్యక్రమంలో పాల్గొన్న డీజీపీ శిఖా గోయల్



**సిద్దిపేట జూన్ 10 ; మనం ప్రతినిధి :** సమాజంలో జరుగుతున్న నేరాల కంటే రహదారి ప్రమాదాల వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తుందని హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, డీజీపీ శిఖా గోయల్ ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం మత్తు, అతివేగం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ సెంటర్ లో బుధవారం జరిగిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రహదారి భద్రతా అవగాహన సదస్సులో శిఖా గోయల్ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఏటా 8000 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించడం ఆందోళన కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సగటున రాష్ట్రంలో ఏడాదికి 800 హత్యలు జరుగుతుంటే 8000 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ ప్రమాదాలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో జరుగుతున్నాయని, మద్యం మత్తులో అతివేగం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడడం అత్యంత ప్రమాదకరంగా వాహన డ్రైవర్లు గమనించాలన్నారు. సురక్షిత ప్రయాణం కోసం ప్రతి ఒక్కరు ప్రయత్నించాలని గుర్తు చేశారు. హెల్మెట్ ధరించడమే కాకుండా దాని స్ట్రాప్ తప్పని సరి లాక్ చేయడం మరువద్దన్నారు.

### ప్రమాద బాధితుల ప్రాణ రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి.. కలెక్టర్

రహదారిపై ప్రమాదాలు జరిగినప్పుడు అందుబాటులో ఉన్నవారు ఫోన్ ద్వారా వీడియోలు తీస్తూ కాలయాపన చేయకుండా బాధితుల ప్రాణాలు రక్షించడానికి ప్రయత్నం చేయడం గుర్తించాలని జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు. అంబులెన్స్ కు, పోలీసులకు సమాచారం వీలైనంత తొందరగా ఇస్తే బాధితుల ప్రాణాలను కాపాడిన వారవుతారన్నారు. ఇంకా మానవత్వంతో బాధితులకు సహాయం చేస్తూ సిపిఆర్ లాంటి చర్యలు చేపట్టి తే మంచిదన్నారు. ప్రమాదాల నివారణకు గ్రామ సభల్లో కూడా ప్రత్యేక భద్రత కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

### ప్రజల్లో సామాజిక అవగాహన కల్పించడం కూడా పోలీసుల బాధ్యత.. సీపీ

శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల్లో సామాజిక అవగాహన కల్పించడం కూడా పోలీసుల బాధ్యత అని జిల్లా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు. ప్రజల భద్రత అనేది ఉమ్మడి బాధ్యతగా గుర్తించాలన్నారు. రహదారి నిబంధనలు పాటించాలని జిల్లాను ప్రమాద రహిత, చలాన్ రహిత జిల్లాగా మార్చాలని కోరారు.

### ఉచిత కంటి శిబిరం

రహదారి భద్రత అవగాహన సదస్సు కార్యక్రమం సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి కంటి అద్దాలు, మెడికల్ కిట్లను డీజీపీ శిఖా గోయల్ పంపిణీ చేశారు. ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లను అందజేశారు. భద్రత పై అవగాహన వీడియోలను ప్రదర్శించిన అనంతరం కనువిప్పు బృందం ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రత ప్రమాణాల ఉల్లంఘనలపై కళా ప్రదర్శన నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు అడ్మిన్ కుశాల్కర్, ఏఆర్ సుభాష్ చంద్రబోస్, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది విద్యార్థులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## హిందుస్థాన్-పాకిస్తాన్ విభజన వెనుక కాంగ్రెస్ పాత్రను మర్చిపోవద్దు



- ఎంపీ రఘునందన్ రావు

**గజ్వేల్, జూన్ 10 మనం న్యూస్:** కొండపాక మండలంలోని ఓ ప్రైవేట్ రిసార్ట్లో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు అనుసరించాల్సిన విధానాలు, సంస్థాగత నిర్మాణం, ప్రజల్లో పనిచేసే తీరు గురించి వివరించారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతున్న కాంగ్రెస్ నాయకులు తమ పార్టీ చరిత్రను ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు. స్వాతంత్ర్యం అనంతరం మతం ఆధారంగా దేశాన్ని విభజించి హిందుస్థాన్, పాకిస్తాన్లుగా విడగొట్టిన చరిత్ర కాంగ్రెస్కే ఉందని విమర్శించారు. అలాంటి పార్టీ నేడు మత సామరస్యంపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని ఆరోపించారు. సమయానుకూలంగా పనిచేసే నాయకులకు బీజేపీలో అపార అవకాశాలు ఉన్నాయని, కార్యకర్త స్థాయి నుంచి అత్యున్నత పదవుల వరకు ఎదిగే అవకాశం ఈ పార్టీలోనే ఉందని పేర్కొన్నారు. సరైన నిర్ణయాలు తీసుకుంటే రాజకీయంగా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, తప్పు నిర్ణయాలు భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తాయని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, దేశానికి అత్యధిక కాలం సేవలందించిన ప్రధానిగా చరిత్ర సృష్టించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ ఎదగడంలో ప్రతి కార్యకర్త పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, ఎల్లు రాంరెడ్డి, అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్తో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు గర్నెపల్లి కృష్ణమూర్తి, ఐలయ్య, తడుపునూరు వెంకటేశం, విద్యాసాగర్, లక్ష్మణ్ గౌడ్, మనోహర్ యాదవ్, వెంకట్ రెడ్డి, కుడికెల రాములు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభలో ప్రజా సమస్యలపై సమీక్ష

- అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు చర్యలు
- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్




అరైవ్-అలైవ్'లో హెల్మెట్ల పంపిణీ చేసిన కలెక్టర్, అదనపు ఎస్పీ నర్సింహా రెడ్డి

**కామారెడ్డి జిల్లా, జూన్ 10 (మనం ప్రతినిధి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బిక్నూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొని గ్రామస్థుల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలు తీరుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. గ్రామ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, వాటిపై సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో నాలుగు దఫాలుగా ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తూ గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని పూరిగుడిసెలను గుర్తించి అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందని, బిక్నూర్ గ్రామంలో ఇప్పటికే 10 పూరిగుడిసెలను గుర్తించినట్లు వెల్లడించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తూ 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతను ఓటరు జాబితాలో నమోదు చేయడం, డబుల్ ఓటర్ల పేర్లను తొలగించడం జరుగుతోందని తెలిపారు. అలాగే 'జన సంరక్షణ - మన సంరక్షణ' కార్యక్రమం కింద జిల్లాలో 36 వేల కందకాలు తవ్వినట్లు పేర్కొన్నారు.

### గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకం

గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఆయిల్ పామ్ సాగుపై విస్తృత అవగాహన కల్పించి, పంట విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామసభల ద్వారా ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం లభిస్తుందని అన్నారు.

అనంతరం 'అరైవ్-అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహించి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేసిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు ఎస్పీ నర్సింహా రెడ్డి ప్రతి ప్రయాణంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నర్సింహా రెడ్డి, అదనపు కలెక్టర్ ఎం.వి. గిరి, గ్రామ సర్పంచ్ రేఖ, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నివారణ టీకాలు వేయించండి... ముగజీవల ప్రాణాలు కాపాడుకోండి...

- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 10 (మనం బ్యూరో):** నాగర్కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని బావాజీపల్లి గ్రామంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత పశు టీకాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ హాజరై రైతులకు అవగాహన కల్పించారు. పశుసంపదను అంటువ్యాధుల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఉచిత టీకాల కార్యక్రమాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో పాడి పశువులు, గేదెలకు లంపీ స్కిన్ వ్యాధి (ఎల్ ఎస్ డి), గొంతువాపు వ్యాధి (హెచ్ ఎస్), జబ్బవాపు వ్యాధి (బి క్యు) నివారణకు ఉచిత టీకాలు వేశారు. అదేవిధంగా గొర్రెలు, మేకలలో ప్రాణాంతకంగా మారే చిటుక రోగం ఈటి) నివారణకు ప్రత్యేక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువైద్య అధికారులు గ్రామంలోని పశువులను పరిశీలించి టీకాలు అందించారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....., పశుసంపద రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఆధారమన్నారు. పశువుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటేనే పాల ఉత్పత్తి పెరగడంతో పాటు రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందన్నారు. లంపీ స్కిన్ వంటి వైరల్ వ్యాధులు పశువుల ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు ఆర్థిక నష్టాలకు దారితీస్తాయని వివరించారు. అందువల్ల ప్రభుత్వం అందిస్తున్న ఉచిత టీకాలను ప్రతి పశువుకు తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో పశువులకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో టీకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పశువులకు ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప పశువైద్య అధికారులకు సమాచారం అందించాలని రైతులకు సూచించారు. వ్యాధుల నివారణలో రైతుల సహకారం అత్యంత అవసరమన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పశుసంపదను సంరక్షించవచ్చని తెలిపారు.



ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ అధికారులు టీకాల ప్రాముఖ్యత, వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి. జ్ఞాన శేఖర్ , మండల పశువైద్యాధికారి డాక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి, పశు వైద్య సిబ్బంది తిరుపతయ్య, (ఎల్ ఎస్ ఏ), యాదగిరి ఓఎస్ లు శాంతయ్య, గోపాలమిత్రులు జగ్జీవన్, స్వామి గ్రామ పెద్దలు, పాడి రైతులు, గొర్రెల కాపర్లు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- వైద్య ఉద్యోగాలకు ఎంపికైన వారి లిస్టు విడుదల

**హైదరాబాద్, జూన్ 10(మనంన్యూస్):** ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల కొరతను తీర్చడంతో పాటు వైద్య విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన నియామక ప్రక్రియలో మరో కీలక ముందడుగు పడింది. డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో 30 స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ డిపార్ట్మెంట్లలోని 433 పోస్టుల భర్తీ ప్రక్రియను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు పూర్తి చేసింది. ఈ మేరకు ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్ల లిస్టును బుధవారం బోర్డు విడుదల చేసింది.ప్రభుత్వ మెడికల్ కాలేజీలలోని 34 విభాగాలకు చెందిన మొత్తం 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి బోర్డు గతంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో అనస్తీషియా, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ విభాగాలకు చెందిన 174 పోస్టుల భర్తీ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఆ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇటీవలే నియామక పత్రాలను అందజేశారు. తాజాగా మిగిలిన 30 డిపార్ట్మెంట్లలో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించిన తుది ఫలితాలు, సెలక్షన్ లిస్టును ఎంహెచ్ఎస్ఆర్బీ విడుదల చేసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులతో పాటు, 4 స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులకు సంబంధించిన సెలక్షన్ జాబితాను కూడా బోర్డు విడుదల చేసింది. ఉద్యోగాలకు ఎంపికైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు, స్పీచ్ పాథాలజిస్టులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. త్వరలోనే వారికి నియామక పత్రాలను అందజేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, టీచింగ్ హాస్పిటల్స్, ఇతర ఆరోగ్య సంస్థల్లో మానవ వనరులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

గత రెండున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ పరిధిలో సుమారు 15 వేల పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. ఇందులో ఎంబీబీఎస్ వైద్యులు, స్పెషలిస్టు వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, పారామెడికల్ సిబ్బంది తదితర విభాగాలకు చెందిన పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఈ నియామకాల ద్వారా ప్రభుత్వ హాస్పిటల్స్లో వైద్య సేవల నాణ్యత మరింత మెరుగుపడి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# 12 ఏళ్ల రికార్డ్.. కంగ్రాట్స్ మోడీజీ

## ఇటలీ ప్రధాని మెలోనీ విషెస్



**రోమ్, జూన్ 10:** ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఇరుదేశాల మధ్య బలపడుతోన్న సంబంధాలను ప్రస్తావిస్తూ ఆమె ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. 'భారతదేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన మోదీకి నా అభినందనలు. ఇటీవల రోమ్‌లో మళ్లీ మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. ఇరుదేశాల ప్రజల కోసం కొత్త అవకాశాలను సృష్టించే దిశగా ఒక ప్రత్యేకమైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సంయుక్తంగా ప్రారంభించడం కూడా మంచి విషయం' అని మెలోనీ రాసుకొచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు కలిసి ఉన్న ఫొటోను ఆమె పంచుకున్నారు.

'భారత్‌లో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన ప్రధాని మోదీకి అభినందనలు. ఈ ఘనత ఆయన దశాబ్దాల ప్రజాసేవకు, నాయకత్వానికి ఒక శక్తిమంతమైన నిదర్శనం'

**అమెరికా రాయబారి సెర్గియో గోర్**

'చారిత్రక మైలురాయికి చేరుకున్న ప్రధాని మోదీకి అభినందనలు. భారతదేశ అభివృద్ధి, శ్రేయస్సు, ప్రపంచ వేదికపై దాని స్థానాన్ని పెంపొందించడంలో ఆయన ఎంతో కృషి చేశారు. భారత్‌తో ఉన్న సన్నిహిత, సుదీర్ఘ స్నేహాన్ని మలేషియా గౌరవిస్తోంది. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు మన ప్రజలకు అవకాశాలను విస్తరించడంలో సహకారాన్ని కొనసాగించేందుకు నేను ఎదురుచూస్తున్నా. మోదీ ఇలాంటి మరెన్నో ఘనతలు సాధించాలని.. భారత ప్రజలు శాంతి, శ్రేయస్సులతో ఉండాలని ఆకాంక్షిస్తున్నా'. మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం.

# పాలనకు కాదు.. ప్రజాస్వామ్య హత్యకు సారథ్యం వహిస్తున్న మోదీ: కాంగ్రెస్



**ఢిల్లీ, జూన్ 10:** ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో.. ఎన్నికైన ప్రధానుల్లో నిరంతరాయంగా సుదీర్ఘకాలం కొనసాగిన నేతగా మోడీ రికార్డు సృష్టించారు. దీనిపై ప్రతిపక్ష కాంగ్రెస్ స్పందిస్తూ మోడీపై విమర్శలు గుప్పించింది. ఆయన స్వయంప్రకటిత మైలురాయిని దాటారేమో కానీ, దేశానికి పెద్ద సమస్యగా పరిణమించారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. మోదీ పాలనకు కాకుండా దేశంలో ప్రజాస్వామ్య హత్యకు సారథ్యం వహిస్తున్నారని అన్నారు.

1947 ఆగస్టు 15న జవహర్లాల్ నెహ్రూ ఒక అద్భుతమైన మంత్రివర్గానికి అధ్యక్షత వహించి.. భారత ప్రధాని అయ్యారని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అరుదైన ఆ మంత్రివర్గం పాలనలో ఐదేళ్లలోనే ఆధునిక భారతం ఆవిర్భవించిందన్నారు. 560కి పైగా రాచరిక రాష్ట్రాలను శాంతియుతంగా భారత యూనియన్లో విలీనం చేశారని.. భారత రాజ్యాంగాన్ని ఆమోదించారని అన్నారు. దేశంలోని జమీందారీ వ్యవస్థ రద్దు, షెడ్యూల్ కులాలు, తెగలకు రిజర్వేషన్లు, నీటిపారుదల ప్రాజెక్టు వంటి నిర్ణయాలతో దేశం ప్రపంచ వ్యవహారాల్లో ఒక శక్తిగా ఆవిర్భవించిందన్నారు. 1947-52 మధ్య నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు దేశం నెలకొల్పిన రికార్డులను మోడీ చరిత్ర నుంచి చెరిపేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. 1952, 1957, 1962 ఎన్నికల్లో నెహ్రూ భారీ మెజారిటీతో విజయం సాధించగా.. 2024లో మోడీకి కనీస మెజారిటీ కూడా రాలేదని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. ప్రధాని కావడానికి ఎన్డీఏ నేతలకు తాయిళాలు ఇచ్చి మద్దతు కూడగట్టుకోవాల్సి వచ్చిందన్నారు. మోదీ పరిపాలనలో స్వతంత్ర ఎన్నికల సంఘం, పవిత్రమైన ఓటర్ల జాబితా వంటి ప్రజాస్వామ్య వ్యవస్థలు ముప్పులో పడ్డాయన్నారు. పేపర్ లీక్ల కుంభకోణాలతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రైవేటీకరణ పేరుతో ఎన్నో ప్రభుత్వ ఆస్తులను కొందరు ధనవంతుల పరం చేస్తున్నారని దుయ్యబట్టారు. షెడ్యూల్ కులాలు, తెగలు ఇతర వెనకబడిన తరగతులకు కల్పించిన రిజర్వేషన్లను బలహీనపరుస్తున్నారని విమర్శించారు.

# మమతకు షాక్.. మరో ఎంపీ రాజీనామా



**ఢిల్లీ, జూన్10:** తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఎంపీ సుష్మితా దేవ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇప్పటికే మమతకు నమ్మకస్తుడైన సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

అస్సాం కాంగ్రెస్ సీనియర్ నేత సంతోష్ మోహన్‌దేవ్ కుమార్తె సుష్మితా దేవ్. గతంలో అస్సాంలోని సిల్చార్ నుంచి కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీగా పనిచేశారు. 2019లో ఓటమి తర్వాత ఆ పార్టీని వీడి.. 2021లో టీఎంసీలో చేరారు. టీఎంసీలో అతికొద్దికాలంలోనే ఉన్నత పదవులు అందుకున్నారు.

పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా.. ఆ తర్వాత రాజ్యసభ సభ్యత్వాన్ని కూడా పొందారు. బుధవారం తన సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు రాజ్యసభ ఛైర్మన్‌కు ఆమె లేఖ రాశారు. తక్షణమే దీన్ని ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. రాజీనామా ప్రకటించిన వెంటనే కీలక పరిణామం చోటుచేసుకుంది. సుష్మిత ఢిల్లీలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మను కలిశారు. దీంతో ఆమె బీజేపీలో చేరే అవకాశం ఉందనే ఊహాగానాలు నెలకొన్నాయి.

# నీట్ రీ-ఎగ్జామ్.. ఆ సర్క్యులర్ ఫేక్: ఎన్టీఏ



**ఢిల్లీ, జూన్ 10:** నీట్ (యూజీ) రీ-ఎగ్జామ్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులను గందరగోళానికి గురిచేసేలా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోన్న ఓ సర్క్యులర్‌పై ఎన్టీఏ స్పందించింది. ఈ జాతీయ పరీక్ష ప్యాటర్న్‌ను సవరించినట్లుగా జరుగుతోన్న ప్రచారాన్ని ఖండించింది. ఈ సర్క్యులర్ పూర్తిగా నకిలీదని స్పష్టం చేసింది. ఎన్టీఏ అలాంటి నోటీసు జారీ చేయలేదని పేర్కొంటూ పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. పరీక్షలకు సంబంధించిన సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్లు, వేదికల్లో చెక్ చేసుకోవాలని ఈ సందర్భంగా విద్యార్థులకు ఎన్టీఏ సూచించింది. నీట్ పరీక్షకు సంబంధించిన అధికారిక సమాచారం, అప్‌డేట్స్‌కోసం neet.nta.nic.in వెబ్‌సైట్‌లో చూడాలని కోరింది.

రీ-ఎగ్జామినేషన్ విషయంలో పక్కా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకోసం మల్టీ లేయర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. పేపర్ తయారీ నుంచి ప్రింటింగ్, ప్యాకేజింగ్, స్టోరేజీ, రవాణా, పంపిణీ వరకు అన్ని దశల్లో బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలుచేస్తున్నారు. పేపర్ రవాణా కోసం వాయుసేన విమానాలను వినియోగించనున్నారు.

# నాడు పని మనిషి.. నేడు గృహ నిర్మాణశాఖ సహాయ మంత్రి..



**కోల్‌కతా, జూన్ 10:** పశ్చిమ బెంగాల్లో మంత్రులకు శాఖలు కేటాయించారు. సీఎం శుభేందు అధికారి హోంశాఖను తన వద్దే ఉంచుకున్నారు. పలు ఇళ్లల్లో పనిచేస్తూ జీవనోపాధి సాగించి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కలితా మాఝికి మంత్రి పదవి దక్కింది. ఆమెకు గృహనిర్మాణ శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. బెంగాల్ ఎన్నికల్లో తూర్పు వర్ధమాన్ జిల్లా ఔస్‌గ్రామ్ నియోజకవర్గం నుంచి ఆమె టీఎంసీ అభ్యర్థిపై 12,535 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మరోవైపు, జర్నలిస్ట్ నుంచి రాజకీయ నాయకుడిగా మారిన స్వపన్ దాస్‌గుప్తా ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

తపస్ రాయ్- పరిశ్రమలు, వాణిజ్య శాఖ,దిలీప్ ఘోష్- పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ, అగ్నిమిత్ర పాల్- పట్టణాభివృద్ధి, పురపాలక వ్యవహారాల శాఖ,డాక్టర్ శరద్వత్ ముఖర్జీ- ఆరోగ్య శాఖ, జగన్నాథ్ ఛటోపాధ్యాయ- ఉన్నత విద్యాశాఖ,దూద్ కుమార్ మండల్- వ్యవసాయ శాఖ, దీపక్ బర్మన్- పాఠశాల విద్యాశాఖ,శంకర్ ఘోష్- పర్యాటక, పార్లమెంటరీ వ్యవహారాలు,అర్జున్ సింగ్- కార్మిక, రవాణా శాఖ ఇంద్రనీల్ ఖాన్ -క్రీడలు, యువజన, వినియోగదారుల వ్యవహారాల శాఖ,మాలతీ రావ రాయ్- మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి శాఖలను కేటాయించారు.

# కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనానికి చర్చలు..?



**ఢిల్లీ, జూన్ 10:** ఎమ్మెల్యేలు, ఎంపీలు వరుసగా పార్టీని వీడుతుండడంతో టీఎంసీ రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దీంతో టీఎంసీని కాంగ్రెస్లో విలీనం చేయడం కోసం ఇటీవల జరిగిన ఇండియా కూటమి సమావేశంలో ఇరుపార్టీల నేతలు చర్చించినట్టు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ ప్రచారాలను పార్టీ నేతలు కొట్టిపడేశారు. కాగా ప్రస్తుతం మమతా బెనర్జీతో ఉన్న టీఎంసీ ఎంపీలు అభిషేక్ బెనర్జీ నేతృత్వంలో నేడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో రహస్యంగా సమావేశమయ్యారు. దీంతో కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం కానుందనే వార్తలకు బలం చేకూరినట్లైంది. కాగా కాంగ్రెస్‌లో విలీనానికి టీఎంసీ నేతలే మొదట ప్రతిపాదన తెచ్చారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

సొంత పార్టీ నేతల నుంచి తిరుగుబాటు ఎదురవుతుండడం, పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారడంతో ఈ విలీనానికి మమత కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీ ఇమ్రాన్ మసూద్ ఇరు పార్టీల విలీనానికి బహిరంగంగా పిలుపునిచ్చిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

# టీఎంసీ రెబల్స్‌లో యూసఫ్ పఠాన్, శత్రుఘ్న సిన్హా



**కోల్‌కతా, జూన్10:** టీఎంసీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి వరుస షాక్లు తగులుతున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌లో తీవ్ర సంక్షోభం కొనసాగుతున్న నేపథ్యంలో ఇటీవల లోక్సభలోని 20మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతిస్తున్నట్లు వెల్లడించిన విషయం తెలిసిందే. వారిలో భారత మాజీ క్రికెటర్, ఎంపీ యూసుఫ్ పఠాన్, నటి సయోనీ ఘోష్, నటుడు శత్రుఘ్న సిన్హా ఉన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. రెబల్ ఎంపీలు లోకసభ స్పీకర్‌కు ఇచ్చిన లేఖపై వీరు సంతకాలు చేసినట్లు తెలిపాయి. బెంగాల్ శాసనసభలో ఇప్పటికే టీఎంసీ ఎమ్మెల్యేలు రెండు వర్గాలుగా చీలిపోయారు. రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని 60కి పైగా తిరుగుబాటు ఎమ్మెల్యేల బృందం తామే నిజమైన తృణమూల్ వర్గం అని ప్రకటించుకుంది.

# బ్లాక్ గ్రానైట్ క్వారీలను పరిశీలించిన మంత్రి



**గుడిపాల, జూన్ 10 మనం న్యూస్ః** చిత్తూరు జిల్లా గుడిపాల మండలం కుప్పిగానిపల్లి పసుమంద గ్రామ పరిధిలోని బ్లాక్ గ్రానైట్ క్వారీని, ఎక్సైజ్ మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. బుధవారం గుడిపాల మండలం కుప్పిగానిపల్లి పసుమంద గ్రామ పరిధిలోని బ్లాక్ గ్రానైట్ ను సంబంధిత శాఖాధికారులతో కలిసి క్వారీ తనిఖీ నిర్వహించారు.ఆ ప్రాంతంలో గల క్వారీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరువాత మంత్రి ముడి బ్లాక్ గ్రానైట్ బ్లాక్ స్టోన్ అలాగే గ్రానైట్ స్లాబ్స్ ను సందర్శించారు. అలాగే గ్రామ పరిధిలో గల 12 గ్రానైట్ క్వారీలను క్వారీ పటం చూస్తూ వాటి హద్దులను,గ్రానైట్ బ్లాక్ విలువను ఏ విధంగా క్వారీ పనులు జరుగుతున్నాయని వివరాలు అధికారులను వారి యజమానులను అడిగి తెలుసుకున్నారు. చిత్తూరు జిల్లాలో ఇతర క్వారీ యాజమాన్యులను పిలిచి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. అలాగే చిత్తూరు జిల్లాలో గ్రానైట్ పరిశ్రమలు ప్రభుత్వం నుండి అన్ని సహాయ సహకారాలు అందజేస్తున్నాయని మంత్రి క్వారీ యజమానులకు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, స్థానిక చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మైన్స్ డిడి సత్యనారాయణ, పలమనేర్ ఎడి ఆనంద్, మైన్స్ సిబ్బంది, క్వారీ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

# మోహినీ రూపంలో మురిపించిన వేణుగోపాలుడు

## పల్లకిపై దివ్య విహారం... భక్తులకు కనుల పండువ

## చెక్కభజనలు, కోలాటాల మధ్య భక్తి తరంగంగా వాహనసేవ



**తిరుపతి, జూన్ 10(మనం న్యూస్)ః** కార్వేటినగరం శ్రీ రుక్మిణి-సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారు మోహినీ అలంకారంలో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చి అలరించారు. 7.30 గంటలకు పల్లకిపై గ్రామ వీధుల్లో విహరించిన స్వామివారు భక్తులను కటాక్షించారు. వాహనసేవకు ముందుగా భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో భక్తిరసాన్ని పంచగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు అత్యంత వైభవంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూరహారతులు సమర్పిస్తూ గోవింద నామస్మరణలతో స్వామివారిని దర్శించుకున్నారు. మాయపై విజయం సాధించే సందేశమే మోహినీ అవతారం అసురులను మోహింపజేసి దేవతలకు అమృతాన్ని అందించేందుకు శ్రీమహావిష్ణువు ధరించిన మోహినీ అవతారాన్ని పురాణాలు విశదీకరిస్తున్నాయి. మోహినీ అలంకారంలో స్వామివారిని దర్శించుకోవడం ద్వారా మాయను అధిగమించి ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని ఈ అవతారం సందేశం ఇస్తుంది. నేడు రాత్రి గరుడవాహనంపై దివ్య దర్శనం బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన గరుడవాహన సేవ బుధవారం రాత్రి 7 గంటల నుండి జరగింది.ఈ సందర్భంగా స్వామివారు గరుడునిపై భక్తులకు దివ్య దర్శనం ఇవ్వనున్నారు. వాహనసేవలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చెంగల్రాయులు, ఆలయ అర్చకులు, అధికారులు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# భక్తుల పాలిట 'అక్షయ పాత్ర' టీటీడీ నిత్యాన్నదాన కార్యక్రమం

- **15.8 టన్నుల బియ్యంతో నిత్యం మహాయజ్ఞంలా కొనసాగుతున్న అన్నప్రసాద సేవ**
- **రోజుకు దాదాపు 3 లక్షల మందికి అన్నప్రసాదం అందిస్తున్న టీటీడీ**
- **2026 జనవరి నుండి మే వరకు 4.40 కోట్లకు పైగా సర్వింగ్స్**
- **అన్నప్రసాదం ట్రస్టుకు రూ.2,460 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు**



**తిరుమల జూన్ 10 మనం న్యూస్ః** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో టీటీడీ నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ ఆధ్వర్యంలోని ఉచిత అన్నదాన కార్యక్రమం నిత్యం మహాయజ్ఞంలా కొనసాగుతోంది. దేశ విదేశాల నుంచి తిరుమలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని ఉచితంగా అందిస్తూ టీటీడీ సేవాభావానికి ప్రతీకగా నిలుస్తోంది. 1985 ఏప్రిల్ 6న ప్రారంభమైన నిత్య అన్నదాన పథకం ప్రస్తుతం శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో నిర్వహించబడుతోంది. సాధారణ రోజుల్లో సుమారు 1.80 లక్షల నుంచి 1.90 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తుండగా, వారాంతాల్లో ఈ సంఖ్య 3 లక్షలకు మించి ఉంటుంది.గత మూడు నెలల సగటు గణాంకాల ప్రకారం రోజుకు సుమారు 70 వేల మందికి పాలు, టీ, కాఫీ వంటి పానీయాలు అందిస్తున్నారు. అలాగే 60,200 మందికి అల్పాహారం, 99,500 మందికి మధ్యాహ్న భోజనం, 56,700 మందికి రాత్రి భోజనం వడ్డిస్తున్నారు. ఈ విధంగా రోజుకు దాదాపు 3 లక్షల సర్వింగ్స్ భక్తులకు అందుతున్నాయి.

ప్రధాన అన్నప్రసాద భవనం అయిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో రోజుకు 82 వేల మందికి పైగా భోజనాలు అందుతుండగా, శ్రీ అక్షయ కిచెన్, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కాంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు, క్యూ లైన్ల వెలుపల ఏర్పాటు చేసిన కేంద్రాలు, ꠸అఇ అన్నప్రసాద భవనాలు తదితర ప్రాంతాల్లో లక్షలాది మంది భక్తులకు ఆహారం, పానీయాలు అందిస్తున్నారు.

**15.8 టన్నుల బియ్యంతో భక్తులకు నాణ్యమైన ఆహారం**

భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు రోజుకు సుమారు 15,788 కిలోల బియ్యం వినియోగిస్తున్నారు. అదేవిధంగా 3,110 కిలోల సన్ఫ్లవర్ ఆయిల్, 2,861 కిలోల కందిపప్పు, 2,832 కిలోల సుజీ రవ్వ, 2,825 కిలోల గోధుమ రవ్వ, 1,729 కిలోల మినపప్పు, 1,436 కిలోల ఉప్పు, 1,276 కిలోల బెల్లం, 497 కిలోల చింతపండు వినియోగిస్తున్నారు. అలాగే రోజుకు 4,375 కొబ్బరికాయలు, 430 కిలోల చక్కెర, 309 కిలోల ఎండు మిర్చి, 209 కిలోల ధనియాలు తదితర ముడి పదార్థాలు ఉపయోగిస్తున్నారు.

**2026 జనవరి నుండి మే వరకు 4.40 కోట్లకు పైగా సర్వింగ్స్**

2026 జనవరి 1 నుండి మే 31 వరకు తిరుమలలోని వివిధ అన్నప్రసాద కేంద్రాల ద్వారా మొత్తం 4.40 కోట్ల సర్వింగ్స్ భక్తులకు అందించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో జనవరిలో కోటి, ఫిబ్రవరిలో 71.39 లక్షలు, మార్చిలో 84.85 లక్షలు, ఏప్రిల్లో 85 లక్షలు, అలాగే మే నెలలో 92 లక్షలకు పైగా భక్తులకు అన్నప్రసాదం, అల్పాహారం, పానీయాలు అందించారు. అన్నప్రసాదం నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు టీటీడీ పలు ఆధునిక చర్యలు చేపట్టింది. చట్నీలు, కూరల తయారీలో తాజా కొబ్బరికాయల వినియోగాన్ని ప్రవేశపెట్టింది. 2024లో వకుళమాత సెంట్రలైజ్డ్ కిచెన్ను ప్రారంభించి అదనంగా 28 ప్రాంతాలకు ఆహార పంపిణీ సేవలను విస్తరించింది. అదేవిధంగా నూతనంగా ప్రారంభించిన పిఏసి-5 (వెంకటాద్రి నిలయం)లో సుమారు 1,500 మంది ఒకేసారి భోజనం చేసే సామర్థ్యంతో కొత్త డైనింగ్ హాల్ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రోజుకు 2 లక్షల మంది భక్తులకు ఆహారం తయారు చేయగల సామర్థ్యంతో కొత్త శాటిలైట్ ఆటోమేటెడ్ కిచెన్ నిర్మాణానికి చర్యలు కొనసాగుతున్నాయి. యంటివిఏసి కిచెన్లో ఆధునిక వంట పరికరాల ఏర్పాటు, క్యూఆర్ కోడ్ ఆధారిత విరాళాల సేకరణ కియోస్క్ ఏర్పాటు వంటి కార్యక్రమాలు కూడా చేపట్టారు.

**రూ.2,500 కోట్లకు పైగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు**

భక్తుల విరాళాలతో నిర్వహించబడుతున్న శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ వద్ద ప్రస్తుతం రూ.2,500 కోట్లకు పైగా ఫిక్స్డ్ డిపాజిట్లు ఉన్నాయి. ఈ నిధుల ఆదాయంతో లక్షలాది మంది భక్తులకు నిత్యం ఉచితంగా నాణ్యమైన భోజనం అందిస్తూ టీటీడీ 'అన్నదానం మహాదానం' అనే భారతీయ సనాతన సంప్రదాయాన్ని సమర్థవంతంగా కొనసాగిస్తోంది. శ్రీవారి సన్నిధిలో ఆకలితో వచ్చే ప్రతి భక్తునికి తృప్తికరమైన భోజనం అందించడం ద్వారా టీటీడీ అన్నప్రసాద సేవలు ప్రపంచవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయి.

మనం Manam



# మేడారం అభివృద్ధి పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి



- భక్తులకు శాశ్వత సౌకర్యాలను కల్పించాలి
- మంత్రి సీతక్క

**తాడ్వాయి, జూన్ 10, మనం ప్రతినిధిః** మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతల ఆలయ ప్రాంగణాన్ని భక్తి భావం ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని, పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. బుధవారం తాడ్వాయి మండలం మేడారం హరిత హోటల్లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావుతో కలిసి మేడారం అభివృద్ధి పనుల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ మేడారం మహాజాతర ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందని, జాతర సమయంలో మాత్రమే కాకుండా ఏడాది పొడవునా భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ ప్రాంగణం, జంపన్నవాగు పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారులు, భక్తుల రాకపోకల మార్గాలను నిరంతరం పరిశీలిస్తూ, ఆలయ ప్రాంగణంలో భద్రత, పరిశుభ్రత, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వనదేవతల ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో శాశ్వత నిర్వహణ వ్యవస్థ ఉండేలా అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక మెయింటెనెన్స్ కమిటీని ఏర్పాటు చేయాలని, కమిటీ నిర్వహణ కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. భక్తుల నుంచి వచ్చే సమస్యలకు వెంటనే స్పందించే విధంగా సమన్వయ వ్యవస్థ రూపొందించాలని సూచించారు. సమ్మక్క-సారలమ్మ ఆలయానికి గోదావరి పుష్కరాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశమున్నందున ముందస్తుగా మౌలిక సదుపాయాలను కల్పించాలని పేర్కొన్నారు. శాశ్వత స్నాన ఘట్టాలు, విశ్రాంతి గదులు, ఇతర సౌకర్యాలను దశల వారీగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జంపన్నవాగు ప్రాంతాన్ని పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని పేర్కొన్నారు. మేడారం పరిసర ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం శాశ్వత ప్రాతిపదికన మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, వనదేవతల ఆలయ పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మేడారం జాతర సమయంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ నిరంతరం పనిచేసేలా నిర్వహణ చర్యలు చేపట్టాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. శాశ్వత ప్రాతిపదికన 30 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. వరదల నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ అధికారులు గోదావరి నది పరివాహక ప్రాంతంలోని గ్రామాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, గ్రామాల్లోని కుంటలు, చెరువులు, కరకట్టల పరిస్థితిని అంచనా వేసి అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. అనంతరం మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు తో కలిసి మన దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో, డీఎఫ్వో వికాస్ మీనా, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్ రావు, జిల్లా అధికారులు, పూజారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఈనెల 15న సీఎం రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లాకు రాక

- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్లగొండ,జూన్ 10(మనం ప్రతినిధి)ః** ఈనెల 17న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లాకు రానున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన జిల్లాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల నిమిత్తం నల్గొండ జిల్లాకు వచ్చిన మంత్రి మాన్యం చెల్క ఉర్దూ మీడియం ప్రైమరీ పాఠశాల పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 13000 కోట్ల రూపాయలతో' హ్యాం రోడ్లను' నిర్మించనున్నామని, ఇందులో భాగంగా 6300 కిలోమీటర్ల రోడ్లను డబుల్ రోడ్డు గా మార్చేందుకు టెండర్లు పిలవడం జరిగిందని, పనులు కూడా ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 17న సాయంత్రం కనగల్ సమీపంలో హ్యాం రోడ్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారని ,అనంతరం ధర్వేశిపురం ఎల్లమ్మ దర్శనం చేసుకొనున్నారని తెలిపారు. పంచాయతీరాజ్ కి సంబంధించి మరో 7,000 కోట్ల రూపాయలతో నూతన రహదారులు నిర్మించనున్నట్లు చెప్పారు. హ్యాం రోడ్ల లో భాగంగా మొదటి ప్యాకేజీ కింద సిఆర్ఎఫ్ ద్వారా 300 కోట్ల రూపాయలతో ధర్వేశిపురం నుండి గుర్రంపోడు, కొండమల్లేపల్లి నుండి డిండి వరకు డబుల్ రోడ్డు చేపట్టడం జరిగిందని, మొత్తం 34 ప్యాకేజీలుగా విభజించామని, 13000 కోట్ల రూపాయల పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. నల్గొండ తో పాటు, వలిగొండ ,ఆలేరు తదితర ప్రాంతాల కు కూడా 600 కోట్ల రూపాయలతో రోడ్లు నిర్మించనున్నమని తెలిపారు. అలాగే నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో 125 కోట్ల రూపాయలతో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ కు ఈ వారంలో టెండర్లు పిలువనున్నామని ,నల్గొండ పట్టణాన్ని తెలంగాణలోనే నంబర్ వన్ గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు.

# రహదారి భద్రత ప్రతి పౌరుని బాధ్యత

- ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్
- అజాగ్రత్త నిర్లక్ష్యం వల్లనే రోడ్డు ప్రమాదాలు
- రోడ్లపై పరిస్థితులను గమనిస్తూ ముందుకు సాగాలి
- రోడ్డు ప్రయాణంలో అవగాహన, చైతన్యం మార్పు రావాలి
- జిల్లా ఎస్పీ నరసింహ






**సూర్యాపేట, జూన్ 10 (మనం ప్రతినిధి):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించి జిల్లా కేంద్రంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి త్రివేణి ఫంక్షన్ హాల్ వరకు సూర్యాపేట పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు, పౌరులు లతో కలిసి అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత ర్యాలీ నిర్వహించారు .త్రివేణి ఫంక్షన్ హాల్ నందు పౌరులకు అవగాహన సదస్సు జిల్లా కలక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఎస్పీ నరసింహ హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి, జిల్లా రక్షణ గురించి మాట్లాడినట్లయితే పౌరుల రక్షణ ముఖ్యమైనది, పౌరుల భద్రత రక్షణలో పోలీసు శాఖ అనుక్షణం పని చేస్తుంది అని కలక్టర్ తెలిపినారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అనేక రకాల అవగాహన కార్యక్రమాలు, గ్రామ సభలు నిర్వహిస్తున్నాం ప్రజలను చైతన్య పరుస్తున్నాం అన్నారు. నేటి కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు ఆధ్వర్యంలో ఎస్పీ నరసింహ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. రోడ్డు ప్రమాదాల నివారణలో, రోడ్డు ప్రమాద మరణాలు సంభవించకుండా అధికారులు సంకల్పంతో పని చేయాలి పోలీస్, రోడ్డు ట్రాన్స్పోర్ట్, ఆర్టీసీ, ఇతర శాఖలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులను కాపాడి సహాయసహకారాలు అందిస్తే రహవీర్ గా గుర్తింపు వస్తుంది అన్నారు, రహదారి భద్రత ప్రతి ఒక్కరి భద్రత అని స్పష్టం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ...రోడ్డు భద్రత అంటే రోడ్డు పై ప్రయాణం చేసేసమాజంలో ప్రజలు, వాహనదారులు సురక్షితంగా గమ్యం చేరడం. ప్రతి సంవత్సరంకాలంలో తెలంగాణ వ్యాప్తంగా 7500 కు పైగా ప్రాణాలు కోల్పోతున్నారు అని తెలిపారు. మన జిల్లాలో సగటున సంవత్సరానికి 250 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. అధిక ప్రమాదాలు నిర్లక్ష్యం, అజాగ్రత్త వల్లనే సంభవిస్తున్నాయి, తప్పుడు మార్గంలో వాహనాలు నడపడం, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, పిల్లలు వాహనాలు నడపడం, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడం, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి వీటిని నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరు జాగ్రతగా అవగాహనలో వాహనాలు నడపాలి, రోడ్లపై ప్రయాణ సమాజంలో చైతన్యం మార్పు రావాలి అన్నారు. పోలీసు శాఖ అనుక్షణం అవగాహన కల్పిస్తూ ఎన్ఫోర్స్మెంట్ నిర్వహిస్తున్నది అర్వపల్లి, మోతే, చివ్వేంల, మునగాల, తుంగతుర్తి పోలీసు స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాద సంఘటనలు వివరించారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు ఎన్ని బాధలు పడుతున్నాయి అనేది వివరించారు. డిఫెన్సిఫ్ డ్రైవింగ్ చేయాలి, అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలి అన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు ఎక్కువ మంది హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకోక పోవడం వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు అని గంకాలు చెప్తున్నాయి అని వెల్లడించారు విద్యాసంస్థలు ప్రారంభం అవుతున్నాయి విద్యార్థులను బస్సులు, ఇతర వాహనాలు కండిషన్ లేకుంటే సీజ్ చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా హెల్మెట్ ధరించాలని రోడ్డు భద్రత ప్రతిజ్ఞ ఈ కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్, ఆర్టీవో ఆదిత్య, సూర్యాపేట పట్టణ, రూరల్ సిఐ లు రాజశేఖర్, వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఆర్టీసీ ఇన్స్పెక్టర్ సైదులు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు ప్రవీణ్ కుమార్, జానయ్య, పట్టణ ఫైర్ స్టేషన్ అధికారి జానయ్య, అసిస్టెంట్ మోటార్ ట్రాన్స్పోర్ట్ అధికారి సతీష్, ఎస్ఐ లు ఏడుకొండలు, మహేందర్ నాథ్, సాయిరాం ఆర్ఎస్ఐ లు అశోక్, రాజశేఖర్, అన్వర్, షి టీమ్ సిబ్బంది, టెక్నికల్ టీం సిబ్బంది, రోడ్డు సేఫ్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# బండ్లపల్లిలో ప్రజా పాలన గ్రామసభ

**తిరుమలగిరి, జూన్ 10 (మనం న్యూస్):** తిరుమలగిరి మండలం బల్లపల్లి గ్రామంలో సర్పంచ్ బర్ల వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ బుధవారం నిర్వహించారు. సభ లో వర్షాకాల సన్నద్ధత, సురక్షిత మంచినీరు, ఘన వ్యర్థాల నిర్వహణ ,జల సంరక్షణ- వన సంరక్షణ ,మొక్కల పెంపకం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ,వరద నిర్వహణ భద్రత, ఎలినీనో వలన పంట మార్పిడి అంశాలపై చర్చించారు. ఈ గ్రామ సభలో స్పెషల్ ఆఫీసర్ మండల తహసిల్దార్ బి.హరిప్రసాద్,ఏఈవో మహిత, విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ గిరిబాబు,ఉప సర్పంచ్ ,వార్డు సభ్యులు, లైన్ మెన్ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు, ఏఎన్ఎం, అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు, ఫీల్ అసిస్టెంట్, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




# నత్త నడకన రోడ్డు అభివృద్ధి పనులు



- ఏడాది గడిచిన పూర్తి గాని అభివృద్ధి పనులు

**భీమదేవరపల్లి జూన్ 10 మనం న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ రోడ్డు అభివృద్ధి పనులు నత్త నడకలో సాగుతున్న వైనం ఇది... దేవుడు వరమిచ్చిన పూజారి ప్రసాదం ఇవ్వని విధంగా తెలంగాణ రాష్ట్ర మంత్రి స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ గత జులై 18 రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభించిన అభివృద్ధి పనులకు అతీగతి లేకుండా కొనసాగడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవడం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముల్కనూర్ ఎస్బిఐ దగ్గర నుండి కొత్త పల్లి క్రాస్ వద్ద వరకు కోటి 35 లక్షల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడంతో నిర్లక్ష్యానికి గురి కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పనులు త్వరితగతిన ప్రారంభమైన, పనులు నత్త నడకతో ఉండడంతో కంకర పోసి వదిలివేయడంతో కాలినడకన నడిచే, వృద్ధులు, మహిళలు, వాహనాలతో వెళ్లే తదితరులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా ఉండడం గమనర్హం. స్థానిక మంత్రి చొరవ తీసుకొని రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ శిక్షణ



**సూర్యాపేట, జూన్ 10 (మనం ప్రతినిధి)ః** కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా ప్రభుత్వ పాఠశాల పిల్లలకు కూడా అత్యాధునిక సాంకేతిక అవకాశాలు దక్కాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను భవిష్యత్తు సాంకేతికత వైపు నడిపించేందుకు సూర్యాపేట జిల్లా అధికారులు డిజిటల్ . ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్య ద్వారా విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దేందుకు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. టీ-ఫైబర్, సూపర్ టీచర్ ఎడ్యు రిఫారమ్స్ సంస్థల సహకారంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న నెల రోజుల ఏఐ శిక్షణా కార్యక్రమం పోస్టర్ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆవిష్కరించారు. ఈ శిక్షణా కార్యక్రమం 2026 జూన్ 15 నుండి జూలై 11 వరకు నెల రోజుల పాటు కొనసాగనుంది. మొదటి విడతగా జిల్లాలోని నాలుగు పాఠశాలల్లో దీనిని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... డిజిటల్ యుగంలో రాణించడానికి ఏఐ అక్షరాస్యత ఎంతో కీలకమని, ఇది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి భారతదేశ డిజిటల్ పరివర్తన ప్రయాణంలో వారిని భాగస్వాములను చేస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎమర్జింగ్ టెక్నాలజీస్ మరియు డిజిటల్ సాధనాలను బాధ్యతాయుతంగా ఎలా వాడుకోవాలో నేర్పడం ద్వారా వారి ఉపాధి అవకాశాలను మెరుగయ్యే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్టు గా సూర్యాపేట.. ఈ పైలట్ ప్రాజెక్ట్ ద్వారా సూర్యాపేట జిల్లాలోని వందలాది మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నేరుగా లబ్ధి పొందనున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయితే, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను విస్తరించడానికి ఇదొక రోల్ మోడల్గా నిలుస్తుందని విద్యాశాఖ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ గఫ్ఫార్, టీ-ఫైబర్, సూపర్ టీచర్ ఎడ్యు రిఫారమ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్దే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు

- మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్న వెంకటరెడ్డి



**నేరేడుచర్ల, జూన్ 10 మనం న్యూస్:** రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్న వెంకటరెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నేరేడుచర్ల మున్సిపల్ పరిధిలోని 2,3,6,9,10,11 వార్డుల సభను స్థానిక పురపాలక సంఘ కార్యాలయం నందు బుధవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. అర్హులైన వారందరికీ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని త్వరలో ఇందిరమ్మ ఇల్లు పెన్షన్లు రానున్నాయని అర్హులైన వారందరికీ అందిస్తామన్నారు.రానున్న వర్షాకాలంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పారిశుధ్యం పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ చన్నబోయిన నాగరాజు తెలిపారు. ఈ సమావేశంలో హుజూర్నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు మాట్లాడారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ఫోక్సో చట్టం తీసుకువచ్చిందని చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బావి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన నేటి యువత లో కొంతమంది గంజాయికి బాని అయి బంగారం లాంటి జీవితం నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. నేటి ఆధునిక ప్రపంచంలో సెల్ ఫోన్ సర్వసాధారణమని సైబర్ నేరాల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సైబర్ నేరాల గురించి వివరించారు. అనంతరం రోడ్డు భద్రత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీడియో ప్రజెంట్ చేశారు. ఆ జాగ్రత్తగా వాహనాలు నడిపి ఇతరుల జీవితాలు నాశనం చేయొద్దని సూచించారు. ఇటీవల అదుపుతప్పిన బొ లేరా వాహనం ఒకరి మృతికి కారణమైందని మృతుని కుమార్తె చెప్పిన మాటలు కంటతడి పెట్టించాయి. అనంతరం మున్సిపల్ సిబ్బందికి హెల్మెట్లను పంపిణీ చేశారు. మూడో వార్డు కౌన్సిలర్ దొండపాటి అప్పి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యూరియా యాప్ ను రద్దు చేయాలని ఒకటో వార్డులో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ ను తక్షణమే అక్కడి నుంచి తరలించాలని రెండు మూడు వార్డుల నుండి ఇటీవల వేసిన సిమెంట్ రోడ్డు శ్రీ సరస్వతి శిశు మందిర్ ముందర అసంపూర్తిగా మిగిలిపోయిందని తక్షణమే పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి కౌన్సిలర్లు యాదవ లక్ష్మి ఇంజమూరి శ్రీకాంత్ ఇంజమూరి వెంకటమ్మ మహమూద్ షాహిన్ కో ఆప్షన్ సభ్యులు అలక శ్రావణ్ రెడ్డి షేక్ మొగలాభి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి స్థానిక ఎస్ప్ సైదిరెడ్డి డాక్టర్ నాగిని తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ముస్లింలకు రిజర్వేషన్ తో పాటు నాణ్యమైన విద్యను అందిస్తాం
- విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తాం
- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్లగొండ, జూన్ 10 (మనం ప్రతినిధి)ః** తమ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్ తో పాటు, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.బుధవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని మాన్యం చెల్క లో 44 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఉర్దూ మీడియం ప్రైమరీ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నూతనంగా నిర్మించనున్న ఉర్దూ మీడియం ప్రైమరీ పాఠశాల నిర్మాణ పనులు రేపటినుండి ప్రారంభమవుతాయని, అవసరమైతే కోటి రూపాయల వరకు ఖర్చు చేసి మంచి భవనాన్ని నిర్మిస్తామని మంత్రి తెలిపారు. తమ ప్రభుత్వం విద్యకు, వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నదని అన్నారు. గతంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉర్దూను రెండవ భాషగా చేయడం జరిగిందని, సచార్ కమిటీ సిఫారసుల మేరకు ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించడం జరిగిందన్నారు. విద్య, ఉద్యోగాలలో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నామని, రిజర్వేషన్ తో పాటు, నాణ్యమైన విద్యను అందించేందుకు తాను కృషి చేస్తున్నట్టు తెలిపారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంప్యూటర్ విద్యతో పాటు, ఏఐ శిక్షణ కూడా ఇవ్వడం జరుగుతున్నదని, ఈ అవకాశాన్ని ముస్లిం మైనార్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే బొట్టు గూడా పాఠశాలలో సైతం చిన్న తరగతుల నుండే విద్యార్థులకు ఏఐ లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఉర్దూ మీడియం ప్రైమరీ స్కూల్ ను కూడా బొట్టుగూడ పాఠశాలలా తీర్చిదిద్దుతామని మంత్రి వెల్లడించారు. ముస్లిం మైనార్టీలకు 10 కోట్ల రూపాయలతో షాదీఖానా నిర్మించనున్నామని,పట్టణ ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే కార్పొరేటర్ల దృష్టికి తీసుకురావాలని, లేదంటే తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. పేద ముస్లిం మైనార్టీలకు ఇందిరమ్మ ఇండ్లను ఇస్తామని, అలాగే ఎక్కడైనా స్థలం ఉంటే ఇల్లు నిర్మించి ఇస్తామని మంత్రి తెలిపారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధానతనిస్తున్నదని అన్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్య, వైద్యం నినాదంతో ముందుకు వెళ్తున్న ఆర్ బి శాఖ మంత్రి ఆదేశాల మేరకు పేద వారందరికీ నాణ్యమైన విద్యను ,వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని, ఉర్దూ మీడియం ప్రైమరీ స్కూల్ భవన నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షులు ఆఫీస్ ఖాన్, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్రావు, మౌలానా సిద్దికి, బషీర్, అక్బర్ ఖాన్, షేక్ చాంద్ పాషా, తదితరులు ఉన్నారు. అనంతరం మంత్రి కలెక్టర్ కార్యాలయం వెనకవైపున ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించారు.చిన్న చిన్న మరమ్మతులన్ని పూర్తి చేసి జులై లో గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# ప్రాజెక్టుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష



**వరగంల్, జూన్ 10(మనంన్యూస్):** జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జేఎసీఆర్డీఎల్ఐఎస్, కొనైమాకుల లిఫ్ట్ ఇరిగేషన్ పథకం (కేఎల్ఐఎస్), వరంగల్ విమానాశ్రయం, మెగా టెక్స్టైల్ పార్క్ (కేఎంటీపీ), ఇన్నర్ రింగ్ రోడ్ (ఐఆర్ఆర్), జాతీయ రహదారి-163జీ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, ఇంజినీరింగ్ విభాగాల ప్రతినిధులతో ప్రాజెక్టుల భూసేకరణ, నిర్మాణ పనులు, పెండింగ్ అంశాలు మరియు ప్రస్తుత పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, నిర్దేశిత గడువులో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనులను వేగవంతం చేసి ప్రజలకు ప్రయోజనం చేకూరేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎఫ్ఓ నిఖిత, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమా ఉమారాణి, ఎన్హెచ్ఏఐ, ఆర్‌బీ, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు సంబంధిత తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# మహాదేవపూర్‌లో గ్రామసభ

## పాల్గొన్న భూపాలపల్లి జిల్లాకలెక్టర్ రాహుల్ శర్మ

**మహాదేవపూర్, జూన్ 10 (మనం న్యూస్):** మండల కేంద్రంలోని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులకార్యక్రమంలో భాగంగా బుధవారం రోజునమహాదేవపూర్ గ్రామ పంచాయతీకార్యాలయంలో సర్పంచ్ హసీనా భానుఅధ్యక్షతన జరిగిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూప్రభుత్వ ఆదేశాలు ప్రకారం జిల్లాలో 4,6,8,10 తేదీలలో అన్ని గ్రామ పంచాయతీలు,వార్డులలో గ్రామసభలునిర్వహించి ప్రజా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలోవిజయవంతంగాప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పూర్తి ప్రణాళిక బద్ధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవగాహన కార్యక్రమాలలో ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు వివరించినట్లు తెలిపారు. ప్రజల నుండి



వచ్చిన ఫీడ్ బ్యాక్ ని కూడా తీసుకుంతున్నామని తెలిపారు. వాతావరణ శాఖ సూచన మేరకు ఎల్ నినో ప్రభావం ఉన్నందున వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రణాళిక ప్రకారం రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని రైతులు సహకరించాలనితెలిపారు.వాతావరణ శాఖ సలహాలు సూచనలు పాటించడం వల్ల వ్యవసాయంలో మెళకువలు పాటించాలని తెలిపారు అలాగే అధికంగా యూరియా



వినియోగించకుండా నానో యూరియా వినియోగించేలా రైతులకు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నానోయూరియావలనతక్కువ మోతాదులో ఎక్కువ దిగుబడి వస్తుందని తెలిపారు. ఎన్నికల సంగం ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు సవరణ జూన్ 15 నుండి జరుగుతున్నదని తెలిపారు.

దేశవ్యాప్తంగా 12రాష్ట్రాల్లోజరిగిందని ఇప్పుడు ప్రస్తుతం మన జిల్లాలో జరుగుతుందని తెలిపారు. ప్రతి ఇంటికి బూతుస్తాయిఅధికారులు వస్తారనిఓటర్లువివరాలనుఇవ్వాలని తెలిపారు. ఓటరు జాబితాలో ఏవైనా సలహాలు సూచనలు అభ్యంతరాలు ఉన్నట్లయితే తహసిల్దార్ కు లిఖితపూర్వకంగా అందజేయాలని తెలిపారు. మీ సమస్యలనుఆయాశాఖలఅధికారులుదృష్టికితీసుకెళ్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వృత్తి శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నమని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పై మరింత ఫోకస్ పెడుతున్నట్లు తెలిపారు.ప్రజలు,ప్రజాప్రతినిధులు యంత్రాంగం సహకారంతో సంక్షేమ పథకాలు అమలులో పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిలా గ్రంధాల సంస్థ చైర్మన్ రాజబాబు, ఉపసర్పంచ్ శ్రీజసంతోష్,ఆర్డీఓరవీందర్, తహసిల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో రవీంద్రనాథ్, వ్యవసాయ శాఖ ఏడిఎ శ్రీ పాల్, సిడిపిఓ రాధిక, పిఆర్ డిఈ సాయిలు,వైద్యాధికారి సుష్మిత, అటవీశాఖ ఎఫ్డిఓ రవి,విద్యుత్తు శాఖ ఏఈ శ్రీకాంత్, ఐకెపి ఎపిఎం రాజన్న, కమ్యూనిటీ కోఆర్డినేటర్ బంధం స్వామి, గ్రామ కార్యదర్శి కల్పన, గ్రామపంచాయతీ పాలకవర్గం, ఇతర శాఖ అధికారులు మరియు గ్రామ ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమం



**మహాదేవపూర్ జూన్ 10మనం న్యూస్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం ఎడపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ ను సర్పంచ్ మోతె నీలారాణి సాంబయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. గ్రామ అభివృది ,వనమహోత్సవం, వరదల నియంత్రణ, వర్షాకాల సన్నద్ధత పైన, ఘన వ్యర్థాల నిర్వహణ ఎస్ డబ్ల్యూ ఎం జల సంరక్షణ,ఓటర్ లిస్ట్ సవరణపారిశుధ్యం మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించి, ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలోఎంపీడీవోసూపర్డెంట్ శ్రీధర్ బాబుఆర్ఐ మోహన్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్ , వివిధ శాఖల లైన్ డిపార్ట్మెంట్అధికారులు, ఉపసర్పంచ్ కృష్ణ వార్డు సభ్యులు మరియుగ్రామప్రజలుపాల్గొన్నారు

# నూకల మోత తగ్గితేనే అన్నానికి రుచి!

- **25 శాతం నూకలతో ఇబ్బందులు**
- **10 శాతం నూకలతో సన్నబియ్యం ఇవ్వాలని లబ్ధిదారుల విజ్ఞప్తి**

**నల్లబెల్లి, జూన్ 10, మనం న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద కుటుంబాలకు నాణ్యమైన సన్నబియ్యం అందించాలనే లక్ష్యంతో బియ్యం పంపిణీ చేపడుతున్నప్పటికీ, ప్రస్తుతం సరఫరా అవుతున్న సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యంలో అధికంగా నూకలు ఉండటంపై నల్లబెల్లి మండలంలోని లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నల్లబెల్లి మండలంలోని రేషన్ కార్డు లబ్ధిదారులు ప్రస్తుతం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందుతున్న బియ్యం నాణ్యతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యంలో సుమారు 25 శాతం వరకు నూకలు ఉండటంతో వంట సమయంలో, భోజనం చేసే సమయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు చెబుతున్నారు. ప్రస్తుతం పంపిణీ అవుతున్న బియ్యంతో వండిన అన్నం త్వరగా మెత్తబడిపోవడం, గంజిలా మారడం, రుచిలో నాణ్యత తగ్గిపోవడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయని మండలంలోని



పలువురు లబ్ధిదారులు పేర్కొన్నారు. ప్రభుత్వం పేద ప్రజల ఆహార భద్రత కోసం ఉచిత బియ్యం అందిస్తున్నప్పటికీ, నాణ్యత విషయంలో మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

నల్లబెల్లి మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులు మాట్లాడుతూ, ప్రస్తుతం అధిక నూకలతో కూడిన బియ్యాన్ని ఎక్కువ పరిమాణంలో అందించడం కంటే, కొంత పరిమాణం తగ్గించినా నాణ్యమైన 10 శాతం నూకలతో కూడిన సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తే ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని సూచిస్తున్నారు. సన్న బియ్యంతో వండిన అన్నం రుచికరంగా ఉండటంతో పాటు చిన్నపిల్లలు, వృద్ధులు కూడా సులభంగా తినగలరని వారు తెలిపారు. సన్నబియ్యం పంపిణీ ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లక్ష్యం కూడా మరింత సమర్థవంతంగా నెరవేరుతుందని లబ్ధిదారులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల అవసరాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నల్లబెల్లి మండలంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రేషన్ బియ్యం నాణ్యతను మెరుగుపరిచే చర్యలు ప్రభుత్వం చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు. పరిమాణం కంటే నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తే ప్రజలకు నిజమైన ప్రయోజనం చేకూరుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# ఎస్సీ ఉప కులాలు ఉన్నత చదువులు చదవాలి

## వర్గీకరణ ఫలితాలను అందిపుచ్చుకోవాలి

## కాటారం ఇంచార్జ్ బెల్లంపల్లి సురేష్ మాదిగ

**మల్హర్, జూన్ 10(మనం న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి బెల్లంపల్లి సురేష్ మాదిగ పలు గ్రామాలను పర్యటిస్తూ ఎస్సి వర్గీకరణ సాధించిన తరుణంలో వర్గీకరణ ఫలితాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గో. టు. విలేజ్ .కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ కాటారం మండలం ఇంచార్జ్ బెల్లంపల్లి సురేష్ మాదిగ గ్రామాల్లో ఉన్నా ఎస్సీ ఉప కులాలు వర్గీకరణ ఫలితాల్లో ముందు వరుసలో ఉండాలని ఉన్నత చదువులు చదవాలని పేర్కొన్నారు . అదే క్రమంలో నస్తురుపల్లి. బొప్పారం. ఇబ్రహీంపల్లి .చింతకాని. పలు గ్రామాల్లో పర్యటిస్తూ విద్య ప్రాముఖ్యతను గ్రామాల్లోని తల్లిదండ్రులకు .యువతకు. విద్యార్థులకు వివరిస్తూ వర్గీకరణ సాధించిన మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించడం జరిగింది ఈ కార్యక్రమంలో . నస్తురుపల్లి గ్రామంలో ఉప సర్పంచి శంకర్ . దేవేందర్ . సత్యం .బొప్పారం గ్రామం లో మంథని శేఖర్ ఇబ్రహీంపల్లి గ్రామంలో మంథని కరుణాకర్ తాళ్లపల్లి కృష్ణ. మంథని రాకేష్ చింతకాని గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షులు రేచర్ల లక్ష్మయ్య ఆతుకూరి మొగిలి ఆత్కూరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు



# దేశ చరిత్రలో మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం కొత్త దిశ నిర్దేశించింది

- **మంత్రి పొన్నం ప్రభాకర్**

**హనుమకొండ జూన్ 10:(మనం ప్రతినిధి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా, వారిని ఆర్టీసీ బస్సుల యజమానులుగా తీర్చిదిద్దిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని మంత్రి పేర్కొన్నారు. మహిళా శక్తి పథకం కింద మండల మహిళా సమాఖ్యలు తమ సొంత నిధులైన రూ.199.08 కోట్ల పెట్టుబడితో 553 ఖీఎఖిఖీఇ బస్సులను కొనుగోలు చేసి సంస్థకు అద్దెకు ఇవ్వడం మహిళల ఆర్థిక స్వావలంబనకు, సమిష్టి శక్తికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఒకప్పుడు రుణాల కోసం ఎదురుచూసిన స్వయం సహాయక సంఘాల మహిళలు నేడు ఆస్తుల యజమానులుగా, పెట్టుబడిదారులుగా ఎదగడం తెలంగాణ ప్రభుత్వ మహిళా సాధికారత విధానాలకు నిదర్శనమని మంత్రి తెలిపారు. ఒక్కో బస్సుకు నెలకు రూ.69,468 అద్దె లభిస్తుండగా, మొత్తం 553 బస్సుల ద్వారా ప్రతి నెల రూ.3.84 కోట్ల ఆదాయం మహిళా సమాఖ్యలకు అందుతోందన్నారు. ఇప్పటివరకు రూ.20.34 కోట్ల అద్దె ఆదాయం మహిళా సంఘాలకు చేరడం ఈ పథకం విజయాన్ని స్పష్టంగా చాటుతోందని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములు, ఆస్తుల యజమానులు, ఆదాయ సృష్టికర్తలుగా మారుతున్నారని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కూడా ఈ పథకం ఎంతో దోహదపడుతోందన్నారు. అదేవిధంగా మహాలక్ష్మి పథకం విజయవంతమైన అమలులో ఈ బస్సులు కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఇప్పటివరకు 315 కోట్లకు పైగా మహిళా ప్రయాణికులు లబ్ధి పొందారని చెప్పారు. ఈ పథకం ద్వారా మహిళలు సుమారు రూ.10,950 కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకోగలిగారని పేర్కొన్నారు. మహిళలు ఆదా చేసుకున్న ఈ మొత్తాన్ని కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, ఆరోగ్యం, స్వయం ఉపాధి మరియు చిన్న వ్యాపారాల కోసం వినియోగిస్తున్నారని మంత్రి వివరించారు. మహిళల చేతిలో మిగిలే ప్రతి రూపాయి కుటుంబ అభివృద్ధికి, సమాజ పురోగతికి దోహదపడుతుందని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహిళా సమాఖ్యలకు మొత్తం 86 బస్సులు కేటాయించబడినట్లు మంత్రి తెలిపారు. ఇందులో వరంగల్ జిల్లాకు 11, హనుమకొండ జిల్లాకు 12 జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు 11 బస్సులు,జనగాం జిల్లా కి 12 బస్సులు ,ములుగు 9, మహబూబాబాద్ జిల్లాకి 16 బస్సులు కేటాయించామని చెప్పారు. దీంతో ఆయా జిల్లాల్లో బస్సుల కొరత తగ్గి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందడంతో పాటు మహిళా సంఘాలు స్థిరమైన ఆదాయ వనరును పొందనున్నాయని మంత్రి పేర్కొన్నారు. లబ్ధిదారుల నుంచి యజమానులుగా, భాగస్వాములుగా తీర్చిదిద్దడం తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం. మహిళా శక్తి పథకం ఆ దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే విప్లవాత్మక కార్యక్రమం అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాల నియంత్రణ సాధ్యం



- **ఆపరేషన్స్ డీజీపీ అనిల్ కుమార్**

**హనుమకొండ జూన్ 10(మనం ప్రతినిధి):** ప్రజల భాగస్వామ్యం, సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను నియంత్రించగలమని డిజిపి అనిల్ కుమార్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యచరణలో భాగం వరంగల్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని మాంగళ్య కల్యాణ వేదికలో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి ఆపరేషన్స్ డీజీపీ అనిల్ కుమార్ తో పాటు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో ముందుగా ముఖ్య అతిథుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన స్థానిక ప్రజలు, యువత ఉద్దేశిస్తూ డిజిపి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గతం లో 1లక్ష73 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, దీని కారణంగా దేశ జీడీపీ 3శాతం నష్టం జరుగుతోందని, మన తెలంగాణ రాష్ట్రంలో గత ఏడాది 7వేలకు పై ప్రజలు రోడ్డు ప్రమాదాల్లో మరణించారని అన్నారు. దీని కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఎన్ని భారీ ప్రమాదాలు జరిగిన ప్రజల్లో మార్పు రావడంలేదని, విదేశాల్లో ట్రాఫిక్ రూల్స్ అతి కఠినంగా ఉంటాయని అక్కడ ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే వీళ్ళల్లో జరిమానాలను విధించబడతాయని పేర్కొన్నారు. కానీ మనదేశంలో మాత్రం ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే తక్కువ గా జరిమానాలు విధించడం ద్వారా వాహనదారులకు భయం లేదని తెలిపారు ,మన దేశంలో రోడ్డు ప్రమాదాలకు ఇది కూడా ఒక కారణమని,ట్రాఫిక్ రూల్స్ మీ భద్రత కోసమని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబందనాలు పాటిస్తే ఎన్నో రోడ్డు ప్రమాదాలను నివారించగలమని సూచించారు., అరైవ్ అలైవ్ ముఖ్య ఉద్దేశం వాహన దారుడు స్వీయ రక్ష పాటిస్తూ క్షేమంగా గమ్య స్థానాలకు చేరుకోవడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని, గత ఆరు నెలలుగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా వరంగల్ కమిషనరేట్ పరిధిలో 15 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గు ముఖం పట్టాయని అన్నారు., ప్రతి ఒక్కరు తమ వంతు భాధ్యత భావిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని ప్రజల భాగస్వామ్యంరోడ్డు ప్రమాదలను నివారించగలమని డీజీపీ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మన రాష్ట్రం అలాగే రాష్ట్రంలో సంవత్సరంలో తొమ్మిది వందల హత్య జరుగుచుండగా, రోడ్డు ప్రమాదాల్లో మాత్రం ప్రతి సంవత్సరం సుమారు 8వేల మందికి పైగా మరణిస్తున్నారని అన్నారు. ఇది ప్రతి ఒక్కరు ఆలోచించాల్సిన విషయమని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనం నడపటం ద్వారా ఈ సమస్య పరిష్కరించుకోగలమని తెలిపారు. అంతకు ముందుగా కార్యక్రమం జరిగే ఆవరణలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలు సంబంధించి ప్రమాదానికి గురైన వాహనాలను ప్రదర్శనకు ఉంచి ప్రమాదం జరిగిన తీరును అధికారులు డిజిపికి వివరించారు, ట్రాఫిక్ రూల్స్ అతి క్రమిస్తే జరిగే పరిణామాలపై జాగృతి కళాబృందం, ట్రాఫిక్ పోలీసులు అవగాహన సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం డీజీపీ చేతుల మీదుగా డ్రైవింగ్ ప్రతిభ కనబరిచిన పోలీస్, ఆర్టీసీ డ్రైవర్లకు ప్రశంస పత్రాలను అందజేయగా, యువతకు హెల్మెట్లు, ఆటో డ్రైవర్లకు కంటి అద్దాలను అందజేశారు. చివరగా ట్రాఫిక్ నిబందనలు పాటిస్తామని స్థానిక యువతతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో డిసిపిలు రాజమహేంద్ర నాయక్, అంకిత్ కుమార్, ధార కవిత, అదనపుడిసిపి ప్రభాకర్ రావు, ఏసీపీలు భీమ్ శర్మ, నర్సయ్య, సత్యనారాయణ తో పాటు వెస్ట్ జోన్, ట్రాఫిక్ కు చెందిన ఇన్స్పెక్టర్లు, ఎస్. ఐ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



**హనుమకొండ జూన్ 10(మనం ప్రతినిధి ):** హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ .డి .రాంకుమార్ బుధవారం కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అవుట్ పేషంట్ విభాగం ,ల్యాబ్ ,లేబర్ రూమ్(ప్రసవ గది) లను పరిశీలించి తగు సూచనలు చేశారు.. ఓపిక సేవలను ఇంకా మెరుగుపరచాలని, అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు కాకపోవడానికి గల కారణాలను వైద్యాధికారి మరియు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు పిహెచ్సికి ఆరు కిలోమీటర్ల పరిధిలోనే ప్రధాన ఆసుపత్రులు అందుబాటులో ఉండటంవల్ల ఇక్కడికి రావడం లేదని తెలియజేయగా కనీసం మూడు కిలోమీటర్ల దూరంలోని ప్రజలకు తగిన అవగాహన కలిగించి వారిని పీహెచ్సీలో ప్రసవానికి ప్రోత్సహించాలన్నారు. అలాగే నేచురుపతి డిస్పెన్సరీని ఆయన సందర్శించి ప్రతిరోజు కనీసం ఒక గంట సేపు పీహెచ్సీకి వచ్చే మొదటి త్రైమాసికం గర్భిణీ స్త్రీలకు సులువైనటువంటి వ్యాయామాలు నేర్పించాలని, అలాగే బిపి ,షుగర్ వ్యాధిగ్రస్తులకు కూడా వారు చేయగలిగిన సులువైన ఎక్సర్సైజులను నేర్పించాలని శిక్షకునికి సూచించారు .వీటివలన వారికి ఆరోగ్యకరమైన జీవనశైలి విధానం అలవాటు అవుతుందన్నారు.30 సంవత్సరంలో పైబడిన 30,721 మంది కి స్క్రీనింగ్ కు నిర్వహించవలసి ఉండగా 15.167 మందికి పరీక్షలు చేశామని తెలుపగా మిగతా వారందరినీ కూడా పరీక్షించి ప్రభుత్వ మందులు వినియోగించుకునేలా ప్రోత్సహించాలన్నారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన ప్రగతి రిపోర్టును ఆయన తనిఖీ చేసి కొన్ని పారామీటర్స్ లో వెనుకబడి ఉండడం గమనించి మళ్లీ తనిఖీకి వచ్చేలోపు పూర్తిస్థాయి లక్ష్యాలను సాధించాలని సూచించారు. అక్కడ ఉన్నటువంటి సిబ్బందిని ఒక్కొక్కరిని వారి యొక్క విధులను మరియు వారు చేసినటువంటి పనిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి స్థానిక వైద్యాధికారి ఎన్సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్ అలాగే ఎమ్మెల్ హెచ్ పి డాక్టర్ ఇర్ఫాన్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు పంట మార్పిడికి సహకరించాలి



- **కలెక్టర్ డా. సత్య శారద**

**హనుమకొండ, జూన్ 10(మనం ప్రతినిధి):** రుతుపవనాల రాక ఆలస్యం కావచ్చనే అంచనాల నేపథ్యంలో రైతులు పంట మార్పిడికి సహకరించాలనివరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా కోరారు. బుధవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వర్ధన్నపేట మండలం బండౌతాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన కలెక్టర్, రసాయన ఎరువుల వినియోగం, గ్రామ పరిశుభ్రత, మహిళల ఆరోగ్యం, బాలికల విద్య, పంట మార్పిడి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ, గతంలో రైతులు అనుసరించిన సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను పునరుద్ధరించాలని సూచించారు.

తక్కువ నీటితో సాగు చేయగల జొన్నలు, మినుములు, పత్తి, ఆయిల్ పామ్ వంటి పంటలను సాగు చేయాలని తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉండటంతో పాటు నేల సారవంతతకు ఉపయోగపడే సూక్ష్మజీవులు నశిస్తాయని చెప్పారు.

అలాంటి చర్యలకు పాల్పడితే జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు.

అధిక రసాయనాలు కలిగిన ఎరువులను ఇళ్లలో ఎక్కువ రోజులు నిల్వ ఉంచరాదని, వాటి నుంచి వెలువడే రసాయనాలు ఆరోగ్యానికి హానికరమని తెలిపారు. ఎరువులు వినియోగించే సమయంలో మాస్క్, గ్లౌజులు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పిలుపునిచ్చిన కలెక్టర్, ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందన్నారు.

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. తడి, పొడి చెత్తతో పాటు బయోవేస్ట్, శానిటరీ వేస్ట్లు వేర్వేరుగా సేకరించడం ద్వారా రీసైక్లింగ్కు అవకాశం కలుగుతుందని, గ్రామాల్లో పరిశుభ్రత మెరుగుపడుతుందని తెలిపారు.

వర్షాకాలంలో దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా నిరోధించి డయేరియా వంటి వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత సమాజ అభివృద్ధికి కీలకమని పేర్కొంటూ పర్యావరణహిత సానిటరీ ప్యాడ్స్ వినియోగించాలని సూచించారు. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం ద్వారా సమాజ పురోగతికి దోహదపడాలని అన్నారు.

గత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో బాలికలు అత్యధికంగా 500కు పైగా మార్కులు సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఖీఇఖ) గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ గ్రామ సభ లో గ్రామ సర్పంచ్ దశరథం, జడ్పి సీఈఓ రామ్ రెడ్డి, ఎమ్మార్వో విజయ్ సాగర్,

ఝుఇఛీౕ వెంకటరమణ. గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్కంఠ పోరులో టీమిండియా ఓటమి

## ఒక్కసారిగా కుప్పకూలిన స్పైడర్ కెమెరా..

ఫుట్ బాల్ మ్యాచ్ లో పెనుప్రమాదం తప్పింది. మ్యాచ్ జరుగుతున్న సమయంలో స్పైడర్ కెమెరా ఒక్కసారిగా కిందపడిన ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. హంగేరీ, కజికిస్థాన్ జట్ల మధ్య స్నేహపూర్వక మ్యాచ్ జరిగింది. ఆ సమయంలో స్పైడర్ కెమెరా తీగలు తెగిపోవడంతో ఒక్కసారిగా అది కిందకు పడిపోయింది. దాదాపు 20 మీటర్ల ఎత్తు నుంచి కిందకు పడింది. ఆ పక్కనే ఓ కెమెరామెన్ ఉన్నాడు. అతడికి కాస్త దూరంలో స్పైడర్ కెమెరా పడిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. దీంతో మ్యాచ్ నిర్వాహకుల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. సరైన ఏర్పాట్లు చేయని ఫెడరేషన్ పై చర్యలు తీసుకోవాలని అభిమానులు డిమాండ్ చేశారు.



## సరికొత్తలుక్‌తో బాలయ్య తాండవం..

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ పుట్టినరోజును ఆయన అభిమానులు పండగలా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. ఇక బాలయ్య అభిమానుల కోసం ఓ సాలిడ్ బర్త్ డే ట్రీట్ ను ఇస్తామని ఎన్బీకే111 మేకర్స్ చెప్పుకొచ్చిన సంగతి తెలిసిందే. వారు చెప్పినట్లుగానే ఈ చిత్రానికి సంబంధించిన పవర్ ప్యాక్డ్ ట్రీట్ ను తాజాగా రిలీజ్ చేశారు. 1 నిమిషం 31 సెకన్ల నిడివితో వచ్చిన ఈ ట్రీట్ అభిమానుల ఎదురుచూపులకు పర్ఫెక్ట్ గా ఉంది. బాలయ్య సరికొత్త లుక్స్, ఆయన బాడీ లాంగ్వేజ్ అదిరిపోయాయి. ఇక గోపీచంద్ మలినేని ముందు నుండి చెబుతున్నట్లు ఈ సినిమాలో వింటేజ్ బాలయ్యను కాకుండా న్యూ ఏజ్ బాలయ్యను మనకు చూపెట్టాడు. బాలయ్య ఎంట్రీకి థమన్ అందించిన స్కోర్ ప్యూర్ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. బాలయ్య మాస్ ఇమేజ్ కు థమన్ ఇచ్చిన సౌండింగ్ అభిమానుల్లో రీసౌండ్ క్రియేట్ చేస్తోంది. మొత్తానికి బాలయ్య పుట్టినరోజు సందర్భంగా నందమూరి అభిమానుల ఆకలి తీర్చేలా ఈ ఎన్బీకే111 ట్రీట్ ఉందని చెప్పాలి. ఇక ఈ సినిమాలో అందాల భామ కాజల్ అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తుండగా వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు ప్రొడ్యూస్ చేస్తున్నారు.

మహిళల టీ20 ప్రపంచకప్ 2026 వార్మప్ మ్యాచ్ ల్లో భాగంగా ఇవాళ (జూన్ 10) జరిగిన తొలి మ్యాచ్ లో భారత్పై ఇంగ్లండ్ 5 పరుగుల తేడాతో గెలుపొందింది. చివరివరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్ లో టీమిండియా పోరాడి ఓడింది.

తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేయగా.. భారత్ 19.5 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటై, లక్ష్యానికి 6 పరుగుల దూరంలో నిలిచిపోయింది.

భారత్ ను గెలిపించేందుకు రిచా ఘోష్ (36 బంతుల్లో 68; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) వీరోచితంగా పోరాడినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. చివరి ఓవర్ లో 17 పరుగులు అవసరం కాగా.. శ్రీచరణి తొలి బంతికి సింగిల్ తీసి రిచాకు స్ట్రయిక్ ఇచ్చింది. అప్పటికే జోష్ లో ఉన్న రిచా.. రెండో బంతిని బౌండరీకి, మూడో బంతిని సిక్సర్ కు తరలించి భారత్ ను గెలుపు వాకిటి వరకు చేర్చింది.

అయితే తొందరగా మ్యాచ్ ను ముగిద్దామనే క్రమంలో నాలుగో బంతికి లిండ్సే స్మిత్ బౌలింగ్ లో స్టంపౌటయ్యింది. అప్పటికీ భారత్ కు గెలిచే అవకాశం ఉండింది. మిగిలిన రెండు బంతుల్లో ఆరు పరుగులు సాధిస్తే టీమిండియాదే గెలుపు. చేతిలో ఓ వికెట్ ఉండింది. అయితే ఐదో బంతికి రేణుకా సింగ్ కూడా ఔట్ కావడంతో భారత్ ఆలౌటై, మ్యాచ్ ను చేజార్చుకుంది.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్ లో యామీ జోన్స్ (64), కెప్టెన నాట్ సీవర్ బ్రంట్ (57) అర్ధ సెంచరీలతో రాణించగా.. ఆఖర్లో డేనియెలా గిబ్సన్ (30 నాటౌట్) బ్యాట్ను ఝులిపించింది. మిగతా ప్లేయర్లంతా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. భారత బౌలర్లలో శ్రేయాంక పాటిల్ 2, షఫాలీ, రేణుకా, శ్రీ చరణి, రాధా యాదవ్ తలో వికెట్ పడగొట్టారు.

భారత ఇన్నింగ్స్ విషయానికొస్తే.. రిచా మినహా జట్టులో ఎవరూ కనీసం 20 పరుగుల మార్కును కూడా తాకలేదు. షఫాలీ (13), యస్తికా (15), హర్మన్ (17), భారతి (18), రాధా యాదవ్ (16) రెండంకెల స్కోర్లు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో లిన్సే స్మిత్ 3, డీన్, కోల్ మన్, గిబ్సన్ తలో 2, వాంగ్ ఓ వికెట్ పడగొట్టారు.

కాగా, ఈ ప్రపంచకప్ రెగ్యులర్ మ్యాచ్ లు జూర్ 12 నుంచి మొదలవుతాయి. తొలి మ్యాచ్ లో ఇంగ్లండ్-శ్రీలంక తలపడనున్నాయి. భారత్ జూన్ 14న జరిగే తమ తొలి మ్యాచ్ లో పాకిస్తాన్ తో తలపడనుంది.



## స్టోక్స్‌పై వేటు!



మద్యం.. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ను మరోసారి చిక్కుల్లో పడేసింది. ఈసారి అతడు కెప్టెన్సీ కోల్పోయేలా ఉన్నాడు. న్యూజిలాండ్ తో తొలి టెస్టులో ఘన విజయం సాధించిన అనంతరం.. ఆ మ్యాచ్ విజయంలో కీలకపాత్ర పోషించిన గస్ అట్కిన్సన్ తో కలిసి అతడు నైట్ క్లబ్ కు వెళ్లాడు. ఇద్దరూ మద్యం మత్తులో ఓ రగ్బీ ఆటగాడితో గొడవకు దిగారు. క్రికెటర్లకు ఎలాంటి దెబ్బలు తగల్లేదుగానీ.. అక్కడే ఉన్న ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) భద్రత సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై ఈసీబీ విచారణ జరుపుతోంది. స్టోక్స్ ను కెప్టెన్సీ నుంచి వైదొలగమని ఈసీబీ ఇప్పటికే స్పష్టం చేసినట్లు సమాచారం. మిగతా సిరీస్ లో స్టోక్స్, అట్కిన్సన్ లను కొనసాగించే అవకాశం లేదని ఈసీబీ వర్గాలు తెలిపాయి. టెస్టు ఫార్మాట్ మాత్రమే ఆడుతున్న స్టోక్స్ ఈ వివాదం కారణంగా క్రికెట్ కు వీడ్కోలు పలికినా ఆశ్చర్యం లేదు. స్టోక్స్ మద్యం కారణంగా ఇబ్బందుల్లో పడటం ఇదే తొలిసారి కాదు. అతిగా మద్యం సేవించిన కారణంగా 2013లో అతడిని సిరీస్ నుంచి అర్ధంతరంగా తప్పించారు. 2017లో బ్రిస్టల్ నైట్ క్లబ్ లో గొడవ కారణంగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఆత్మరక్షణ కోసమే తాను దాడి చేయాల్సివచ్చిందని చెప్పిన అతడిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

## అరంగేట్రంలోనే అదుర్స్.. కౌంటీ క్రికెట్ లోకి మానవ్ సుతార్

అడుగుపెట్టిన తొలి మ్యాచ్ లోనే అదరగొట్టే ప్రదర్శన ఇచ్చాడు యువ స్పిన్నర్ మానవ్ సుతార్. అఫ్సా ఒకే ఇన్నింగ్స్ లో ఆరు వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. బ్యాటింగ్ లోనూ మెరుగైన ఆటతీరే ప్రదర్శించాడు. సీనియర్ రవీంద్ర జడేజాను గుర్తు చేశాడంటూ అభిమానులు సంతోషపడ్డారు. ఈ క్రమంలో మానవ్ అనూహ్య నిర్ణయం తీసుకున్నాడు. ఎర్రబంతి క్రికెట్ లో మెరుగైన ఆటతీరు కోసం కౌంటీ క్రికెట్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. కౌంటీ ఛాంపియన్ షిప్ లో తర్వాత రెండు రౌండ్లలో ఆడతాడని వార్విక్ షైర్ మేనేజ్ మెంట్ ప్రకటించింది. ''మా బౌలింగ్ యూనిట్ కు సుతార్ వైవిధ్యం తీసుకొస్తాడు. కౌంటీ ఛాంపియన్ షిప్ విజేతగా నిలిచేందుకు ప్రయత్నిస్తాం. అతడితో మేం ఒప్పందం చేసుకోవడం సంతోషంగా ఉంది'' అని వార్విక్ షైర్ వెల్లడించింది. మెరుగైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తానని మానవ్ సుతార్ తెలిపాడు. తొలి టెస్టు మ్యాచ్ లోనే ఏడు వికెట్లు తీసిన మానవ్ సుతార్.. 29 ఫస్ట్క్లాస్ మ్యాచుల్లో 129 వికెట్లు పడగొట్టాడు. అతడి బెస్ట్ బౌలింగ్ గణాంకాలు 11/62. ఇక లోయర్ ఆర్డర్లో బ్యాటింగ్ కు వచ్చే అతడు 950కిపైగా పరుగులు చేశాడు.



## గూస్ బంప్స్ తెప్పిస్తున్న అలియా 'ఆల్ఫా' టీజర్


- బాలీవుడ్ ప్రతిష్టాత్మక యశ్ రాజ్ ఫిలమ్స్ స్పై యూనివర్స్ నుంచి వస్తున్న లేటెస్ట్ ఫిమేల్-సెంట్రిక్ యాక్షన్ మూవీ 'ఆల్ఫా' టీజర్ విడుదలైంది.
- అలియా భట్, శర్వరీ వాఘ్ పవర్ ఫుల్ స్పై పాత్రల్లో నటిస్తున్న ఈ ప్రాజెక్ట్ లో అనిల్ కపూర్, బాబీ డియోల్ కీలకమైన రోల్స్ ప్లే చేస్తున్నారు.
- ప్రపంచంలో రెండే రకాల మనుషులు ఉంటారు అంటూ కట్ చేసిన ఈ టీజర్ సినిమాపై భారీ అంచనాలు పెంచుతుండగా.. 2026 జులై 3న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది.

బాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ యశ్ రాజ్ ఫిలమ్స్ స్పై యూనివర్స్ కు ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సల్మాన్ ఖాన్ 'టైగర్', హృతిక్ రోషన్ 'వార్', షారుఖ్ ఖాన్ 'పఠాన్' లాంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత ఈ ఫ్రాంచైజీ నుంచి వస్తున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ 'ఆల్ఫా'. మొదటిసారిగా ఫిమేల్ లీడ్స్ తో, అదీ అలియా భట్, శర్వరీ వాఘ్ లాంటి స్టార్స్ ప్రధాన పాత్రలు చేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఆల్ఫా' అఫీషియల్ టీజర్ ను మేకర్స్ తాజాగా రిలీజ్ చేసి ఇంటర్నెట్ ను షేక్ చేస్తున్నారు.

తాజాగా విడుదలైన ఈ టీజర్ మొదటి ఫ్రేమ్ నుంచే ప్రేక్షకులను యాక్షన్ మోడ్ లోకి తీసుకెళ్లింది. పద్దెనిమిదో ఏట అడుగుపెట్టిన కూతురికి తండ్రి బర్త్ డే విషెస్ చెప్పడంతో టీజర్ ఆసక్తికరంగా మొదలవుతుంది. ఆ వెంటనే నీ 18వ పుట్టినరోజుకు నీ మొదటి మిషన్ కు వెళ్తున్నావు అని చెప్పడం, దానికి ఆమె ప్రపంచంలో రెండు రకాల మనుషులే ఉంటారు.. ఒకటి తోడేలు, ఇంకొకటి గొర్రె.. తోడేలు కూతురు తోడేలే అవుతుంది అని బదులివ్వడం గూస్ బంప్స్ తెప్పిస్తోంది. ఇండియాకు సంబంధించిన నెక్స్ట్ జనరేషన్ సోల్జర్స్ ను తయారు చేసే అత్యంత పవర్ ఫుల్ సీక్రెట్ ప్రోగ్రామ్ పేరే 'ఆల్ఫా' అని టీజర్లో దర్శకుడు క్లారిటీ ఇచ్చారు. ఇక అలియా భట్, శర్వరీ వాఘ్ ఇద్దరూ యాక్షన్ సీన్స్ లో ప్రాణాలు పెట్టి నటించారని టీజర్ లోని స్టన్నింగ్ విజువల్స్ చూస్తే ఇట్టే అర్థమైపోతోంది. శివ్ రావైల్ డైరెక్ట్ చేస్తున్న ఈ హైవోల్టేజ్ స్పై థ్రిల్లర్ లో బాలీవుడ్ సీనియర్ స్టార్ అనిల్ కపూర్, యానిమల్ విలన్ బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటిస్తుండటం మరో మేజర్ అట్రాక్షన్. యశ్ రాజ్ ఫిలమ్స్ బ్యానర్ పై ఆదిత్యా చోప్రా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. మన ఏకైక ఆల్ఫా అంటూ టీజర్ ఎండింగ్ లో వచ్చే డైలాగ్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతోంది. ఇద్దరు పవర్ ఫుల్ హీరోయిన్స్, మైండ్ బ్లోయింగ్ యాక్షన్ ఎపిసోడ్స్ తో వస్తున్న ఈ సినిమాను.. 2026 జులై 3న థియేటర్లలో వరల్ వైడ్ గా గ్రాండ్ గా రిలీజ్ చేయబోతున్నారు.







### ప్రముఖ దర్శకుడు భారతీరాజా కన్నుమూత

చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ తమిళ దర్శకుడు భారతీరాజా (84) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయన నేడు చెన్నైలో కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనున్నారు.

# ఇన్‌స్పైరింగ్ జర్నీ


### వెండితెరపై గ్రామీణ విప్లవం.. భారతీరాజా వ్యక్తిగత జీవితం, ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ విశేషాలు

**భారతీయ వెండితెరపై ముఖ్యంగా దక్షిణాదిలో పల్లెటూరి కథలకు ప్రాణం పోసి, సహజత్వానికి కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన దిగ్గజ దర్శకుడు భారతీరాజా.**

**ఆయనకు భార్య చంద్ర లీలావతి, కుమారుడు మనోజ్ (నటుడు, దర్శకుడు), కూతురు జనని ఉన్నారు; అయితే 48 ఏళ్ల వయసులో మనోజ్ గుండెపోటుతో మరణించడం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిల్చింది.**

**ఐదు దశాబ్దాల సుదీర్ఘ సినీ కెరీర్ లో దర్శకుడిగా, నిర్మాతగా, నటుడిగా చెన్నై, తేని ప్రాంతాల్లో విలాసవంతమైన ఆస్తులను కూడబెట్టుకున్నప్పటికీ.. ఆయన జీవనశైలి మాత్రం చాలా సాధారణంగా ఉంటుంది.**

తేని జిల్లాలోని ఓ కుగ్రామంలో జన్మించిన 'చిన్నస్వామి'.. సినిమా మీద పిచ్చితో మద్రాస్ చేరుకుని 'భారతీరాజా'గా తన పేరును మార్చుకున్నారు. ఆయన ప్రయాణం పూలపాన్పు కాదు. ఎన్నో కష్టాలను ఓర్చుకుని, దర్శకుడిగా తనకంటూ ఒక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. ఆయన పర్సనల్ లైఫ్ విషయానికి వస్తే.. భార్య చంద్ర లీలావతి, కుమారుడు మనోజ్, కూతురు జనని ఉన్నారు. మనోజ్ భారతీరాజా ఇండస్ట్రీలో హీరోగా, దర్శకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. అయితే, దురదృష్టవశాత్తూ ఆయన కుమారుడు మనోజ్ భారతీరాజా (48) మార్చి 25, 2025న చెన్నైలో గుండెపోటుతో మరణించడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. తన షూటింగ్స్ లేనిసమయంలో కుటుంబంతో గడపడానికే భారతీరాజా ఎక్కువగా ఇష్టపడతారు. స్టార్ డమ్ వచ్చినప్పటికీ తన మూలాలను ఎన్నడూ మర్చిపోలేదు.



**భారతీయ సినీ ప్రపంచంలో.. ముఖ్యంగా దక్షిణాది వెండితెరపై గ్రామీణ జీవితానికి కొత్త భాషను నేర్పిన దిగ్గజ దర్శకుడు భారతీరాజా. పల్లెకన్నీరు, పచ్చని పొలాలు, అక్కడి మనుషుల స్వచ్ఛమైన ప్రేమ, వారి ఆనందాలు, బాధలను ఆయన తెరపై ఆవిష్కరించిన తీరు అద్భుతం. అయితే, సినిమాల్లో ఇంతటి సహజత్వాన్ని చూపించిన ఈ క్రియేటివ్ జీనియస్ వ్యక్తిగత జీవితం, ఆయన ఫ్యామిలీ, ఆస్తుల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి అభిమానుల్లో ఎప్పుడూ ఉంటుంది.**

## 'జైలర్' తర్వాత మరో ఇంట్రెస్టింగ్ రోల్‌లోకి మారిన సూపర్ స్టార్?

ప్రస్తుతం కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తో 'జైలర్' సీక్వెల్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై భారీ అంచనాలు నెలకొనగా పాన్ ఇండియా ఆడియెన్స్ ఈ ప్రాజెక్ట్ కోసం ఎగ్జైటెడ్ గా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ సినిమాలో జైలర్ రోల్ లో సూపర్ స్టార్ తన మాస్ చూపించి మళ్ళీ తన ఫ్యాన్స్ కి గట్టి ట్రీట్ అందించారు.

ఇక ఈ రోల్ తర్వాత రజినీకాంత్ మరో ఇంట్రెస్టింగ్ రోల్ లో కనిపించనున్నారని కోలీవుడ్ వర్గాల్లో రూమర్స్ వినిపిస్తున్నాయి. తన కెరీర్ 173వ సినిమాని దర్శకుడు అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. మరి ఈ సినిమాలో రజినీకాంత్ ఒక మిడ్ ఏజ్డ్ డాక్టర్ గా కనిపిస్తారని తెలుస్తుంది. రీసెంట్ గానే ఈ గెటప్ కి సంబంధించిన లుక్ కూడా లాక్ చేసినట్టు టాక్. సో ఈసారి ఓ డాక్టర్ హా రజినీకాంత్ ఎలాంటి ట్రీట్ ఇస్తారో చూడాలి. ఇక ఈ చిత్రానికి అనిరుద్ సంగీతం అందిస్తుండగా కమల్ హాసన్ నిర్మాణం వహిస్తున్నారు.




Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.